సాహితీ వారంతపు ఆదివారం వార్తలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-10-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 259 పేజీలు: 10+4 వెల: 8.00

క్యూనెట్‌స్కాం కీలక నిందితుడు ఢిల్లీలో పట్టివేత 3

ప్రముఖ సంగీత దర్శకుడు దేవా కన్నుమూత 5

## ఇంటర్నెట్.. పిల్లల ప్రాథమిక హక్కు 3



- వయసు ఆధారిత నిషేధానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి
- అభ్యంతరకర కంటెంట్ తొలగింపులో వైఫల్యంపై అసహనం
- ప్రాథమిక పాఠశాల నుంచే అవగాహన కల్పించాలి
- కేంద్రానికి ద్విసభ్య ధర్మాసనం కీలక సూచనలు

## విమాన ఛార్జీల నియంత్రణకు చర్యలు 5



2 వారాల్లో నిబంధనలు నోటిఫై చేస్తామని సుప్రీంకోర్టుకు కేంద్రం వెల్లడి



# మూడు దశల్లో సమగ్ర భూసర్వే

## 285 గ్రామాల్లో ఇప్పటికే పూర్తి



### అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ

### పాలేరులో త్వరలో భూదార్ పట్టాల పంపిణి

### రెవెన్యూ సమీక్షలో మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు17:** రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని పేర్కొన్నారు. భూ సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ సమస్యలు లేని తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో భూ సర్వే పురోగతిపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గానూ తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే >>2

## బతుకమ్మ ప్రపంచ రికార్డు

'ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి తెలంగాణ సంస్కృతి

25 క్వింటాళ్ల పూలతో 72 అడుగుల మహా బతుకమ్మ

వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ దంపతులు 2

కోల్‌కతాలో ఘోరం:

# దుర్గాపూజ మండపం వద్ద తొక్కిసలాట

## 17 మంది దుర్మరణం

### 35 మందికి పైగా తీవ్రగాయాలు

**కోల్‌కతా,అక్టోబరు 17:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర కోల్‌కతాలో శనివారం ప్రముఖ దుర్గాపూజ మండపం వద్ద తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 17 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో కనీసం 35 మందిని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. చోర్ బాగన్ సార్వజనిన్ దుర్గాపూజ మండపం వద్ద ఈ >>2



శనివారం కోల్‌కతాలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

## తెలంగాణ నీటి వాక్కులకు మరణ శాసనం



### ఎపిలో క్రాప్ హాలిడే లేదు.. ఇక్కడ మాత్రం పంటలు వేయొద్దా?

### గోదావరి- కావేరి పేరుతో తెలంగాణ జలాలు ఎపికి తరలించే కుట్ర: హారీష్‌రావు

**హైదరాబాద్,అక్టోబరు17,ప్రభాతవార్త:** గోదావరి-కావేరి పేరుతో తెలంగాణ జలాలు తరలించేందుకు ఎపి ప్రయత్నం చేస్తుందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'నవంబర్ 3న ఢిల్లీలో నేషనల్ వాటర్ డవలప్‌మెంట్ ఏజెన్సీ మీటింగ్ జరగబోతున్నది. ఎజెండా కూడా విడుదలైంది. గోదావరి కావేరీ లింకును ఈ ఎజెండాలో చేర్చుతూ అన్నిరాష్ట్రాలకు పంపారు. గోదావరి కావేరీ లింకుపేరుతో తెలంగాణపై పెద్ద కుట్ర జరగుతున్నది. తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనం రాస్తున్నారు. అడ్డుకోవాల్సిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్రకు మద్దతు పలుకుతూ చారిత్రక ద్రోహానికి పాల్పడుతున్నడు. చంద్రబాబు ఈనెల 7న గోదావరి కావేరీ లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని లేఖరాసారు. లేఖ రాయగానే ఎజెండాలో పొందుపర్చడం, నవంబర్ 3న మీటింగ్ పెట్టడం జరుగుతున్నది' అని పేర్కొన్నారు. మాజీ సిఎం కెసిఆర్ సిఎంగా ఉన్నంతకాలం ఎపి పాలకులు ఏమీ మాట్లాడలేదని >>2

# రహదార్లపై దసరా రద్దీ

### వాహనాలతో కిటకిటలాడుతున్న విజయవాడ వెళ్లే రోడ్లు

### పలు టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జాం

### హైదరాబాద్ నగరంలోనూ అదే సందడి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలకు అప్పుడే దసరా పండగ శోభ వచ్చేసింది. విద్యా సంస్థలకు వరుసగా సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి శుక్రవారం ఉదయం నుండే పెద్ద సంఖ్యలో ప్రజలు



ఎపికి తరలివెళ్లడంతో విజయవాడ జాతీయ రహదారిపై శనివారం రెండవ రోజూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఓవైపు విజయవాడ జాతీయ రహదారి వెడల్పు పనులు జరుగుతుండడం, మరోవైపు కొన్నిచోట్ల మరమ్మత్తులు జరుగుతుండడంతో వాహనదారులు ముందుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంతంగి టోల్‌గేట్‌తో పాటు పలు టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జాంలు ఏర్పడ్డాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దేందుకు విజయవాడ జాతీయ రహదారి మీదుగా ఎపిలోని ఆయా ప్రాంతాలకు వెళుతున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాలను చూపుతున్నారు. ఇదే సమయంలో తెలంగాణలోని ప లు జిల్లాలలోనూ రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. దసరా పండగను పురస్కరించుకుని నగర ప్రజలు సొంత ఊళ్లకు బయలు దే రడంతో హైదరాబాద్‌లోనూ అనేకచోట్ల >>2

## 'దాండియా'లో విషాదం

### నాదర్‌గుల్ ఇంజినీరింగ్ కాలేజీ ఈవెంట్‌లో కిందపడిన లైటింగ్ సిస్టం

### విద్యార్థిని మృతి, 25 మందికి గాయాలు

### ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్



**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాత వార్త:** నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిం చినదాండియా వేడుకల్లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. వేడు కల సమయంలో ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులకు ఈవెంట్ కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ క్రేన్ కూలిపడింది. ఈ ఘటనలో ఒకరు (వనపర్తికి చెందిన సోని) మృతి చెందగా, ఆమె సోదరి పరిస్థితి విషమంగా ఉంది. మొత్తంగా 25 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో ఐదుగురి పరిస్థితి >>2



శనివారం మహబూబ్‌నగర్‌లో మీడియాతో ఎంపి డికె అరుణ

## 'సర్'పై కాంగ్రెస్ అసత్య ప్రచారం

### దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని కుట్ర: ఎంపి డికె అరుణ

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబరు 17 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) పై కాంగ్రెస్, ప్రతిపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని, దేశాన్ని అస్థిరపరచాలని విదేశీ శక్తులతో చేతులు కలుపుతున్నాయని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మహబూబ్ నగర్ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్ కొత్త బ్రహ్మపదార్థం కాదని, దేశంలో ఇప్పటికే 8 సార్లు జరిగిందని, అందులో 6 సార్లు కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని అన్నారు. చనిపోయిన 2.80 కోట్ల ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మారిన 6.3 కోట్ల మంది, కోటి డబుల్ ఓట్లను మాత్రమే తొలగిస్తుంటే, రాహుల్ గాంధీ 13 కోట్ల ఓట్లు తొలగిస్తున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బ్రతికి ఉండి ఓటు పోతే ఫారం6 ద్వారా మళ్లీ నమోదు చేసుకోవచ్చున్నారు. 11 లక్షల మంది అధికారులు, 35 లక్షల మంది బిఎల్‌ఏలతో కలిపి 46 లక్షల మంది ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్నారని, బిఎల్‌ఓలు ఒక్కో ఇంటికి 3 సార్లు వెళ్లి వివరాలు సేకరించారని తెలిపారు. "ఓటు చోరీ జరిగితే కర్ణాటక, తెలంగాణ, కేరళలో కాంగ్రెస్ ఎలా గెలిచింది? తెలంగాణలో మీ ప్రభుత్వమే ఉంది, మీ అధికారులే పని చేస్తున్నారు. ఓట్ల తొలగింపు జరుగుతుందా సీఎం రేవంత్ చెప్పాలి" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నికల కమిషనర్లుగా పని చేసిన ఆర్ కే త్రివేదిని గుజరాత్ గవర్నర్ గా, టిఎన్ శేషన్ ను లోక్ సభ అభ్యర్థిగా, ఎంఎస్ గిల్ ను రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మంత్రిగా నియమించిందని గుర్తుచేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, అంజయ్య, రతంగ పాండు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శనివారం పులివెందులలో పోలీసు పహారా దృశ్యం

### నామినేషన్ల వేళ..

## 'సీమ'రణరంగం

### గాల్లోకి కాల్పులు, బాష్పవాయు ప్రయోగం

### టిడిపి, వైసిపి వర్గాలను అదుపు చేసేందుకు పోలీసుల లాఠీ-ఛార్జి.. పలువురికి తీవ్ర గాయాలు

**పులివెందుల, అక్టోబరు 17:** పులివెందుల పురపాలక సంఘం నామినేషన్ల ప్రక్రియ రెండో రోజే తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలో >>2

### ఆరు నెలలలోపు శిశువుల ఆహారంలో

# సుక్రోజ్, ఫ్రక్టోజ్ మిక్సింగ్‌పై నిషేధం

### కేంద్రానికి ఎఫ్ఎస్ఎస్ఎఐ ప్రతిపాదనలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** ఆరు నెలలలోపు శిశువుల కోసం తయారు చేసే పోషకాహార ఉత్పత్తుల్లో సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లను అదనంగా కలపడాన్ని నిషేధించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ప్రతిపాదించింది. చిన్న వయసులోనే శిశువులకు అదనపు చక్కెరలు అందకుండా చూడటంతోపాటు, వారి ఆహారంలో పోషక ప్రమాణాలను మరింత బలోపేతం చేయడం ఈ ప్రతిపాదన ప్రధాన ఉద్దేశ్యమని వెల్లడించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాఎఫ్ఎస్ఎస్ఎఐ రూపొందించిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్స్ ఫర్ ఇన్‌ఫెంట్ న్యూట్రిషన్) అమెండ్‌మెంట్ రెగ్యులేషన్స్, 2026 ముసాయిదాను ఈనెల 16న భారత గెజిట్‌లో ప్రచురించింది. ఈ ముసాయిదా ప్రకారం, ఆరు నెలల వయస్సు వరకు ఉన్న శిశువుల కోసం ఉద్దేశించిన ఉత్పత్తుల్లో సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లను కలపకూడదని ప్రతిపాదించారు. శిశు పోషకాహార ఉత్పత్తుల్లో పోషక పదార్థాల కూర్పు, నాణ్యత, భద్రతకు సంబంధించిన నిబంధనలను మరింత పటిష్టం చేయడం ఈ సవరణ లక్ష్యం. 2020లో రూపొందించిన ఆహార భద్రత, ప్రమాణాల (శిశు పోషకాహార ఉత్పత్తులు) నిబంధనల ప్రకారం, శిశువుల కోసం తయారు చేసే పోషకాహార ఉత్పత్తులు నిర్దేశిత పోషక ప్రమాణాలు, భద్రతా నియమాలకు అనుగుణంగా ఉండాలి. ప్రస్తుత నిబంధనల్లో లాక్టోస్, గ్లూకోజ్ పాలిమర్లను కార్బోహైడ్రేట్లకు ప్రాధాన్య వనరులుగా పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి, నిర్దేశించిన పరిమితులకు లోబడి సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లను కూడా కలిపేందుకు అనుమతి ఉంది. తాజా ప్రతిపాదన ద్వారా ఆరు నెలలలోపు శిశువుల కోసం తయారు చేసే ఉత్పత్తులకు ప్రత్యేకంగా ఈ పదార్థాల వినియోగంపై నిషేధాన్ని ప్రవేశపెట్టాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ భావిస్తోంది. ఈ సవరణకు తుది ఆమోదం లభిస్తే, అత్యంత చిన్న వయసు శిశువుల పోషకాహార ఉత్పత్తుల తయారీలో పాటించాల్సిన నియమాలు మరింత కఠినతరం కానున్నాయి.

శిశువు ఎదుగుదల, శారీరక వికాసానికి జీవితంలోని తొలి ఆరు నెలలు అత్యంత కీలకం. ఈ సమయంలో సరైన పోషకాహారం అందించడం చాలా ముఖ్యం. శిశు పోషకాహార ఉత్పత్తుల ద్వారా అవసరానికి మించి అదనపు చక్కెరలు శరీరంలోకి చేరకుండా చూడటమే ఈ ప్రతిపాదన ఉద్దేశం. చిన్న వయసులో ఏర్పడే ఆహారపు అలవాట్లు భవిష్యత్తు ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా బాల్యంలో ఊబకాయం, దానికి సంబంధించిన ఆరోగ్య సమస్యలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

## ఫార్మా కంపెనీలో పేలుడు, ఐదుగురు మృతి 3



గుజరాత్‌లోని గాంధీనగర్, కోలావాడలో 'నవరాత్రి యువ మండల్' శనివారం నిర్వహించిన 'రాస్ గర్బా' ఉత్సవంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

# మూడు దశల్లో సమగ్ర భూసర్వే

>> పూర్తయిందని వెల్లడించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీసర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీసర్వే చేపడుతున్నట్లు వివరించారు. గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. రోవర్ల వినియోగంతో భూముల సర్వేను వేగంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు. రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు.
ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డిజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని తెలిపారు, రీసర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు.
తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాలలో వందశాతం రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయం భూ యజమానులకు ముందుగానే తెలియజేయడం ద్వారా వారు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు చేయాలని సూచించారు.
అదేవిధంగా, గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకురావాలని సూచించారు, సర్వ్ పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీసర్వేను అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా భావించకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేసి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు, సర్వే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూ యజమానులు సంతృప్తి చెందేలా ప్రతి చర్య చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా కోణంలోనే ఆలోచించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.

# రహదార్లపై దసరా రద్దీ

>> ట్రాఫిక్ జాం ఏర్పడింది. మరోవైపు ఆర్టీసీ సహా ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు శివార్లలోని పలు పాయింట్ల నుంచి బస్సులు నడుపుతున్నారు.
తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండగల్లో దసరా ఎంతో ముఖ్యమైనదనేది తెలిసిందే. ఈ పండగ రోజున ప్రజలు తమ సొంత ఊరిలో సొంత వారి సమక్షంలో గడపడం ఆనవాయితీగా వుండడం విదితమే. సాధారణంగా దసరా పండగకు ఒకటి లేదా రెండు రోజుల ముందు ఎపికి వెళ్లే మార్గాలు రద్దీగా మారుతుండగా ఈసారి మూడు రోజుల ముందుగానే రద్దీని సంతరించుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గం ఒక్కసారిగా వాహనాలతో క్రిక్కిరిసి పోయింది. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణీకులతో కిటకిటలాడ గా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులుండే ప్రాంతాలు కూడా ఇదే విధంగా వున్నాయి. వరుసగా సెలవులు రావడం, విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వ దంతో హైదరాబాద్‌లో వుండే ఎపికి చెందిన లక్షలాది మంది ఛలో విలేజి అంటూ పల్లెబాట పట్టారు.
ప్రయాణీకుల రద్దీని తట్టుకునేందుకు ఆ ర్టీసీతో పాటు రైల్వే విభాగం అదనపు సర్వీసులు నడిపినా ఇవి ప్రయాణీకుల రద్దీని తట్టుకోలేక పోయాయి. ఇదే సమయంలో చాలా మంది సొ ంత వాహనాలలో తమ ఊళ్లకు బయలు దేరారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడతో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాలకు వెళ్లే రహదారులు వాహనాలతో క్రిక్కిరిసి పో యింది. రద్దీ కారణంగా బస్సులు సైతం మెల్లిగానే వెళుతున్నాయి. ఈ పరిస్థితులు మరో మూడు రోజుల పాటు కొనసాగే వీలుందని అధికారులు చెబుతున్నారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతున్న పోలీసులు**

ఇదిలావుండగా హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే వాహన దారులు నార్కట్‌పల్లి మీదుగా అద్దంకి మార్గంలో వెళుతుంటారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా వుండడంతో నాగార్జునసాగర్ హైవే వైపు వెళ్లాలని, ఈ మార్గంలో కొంత దూరం వు న్నా ప్రయాణం సాఫీగా సాగుతుందని పోలీసులు చెబుతున్నారు.
ఓఆర్ఆర్ మీదుగా వెళ్లే వారు బొంగులూరు వద్ద దిగి సాగర్ హై వే వైపు వెళ్లవచ్చు ని పోలీసులు చెబుతున్నారు. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాల వై పు రావచ్చని పోలీసులు చెబుతున్నారు.

# 'దాండియా'లో విషాదం

>> విషమంగా ఉందని సమాచారం. వేడుకల సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులకు వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో లైటింగ్ క్రేన్ విద్యార్థినుల వైపు కూలిపడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రత్యూష ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కామినేని, ఓవైసీ ఆస్పత్రులకు తరలించినట్లు తెలిసింది. నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రమాదం జరిగి విద్యార్థిని మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబానికి సిఎం సంతాపం తెలిపారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.. ప్రమాదానికి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను, అధికారులను ఆదేశించారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు అందెల శ్రీరాములు ఆస్పత్రికి వెళ్లి గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

**విద్యార్థుల మృతి తీవ్ర ఆవేదనకు గురి చేసింది: కెటిఆర్**

నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం తీవ్ర ఆవేదనకి గురిచేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేటీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని కోరారు. ఈ ఘటనలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని కేటీఆర్ ఆకాంక్షించారు.

# నిలకడగా అద్వానీ ఆరోగ్యం

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఛాతిలో ఇన్ఫెక్షన్ తలెత్తడంతో ఆయన్ను శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెంటనే ఆస్పత్రికి వెళ్లి అద్వానీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ముందురోజు సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో 98 ఏళ్ల అద్వానీని ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు అపోలో ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. న్యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి నేతృత్వంలోని వైద్యుల బృందం అద్వానీకి చికిత్స అందిస్తోందని, ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని స్పష్టం చేసింది. వైద్యులు ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే అద్వానీని ప్రధాని మోడీ కలిశారు. ప్రభుత్వ ప్రధాన పదవుల్లో మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈనెల 7న ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ భేటీ తర్వాత ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. దశాబ్దాల పాటు అద్వానీ అందించిన ప్రజా సేవ దేశ చరిత్రలో ఎంతో ప్రభావం చూపిందని కొనియాడారు. దేశ ప్రగతిని బలపరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. ఎంతో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న లాల్ కృష్ణ అద్వానీ బీజేపీని దేశంలోనే బలమైన శక్తిగా తీర్చిదిద్దడంలో ప్రముఖ భూమిక పోషించారు. చాలా ఏళ్లు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2002 నుంచి 2004 వరకు దేశ ఉప ప్రధానిగా సేవలందించారు. కేంద్ర హోంమంత్రిగా, సమాచార ప్రసార శాఖ మంత్రిగానూ అత్యంత కీలక బాధ్యతలు చేపట్టారు. అద్వానీ తన రాజకీయ జీవితంలో ఏడు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, నాలుగు సార్లు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

## ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

-సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ పండగ నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు మన తెలంగాణ అని చెప్పారు. తీరొక్క పూలతో చేసిన, ఘనమైన బతుకమ్మలతో ఆడబిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూల వాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు నిలవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్ర మంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

## వారం - వర్జ్యం

18-10-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి.సప్తమి ఉ.8.28
న.పూర్వాషాఢ మ.12.47
వ.రా.9.43-రా.11.31
దు.సా.4.06-సా.4.53
శుభ ఉ.7.00-ఉ.8.00
రా.సా.4.30-సా.6.00

## వార్తాఫలం

**మేషం :** వ్యూహరచనలు చేస్తారు. పరపతిని ఉపయోగించి పనులను సానుకూల పరచుకుంటారు.

**వృషభం :** విదేశీ ప్రయాణాలు పాస్పోర్ట్ వీసా మొదలైన విషయ వ్యవహారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి.

**మిథునం :** పారిశ్రామిక వేత్తలకు నేడు అనుకూలం. కుటుంబంలోని వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధను కనబరచ వలసి ఉంటుంది.

**కర్కాటకం :** వివాదాలను ఆదిలోనే పరిష్కరించుకుంటారు. ప్రైవేట్ ఉద్యోగస్తులకు నేడు అనుకూలంగా ఉంటుంది.

**సింహం :** శ్రమ అధికంగా ఉన్నప్పటికీ ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. భాషాపరమైనటువంటి ఇబ్బందులు ఏర్పడతాయి.

**కన్య :** బాధ్యతలు మరింతగా పెరుగుతాయి. చేపట్టిన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయగలుగుతారు.

**తుల :** మీ స్థాయి గౌరవం పెంపొందుతాయి. కొనుగోలులలో మెలకువలు పాటించండి. దైవ దర్శనం చేసుకుంటారు.

**వృశ్చికం :** ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఆదాయ మార్గాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు :** దూరప్రాంత ప్రయాణాలకు అనుకూలమైన కాలం. కొత్త పరిచయాలు, స్నేహాలు వృద్ధి చెందుతాయి.

**మకరం :** చిన్నపాటి ఒడిదుడుకులు ఏర్పడినప్పటికీ పనులు సజావుగానే సాగుతాయి. దురభ్యాసాలకు దూరంగా ఉండండి.

**కుంభం :** స్పర్ధలను రూపుమాపుకోవడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. విద్యార్థులకు శ్రమాధికం మీద ఫలితాలు చేతికందుతాయి.

**మీనం :** నూతన వస్త్రాలను కొనుగోలు చేస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నామినేషన్ల వేళ.. 'సీమ'రణరంగం

>> ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలు రాళ్లదాడులకు దారితీయడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంతోపాటు గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసుల అప్రమత్తత, ఉన్నతాధికారుల జోక్యంతో ఇరువర్గాలను వేర్వేరుగా నిలువరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం. ఘర్షణలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు ప్రశాంతంగా సాగగా, రెండో రోజు శనివారం మధ్యాహ్నం పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు రావడంతో నామినేషన్ కేంద్రం పరిసరాల్లో రాజకీయ వేడి పెరిగింది. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అభ్యర్థులతో కలిసి నామినేషన్ కేంద్రం వైపు కదిలారు. అప్పటికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ పూర్తికాకపోవ డంతో, వారు నామినేషన్లు దాఖలు చేసిన అనంతరం మరుసటి రోజు ఉదయం అవకాశం కల్పిస్తామని పోలీసులు ఎంపీకి సూచించినట్లు తెలిసింది. అయితే, ముందుగా సమయం కేటాయించి నందున తాము కూడా నామినేషన్లు దాఖలు చేయాల్సిందేనని వైసీపీ శ్రేణులు ముందుకు కదిలినట్లు సమాచారం. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, పెద్ద సంఖ్యలో గుమిగూడేందుకు అనుమతి లేదని పోలీసులు హెచ్చరించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. ఈ క్రమంలో ఇరువైపులా ఉద్రిక్తత పెరిగి, పోలీసులకు వైసీపీ శ్రేణులకు మధ్య తోపులాట చోటుచేసు కుంది. దీంతో నామినేషన్ కేంద్రం పరిసరాలు ఒక్కసారిగా ఉద్రిక్తతకు కేంద్రంగా మారాయి.
తోపులాట తీవ్రరూపం దాల్చడంతో పోలీసులపై రాళ్లు, గాజు సీసాలు విసిరినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తొలుత లాఠీచార్జి చేపట్టారు. అయినప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో టియర్ గ్యాస్ ప్రయోగించారు. పరిస్థితి మరింత తీవ్రం కావడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. సుమారు 20 రౌండ్ల వరకు కాల్పులు జరిపినట్లు, దాదాపు 30 టియర్ గ్యాస్ గుళికలను ఉపయోగించినట్లు సమాచారం. దీంతో నామినేషన్ కేంద్రం పరిసరాల్లో భయాందోళన నెలకొనగా, ప్రజలు, కార్యకర్తలు అక్కడి నుంచి పరుగులు తీశారు.
పులివెందుల డీఎస్పీ బి. మురళి నాయక్, పట్టణ సీఐ ఆర్. పురుషోత్తం రాజు సహా ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులతో పాటు కొందరు పోలీసులకు గాయాలైనట్లు తెలిసింది. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించారు. వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నా రన్న సమాచారంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైతం రాళ్లు, కర్రలతో సిద్ధమైనట్లు సమాచారం. ఇరువర్గాలను సుమారు 200 మీటర్ల దూరంలోనే నిలువరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఒకవైపు పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తూనే, మరోవైపు ఇరుపార్టీల కార్యకర్తలు పరస్పరం ఎదురుపడ కుండా పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు.




శనివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించిన 72 అడుగులు బతుకమ్మ వేడుకలకు సంబంధించి 'ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సర్టిఫికేట్‌ను గవర్నర్ శుక్లాకు అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, రాంచందర్‌రావు తదితరులు

# బతుకమ్మ ప్రపంచ రికార్డు

### 'ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి తెలంగాణ సంస్కృతి

### 25 క్వింటళ్ల పూలతో 72 అడుగుల మహా బతుకమ్మ

### వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ దంపతులు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నేలకు పూల సింగిడి దిగి వచ్చింది. ప్రకృతి శోభతో బతుకమ్మ పులకించింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించింది. హైదరాబాద్‌లోని అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో 'ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డు' నమోదైంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పుష్ప బతుకమ్మ నిర్మాణంతో రికార్డు సృష్టించించి తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డు అధికారిక సమాచారం ప్రకారం, ఈ బతుకమ్మ ఎత్తు 21.95 మీటర్లు (72 అడుగుల), 25 క్వింటళ్ల తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి తొమ్మిది రకాల పూలతో రూపొందించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఈ ఘనతను సాధించింది. ఈ బతుకమ్మ నిర్మాణం కోసం వందలాది మంది కార్మికులు, నిర్వాహక బాధ్యతలు చేపట్టిన బిజెపి నేతలు శ్రమించారు. పూలను అందంగా పేర్చి భారీ ఆకృతిని రూపొందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రకృతి అందాలను, పూల ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఒకే లయలో నృత్యం చేశారు. ఈ అపురూప బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రసాద్ శుక్ల, ఆయన సతీమణి జానకి శుక్లాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కావ్య కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొని దుర్గామాత గౌరమ్మలకు పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అంబర్‌పేటకు చెందినవారే కాకుండా అన్ని ప్రాంతాల నుంచి మహిళలు యువతులు విద్యార్థినీలు బతుకమ్మలతో భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపి డాక్టర్ కె. లక్ష్మన్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

# మరణ శాసనం

>> తెలియజేశారు. సిఎం రేవంత్ రెడ్డి వచ్చాకే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారని, తెలంగాణ ప్రాజెక్టుల్లో నీళ్ల లేకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. 'గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు తొలుత పోలవరం బనకచర్లను తెరమీదికి తీసుకొచ్చారు. ఆ తర్వాత నల్లమలసాగర్‌గా పేరు మార్చారు, ఇప్పుడు కేంద్రంతో ఒప్పించి దానిని గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు ఇప్పుడు గోదావరి కావేరి ముసుగులో మూడో ప్రతిపాదనకు తీసుకువచ్చారు. నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జున సాగర్ సోమశిల ద్వారా కావేరికి నీళ్ల తరలించే ప్లాన్ చేసిండు' అని ఆరోపించారు. 'నువ్వు వదిలి పెడితే చంద్రబాబు ఒడిసి పట్టిండు, ఏపీలో కరువు లేదు, తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఏపీలో నమొదైంది. కానీ అక్కడ క్రాప్ హాలిడే లేదు, ఇక్కడ మాత్రం పంటలు వేయొద్దు అంటున్నవు, దేవాదులలో 10 మోటార్లు నడిపితే చెరువులు, చెక్ డ్యాంలు, రిజర్వాయర్లు నిండేవి కరువు ఉండేది కాదు, శ్రీశైలంలో నిల్వ నీళ్ల ఉన్నా లిఫ్ట్ చేయలేదు. 5 మోటార్లు ఉన్న కల్వకుర్తిలో 3 మోటార్లు 7,8 గంటలు నడిపావు' అని సిఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. 'ఎన్డీఎస్ఏ పేరు చెప్పి కాలయాపన చేసినవు, నీళ్ల లిఫ్ట్ చేయడం రాష్ట్ర నిర్ణయం మాకు సంబంధం లేదు అని హైకోర్టులో ఎన్డీఎస్ఏ అఫిడవిట్ వేసి చెంప చెల్లుమనేలా చెప్పింది. సిడబ్లుపిఆర్ఎస్ తన నివేదికలో అన్నారం, సుందిళ్ల అద్భుతంగా ఉన్నాయని చెప్పాయి. కన్నెపల్లిలో కట్కు ఒత్తితే నీళ్ల లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా, బారాణ తెలంగాణకు, హైదరాబాద్‌కు నీళ్ల ఇచ్చే అవకాశం ఉన్నా రాజకీయాలు చేస్తూ లేని కరువు తెచ్చినవు రేవంత్ రెడ్డి. దేవాదుల, కన్నెపల్లి, కల్వకుర్తిలో 24 గంటల పాటు ఎందుకు మోటార్లు ఆన్ చేసి నీళ్ల ఎత్తలేదు. పంపుల వద్దకు అఖిలపక్షం తీసుకుపోదాం పదా? నీ ఫెయిల్యూర్ చూపిస్తా? ఎన్ని గంటలు నడిపినవు? ఎన్ని ఎత్తినవు తెలుస్తుంది' అని చెప్పారు. నీళ్ల విషయంలో రేవంత్ రెడ్డి తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారని, ఎన్నినో పేరు చెప్పి చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. అత్యంత ముఖ్యమైన నీళ్ల విషయంలో నిర్లక్ష్యం ఎందుకు? అని ప్రశ్నించారు. దేవాదులలో 10మోటార్లు ఉన్నా మూడు మోటార్లే ఆన్ చేశారని, 10 మోటార్లు నడిస్తే వరంగల్ జిల్లాకు కరువు వచ్చేదే కాదని అన్నారు. ఎపిలో క్రాప్ హాలిడే లేదని.. కరువు లేదని, ఎపిలో కంటే ఎక్కువ వర్షాలు పడినా కరువు ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించారు. దేవాదుల మోటార్లు నడపకే నీళ్ల కిందకు పోయాయని, అక్కడ కుప్పం వరకు నీళ్ల తీసుకెళ్లి జలహారతులు పడుతున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. 'తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మొన్న ఏపీకి వచ్చిండు, చేయి చేయి కలుపుదాం దక్షాణిదికి మేలు చేసుకుందాం అని మాట్లాడుకున్నరు. అసలు ఏం జరుగుతుందో తెలుసా రేవంత్ రెడ్డి. కర్ణాటకను ఒప్పించేందుకు చంద్రబాబు ఆఫర్ ఇచ్చిండు. మేము కింద గోదావరి నీళ్ల వాడుకుంటం, పైన ఆల్మట్టిలో 16 టీఎంసీలు ఆపుకో. కానీ పోలవరం లింకుకు ఒప్పుకో అంటున్నడు. అల్రెడీ పోలవరం డైవర్షన్ లో 21 టీఎంసీలు, ఇప్పుడు 16 టీఎంసీలు అంటే 37 టీఎంసీలు కృష్ణాలో ఆగితే పాలమూరు జిల్లాకు నష్టం. ఎల్ ని నో నేపథ్యంలో నీళ్ల ప్రాధాన్యం అర్థమైన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?' అని ప్రశ్నించారు.

# దుర్గాపూజ మండపం వద్ద తొక్కిసలాట

>> ఘటన జరిగింది. వర్షం పడుతున్న సమయంలో మండపాన్ని సందర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో, బయటకు వెళ్లే మార్గం వద్ద తొక్కిసలాట జరిగినట్లు కోల్‌కతా పోలీసులు వెల్లడించారు. శనివారం రాత్రి సుమారు 7.40 గంటల సమయంలో గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా పార్క్ (చోర్ బాగన్) పూజా మండపం నిష్క్రమణ ద్వారం వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులందరినీ రక్షించి ఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, వైద్య బృందాలతో కూడిన అంబులెన్సులను రంగంలోకి దించినట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా పూజా మండపాన్ని సందర్శకుల కోసం మూసివేశారు. ఘటనపై సమాచారం అందుకున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అగర్వాల్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. చోర్ బాగన్ పూజా మండపం వద్ద తొక్కిసలాట జరిగినట్లు తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి, విచారానికి గురయ్యాను. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబాలకు ధైర్యం, మనోబలం కలగాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నానని ఆమె ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన ఓ వ్యక్తి మాట్లాడుతూ, తొక్కిసలాట సమయంలో పలువురు స్పృహ కోల్పోయారని తెలిపారు. క్షతగాత్రుల్లో కొందరిని మోటార్‌సైకిళ్లపై ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, మండపం ప్రవేశ ద్వారం చాలా ఇరుకుగా ఉంది. నా కుమార్తె, మనవరాలు చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

# ఇంటర్నెట్ వినియోగం పిల్లల ప్రాథమిక హక్కు

## వయసు ఆధారిత నిషేధానికి సుప్రీంకోర్టు నిరాకరణ

### ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

### అభ్యంతరకర కంటెంట్ తొలగింపులో వైఫల్యంపై అసహనం

### ప్రాథమిక పాఠశాల నుంచే అవగాహన కల్పించాలి

### కేంద్రానికి ద్విసభ్య ధర్మాసనం కీలక సూచనలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** ఇంటర్నెట్ వినియోగాన్ని పిల్లలకు కూడా ఒక ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించింది. ఇంటర్నెట్ వినియోగంపై వయసు ఆధారిత నిషేధం విధించడాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. ఇంటర్నెట్‌ను పొందడం, వినియోగించడం పిల్లలకు కూడా ప్రాథమిక హక్కేనని స్పష్టం చేసింది. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ)తో కలిపి చదివిన ఆర్టికల్ 21 ప్రకారం, ఇంటర్నెట్‌ను వినియోగించుకునే, పొందే హక్కు ప్రతి వ్యక్తి ప్రాథమిక హక్కు అని చెప్పడానికి మాకు ఎలాంటి సంకోచం లేద్ను అని పేర్కొంది. "మన పిల్లలు, వారి వయస్సుతో సంబంధం లేకుండా, అవే హక్కులను అనుభవిస్తారు. ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు రక్షించదగిన మనస్సాక్షి లేదా వ్యక్తీకరించదగిన వాక్ స్వాతంత్రం లేదని చెప్పడం ఎంత అసంబద్ధమో, ఆ హక్కులను పూర్తిగా నిరాకరించడం కూడా అంతే అసంబద్ధ్ను అని పేర్కొంది. "బాలల లైంగిక దోపిడీ, దుర్వినియోగ సామగ్రి (సిఎస్ఇఎం) గురించి భారత అధికారులకు నివేదించడంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చడంలో విఫలమవుతున్నాయని ఆరోపిస్తూ, బాలల హక్కుల స్వచ్ఛంద సంస్థ 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్', మరో దరఖాస్తుదారు దాఖలు చేసిన దరఖాస్తులపై విచారణ జరుపుతూ, జస్టిస్‌లు జె.బి. పర్దివాలా, కె.వి. చంద్రన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో ఆన్‌లైన్‌లో పిల్లలపై లైంగిక వేధింపులు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మరింత పటిష్ట మైన రక్షణ వ్యవస్థ అవసరమని పేర్కొంది. పిల్లల భద్రతను కాపాడుతూనే వారి హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి, ఇంటర్నెట్, సోషల్ మీడియా వేదికలకు న్యాయస్థానం సూచించింది. పిల్లల భద్రత, వారి స్వేచ్ఛ పరస్పర విరుద్ధమైన అంశాలు కావని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పిల్లలకు ఇంటర్నెట్ ప్రాప్యతను పూర్తిగా నిరాకరించడం సమంజసం కాదని పేర్కొంది. భద్రత పేరుతో వారి ప్రాథమిక హక్కులను తొలగించకూడదని స్పష్టం చేసింది. వయసు ఆధారంగా కఠినమైన ఆంక్షలు విధిస్తే పిల్లలు నియంత్రణ లేని, మరింత ప్రమాదకరమైన వెబ్‌సైట్ల వైపు వెళ్లే అవకాశం ఉందని కోర్టు హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ఎవరైనా పిల్లలను ప్రలోభపెట్టినా, బెదిరించినా, ఆంక్షలను ఉల్లంఘించామని తల్లిదండ్రులు శిక్షి స్తారనే భయంతో వారు జరిగిన విషయాన్ని చెప్పకపోవచ్చని అభిప్రాయపడింది. ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నప్పటికీ పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్ ఆన్‌లైన్‌లో కొనసాగుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. బాధితులను రక్షించడంలో నియంత్రణ సంస్థలు, సోషల్ మీడియా వేదికలు తగిన చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో రీడైరెక్ట్ లింకులు, వెబ్‌సైట్ల ద్వారా పిల్లలపై లైంగిక దుర్వినియో గానికి సంబంధించిన కంటెంట్‌ను చెల్లిం పు ప్రమోషన్ల రూపంలో ప్రచా రం చేస్తున్నారనే నివేదికలు కూడా ఈ విచారణకు కారణమయ్యాయి.

ప్రస్తుతం ఇలాంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించే వ్యవస్థ ప్రధానంగా వ్యక్తిగత ఫిర్యాదులపైనే ఆధారపడుతోందని కోర్టు పేర్కొంది. ఒక ప్లాట్‌ఫామ్‌లో కంటెంట్‌ను గుర్తించి తొలగించినా.. అదే కంటెంట్ ఇతర వేదికల్లోనూ ఉందని ఆటోమేటిక్‌గా గుర్తించే వ్యవస్థ లేదని తెలిపింది. దీంతో కంటెంట్ తొలగింపులో జాప్యం జరిగి, అది మరింతగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వివరించింది. ఈ విషయంలో సమర్థమైన చర్యల కోసం అధికారులు, ప్లాట్‌ఫామ్‌లు మరింత కాలం తీసుకోవడాన్ని అనుమతించలేమని కోర్టు స్పష్టం చేసింది. పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను వేగంగా గుర్తించి తొలగించేందుకు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, ఇంటర్నెట్, సోషల్ మీడియా సంస్థలకు పలు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా కంటెంట్‌కు సంబంధించిన పెర్సెప్చువల్ హ్యాష్‌లు, వెబ్ చిరునామాలతో కూడిన జాతీయ డేటాబేస్‌ల ఏర్పాటుకు మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీనివల్ల ఒకే కంటెంట్‌ను వివిధ ప్లాట్‌ఫామ్‌లలో గుర్తించడం, సమన్వయంతో తొలగించడం సులభమవుతుందని పేర్కొంది.

పిల్లలకు ఆన్‌లైన్ ప్రమాదాలపై ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆన్‌లైన్‌లో ఎదురయ్యే వేధింపులు, బెదిరింపులను గుర్తించడం, అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేదా నమ్మకమైన పెద్దల సహాయం కోరడం వంటి అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొంది. పిల్లలపై ఆన్‌లైన్ లైంగిక దుర్వినియోగాన్ని అరికట్టడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.. ఆ పేరుతో వారి రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని పేర్కొంది. అభ్యంతరకర కంటెంట్ వేగంగా తొలగించడంతో పాటు, తప్పుగా కంటెంట్ తొలగించే చర్యలను నివారించే వ్యవస్థలు కూడా ఉండాలని సూచించింది. పిల్లలకు ఇంటర్నెట్‌ను పూర్తిగా దూరం చేయడం కాకుండా.. దాన్ని సురక్షితంగా వినియోగించేలా అవగాహన కల్పించడం, దుర్వినియోగాన్ని అరికట్టడం, వారి హక్కులను కాపాడటం ఈ ఆదేశాల ప్రధాన ఉద్దేశమని కోర్టు అభిప్రాయపడింది.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

### 24న హైదరాబాద్‌లో, 29న ఢిల్లీలో ముందస్తు కార్యక్రమాలు

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సచివాలయంలో జరిగిన సమావేశంలో సమీక్షించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహాలు, ముఖ్యంగా కీలక భాగస్వాములకు ఆహ్వానాలు పంపించడం, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడటంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

ఈ సమావేశంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి, అలాగే దానికి ముందస్తు కార్యక్రమాలుగా హైదరాబాద్‌లో ఈ నెల 24న, న్యూఢిల్లీలో ఈ నెల 29న నిర్వహిం చనున్న కార్యక్రమాలకు ఆహ్వానాల పంపిణీ స్థితిగతులను ప్రధాన కార్యదర్శి సమీకించారు. ఈ రెండు కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వానాలు పంపించినట్లు అధికారులు ఆయనకు వివరించారు.

ఏరోస్పేస్, అంతరిక్షం, రక్షణ రంగాలకు చెందిన సంబంధిత భాగస్వాములందరినీ ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆహ్వానించాలని ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాల సాధనకు దోహదపడేలా ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులు, ఆయా రంగాల నిపుణులు, ఇతర ప్రముఖ వ్యక్తులను ఆహ్వానించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. వివిధ దేశాల రాయబారులతో పాటు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ), అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచమ్), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ. (సిఐఐ) వంటి ప్రముఖ పారిశ్రామిక సంఘాల ప్రతినిదులను, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులను కూడా ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ప్రముఖులందరూ కార్యక్రమాల్లో పాల్గొనేలా ఆహ్వానాల ప్రక్రియను పకడ్బందీగా, సమగ్రంగా చేపట్టాలని ప్రధాన కార్యదర స్పష్టం చేశారు.

## క్యూనెట్ స్కాంలో కీలక నిందితుడు ఢిల్లీలో పట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా లక్షలాది మందిని నిండా ముంచి వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన క్యూనెట్ సం స్థకు సంబంధించిన కీలక నిందితుడు ద్విగిజయ్ సింగ్‌ను శనివారం రాత్రి ఢిల్లీ విమానాశ్రయంలో హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చే శారు. కొన్నేళ్లుగా ఇతని కోసం సిసిఎస్ పోలీసులు గాలిస్తుండడం తెలిసిందే. క్యూనెట్ సంస్థపై తెలంగాణలో పదుల సంఖ్యలో కేసులుండగా పెద్ద సంఖ్యలో నేరగాళ్లు పట్టుబడగా భారీగా ఆస్తులను జప్తు చేశారు. అయితే దిగ్విజయ్ సింగ్ మాత్రం పట్టుబడలేదు. ఇతని కోసం గాలిస్తుం డగా ఢిల్లీ నుంచి దుబాయ్ పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిసిఎస్ ప్రత్యేక బృందం ఢిల్లీకి వెళ్లింది. అక్కడి పోలీసుల సహకారంతో నిందితుడిని పట్టుకుంది. అతన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థకు ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలకు గాను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్ అవార్డు ఫర్ డిస్కామ్స్ లభించింది. ఈ సందర్భంగా సీఎండీ కె వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఫీడర్లను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్‌ను విస్తృతంగా అమలు చేయడం, పర్యవేక్షణ, ఫీడర్లపై లోడ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించడం, విద్యుత్ అంతరాయాలపై వేగంగా స్పందించడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే పునరుత్పాదకత స్థాపిత సామర్థ్యం 2024-25 సంవత్సరంలో 1784 మెగావాట్లు ఉండగా 2025-26లో 2126 మెగావాట్లకు పెరిగిందన్నారు. సోలార్ రూఫ్ టాప్ లో 2024-25లో 80.17 మెగావాట్ల నుంచి 2025-26లో 143.92 మెగావాట్లకు పెరిగిందన్నారు.

## రామంతాపూర్ జ్యుయెలరీ వ్యాపారి కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

### 1.07 కోట్ల నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం

### 10 మంది సభ్యుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షితా కృష్ణమూర్తి

**హైదరాబాద్ (చిక్కడపల్లి) అక్టోబరు 17, ప్రభాతవార్త:** రామంతాపూర్‌కు చెందిన ప్రముఖ జ్యువెలరీ వ్యాపారి కిడ్నాప్ ఉదంతంలో చిక్కడపల్లి పోలీసులు, సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా చాకచక్యంగా వ్యవహరించి 10 మంది సభ్యుల ముఠాను శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ. 1.07 కోట్ల నగదు, 118.26 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కార్లు, 2 ద్విచక్ర వాహనాలతో పాటు 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో కొందరికి గతంలోనూ కిడ్నాప్‌లు, దోపిడీలు, చీటింగ్ వంటి తీవ్రమైన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. శనివారం అంబర్ పేట్ సికింద్రాబాద్ జోన్ డీసీపీ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితా కృష్ణమూర్తి ఆమె ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించారు. రామంతాపూర్‌లో జ్యువెలరీ వ్యాపారం నిర్వహించే కె. శ్రీనివాసరావు (53) గత నెల 5వ తేదీన దుకాణానికి బయలుదేరి అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు ఖిమ్యాన్ మిస్సింగ్ఖి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బోడుప్పల్ హేమానగర్‌లోని ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించి బాధితుడు శ్రీనివాసరావుకు, ప్రధాన సూత్రధారి ఏ1 దుమావత్ శ్రీకాంత్‌కు మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఆ వెంచర్‌కు సంబంధించిన అగ్రిమెంట్‌ను తన పేరిట రాయించుకోవడంతో పాటు భారీగా డబ్బు గుంజాలన్న దురక్ష్యంతో.. శ్రీకాంత్ గత ఆగస్టులోనే ఏ2 సురేష్, ఏ3 శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కిడ్నాప్‌నకు కుట్ర పన్నాడు. ప్లాన్ ప్రకారం గోల్నాక ఫ్లైఓవర్ వద్ద పోలీసులుగా నటించిన నిందితులు వ్యాపారి శ్రీనివాసరావును బలవంతంగా కారులోకి అపహరించారు. ఆయన కళ్లకు గంతలు కట్టి రహస్య ప్రాంతానికి తరలించారు. మొదట రూ. 15 కోట్లు డిమాండ్ చేసిన నిందితులు చివరికి కుటుంబ సభ్యుల నుంచి రూ. 1.30 కోట్లు రాన్సమ్ (విమోచన క్రయధనం) వసూలు చేసిన తర్వాత బాధితుడిని వదిలిపెట్టారు. పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు నకిలీ నంబర్ ప్లేట్లతో కూడిన వాహనాలను వాడుతూ, తరచూ వాహనాలు మారుస్తూ వచ్చారు. అయినప్పటికీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ కేసును విజయవంతంగా ఛేదించారు.

## ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌పై హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఇడి దాడులు

### పెద్ద సంఖ్యలో మ్యూల్ ఖాతాల జప్తు

### ఎడ్సమ్ ఫిన్‌టెక్ ఎండి రాంయూ రాంధాని అరెస్టు

**హైదరాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** దేశంలో ఆన్‌లైన్ గేమింగ్‌ను నిర్వహిస్తున్న పలు సంస్థలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు హైదరాబాద్ సహా ఐదు నగరాలలో వరుసగా దాడులు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ నుంచి మొదలైన దా డులు శనివారం వరకు కొనసాగాయి. హైదరాబాద్, ముంబాయి, పూణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ దా డులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుబాయ్ కేంద్రంగా ఆన్‌లైన్ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు ఇడి అధికారులు గుర్తిం చారు. దీంతో పాటు ఇక్కడ కొల్లగొట్టిన డబ్బులను షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ ద్వారా విదేశాలకు తరలిస్తున్నట్లు నిర్ధారించారు. ఈ సందర్భం గా నగదు తరలింపుకువ వాడిన మ్యూల్ ఖాతాలను పెద్ద సంఖ్యలో జప్తు చేశారు. ఈ సందర్భంగా కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం నాడు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద, ఈ కేసుతో సంబంధం వున్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు ఈడీ పేర్కొంది. ఆల్ ప్యానెల్ ఎక్స్చేంజి ఎంజిఎం91 అనే ఆన్‌లైన్ గేమింగ్, బె ట్టింగ్ ప్లాట్ ఫాం ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని ఆనక బిచాణా ఎత్తేసినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో భాగంగా పూ ణె, ముంబాయి, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన ఈడీ అధికారులు, ఎడ్సమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రా ంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పూణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు ఈడీ విచారణలో తేలింది. రాంధాని సంస్థ ఐపైసా అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దా ని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తిం చింది.

ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూ డు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తె రిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యా ప్తులో తేలింది.



శనివారం జరిగిన డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యంగా బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

### ఈగల్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యంగా బైక్ ర్యాలీ

### ప్రారంభించిన డిజిపి ఆనంద్

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** దేశంలో డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టి, యువత భవిష్యత్తును కాపాడడం కోసం పోలీసు శాఖ నిర ంతరం శ్రమిస్తుందని డిజిపి ఆనంద్ తెలిపారు. ఈ విషయంలో కఠినంగా వుంటామని ఆయన వెల్లడించారు. ఈగల్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ వద్ద శనివారం జరిగిన డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా బైక్ ర్యాలీని ఆనంద్ జెండా ఊపి ప్రారంభించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివాస్) సందర్భంగా సిఆర్పిఎఫ్ నోడల్ ఏజెన్సీగా సమన్వయంతో దేశ వ్యాప్తంగా ఈ ర్యాలీ జరుగుతుందని, ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన బైక్ రైడర్లు పాల్గొనడం గొప్ప విషయమని ఆయన తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామని, డ్రగ్స్ బారినపడి యువత తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోకుండా అందరు కదం తొక్కాలని ఆయన పిలుపునిచ్చారు. దేశాన్ని మాదకద్రవ్యా ల రహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ సమ న్వయంతో డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడుతు న్నట్లు వివరించారు. దేశంలో భిన్న భాషలు, భిన్న సంస్కృతు లు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యతే అందరి లక్ష్ యమని డిజిపి పేర్కొన్నారు. ఐక్యత, సామాజిక బాధ్యతను చాటిచెప్పడంతో పా టు డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఉద్దేశంగా మాదకద్రవ్యాలపై పోరాటం అనే ఇతివృత్తంతో ఈ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని డిజిపి వివరించారు. ర్యాలీలో పాల్గొంటున్న రైడర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, సురక్షి తంగా తమ గమ్యస్థానానికి చేరుకోవాలని డిజిపి సూచించారు. ఈ ర్యాలీలో పాల్గొంటున్న బైక్ రైడర్లు వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణించి అక్టోబరు 30 నాటికి గుజరాత్‌లోని కెవడియాకు చేరుకోనున్నారు. అక్టోబరు 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్కడ నిర్వహించే జాతీయ ఐక్యతా రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమంలో పాల్గొంటారు. బైక్ ర్యాలీ ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సిటీ కొత్వాల్ సజ్జనార్, డిఆర్ఐ సీనియర్ అధి కారి విక్రమ్,ఎన్‌సిఆర్‌బి అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్ సహా ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## యువ ఐపిఎస్‌లు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

### అంతర్గత భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలు, విదేశీయుల అక్రమ వలసలపై కఠినంగా ఉండాలి

### ఐపిఎస్‌ల దీక్షాంత్ పెరేడ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** యువ ఐపిఎస్‌లు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని, అంతర్గత భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలు, విదేశీయుల అక్రమ వలసలపై కఠినంగా వుండాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అన్నారు. ఈ విషయంలో నిరంతరం అప్రమ త్తంగా వుండాలని యువ ఐపిఎస్‌లను ఆయన కోరారు. నగర శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభ భాయి పటేల్ జాతీయ పోలీసు అ కాడమిలో శనివారం జరిగిన 78వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వారి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, ఉగ్రవాదులు, తీవ్రవాదుల పీచమణచడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదని, సాంకేతిక నేరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థ మరింతగా మెరుగు పడాలని, ఈ విషయంలో ఎఐ టెక్నాలజిని వాడాలని ఆయన తెలిపారు. గత కొన్ని దశాబ్దాలుగా దేశం ఎదుర్కొంటున్న అంతర్గత భద్రతలో గణనీయమైన మార్పులు వచ్చాయని ఆయన తెలిపారు. 50 ఏళ్లుగా వామపక్ష తీవ్రవాదంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాట్లు, స్వదేశీ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని ఆ యన తెలిపారు. మావోయిజం ముగింపు దశకు వచ్చిందని, ఈశాన్య రాష్ట్రాలలో తిరుగుబాట్లు తగ్గినా, పూర్తిగా అదుపులోకి రావాల్సి వుందని గోవింద్ మోహన్ అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందాలు, ఆపరేషన్ల నిలిపివేత ఒప్పందాలు, త్రైపాక్షిక ఒప్పందాల ద్వారా తిరుగుబాటు గ్రూ పులు శాంతియుత స్రవంతిలోకి రావడం శుభ పరిణామంగా ఆయన అభివర్ణించారు. స్వదేశీ ఉగ్రవాదం తగ్గినప్పటికీ పూర్తిగా అంతరించి పోలే దని, ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఇందుకు ఉదాహరణగా ఆయన తెలిపారు. యువ ఐపిఎస్‌లు రాబోయే రోజుల్లో ఐదు ప్రధాన సవాళ్లను ఎదుర్కోవాలని ఆయన అన్నారు. ఈ సవాళ్లు సైబర్ క్రైం, డ్రగ్స్ కట్టడి, ఉగ్రవాదం, విదేశీయుల అక్రమ వలసలు, డార్క్ నెట్ ద్వారా సుఫారీ హత్యలు, విదేశాలకు అక్రమంగా డబ్బుల తరలింపు సమస్యగా మారనున్నాయని ఆయన అన్నారు. వీటి నివారణలో టెక్నాలజిని మరి ంత వాడుకోవాలని, నేరగాళ్ల పీచమణిచేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎఐని మరింతగా వాడాలని ఆయన కోరారు. దేశంలో వ్యవస్థీ కృత నేరాలు పోలీసులకు స వాళ్ల విసురుతున్నాయని, వీటి నివారణలో పోలీసులు మరింత రాటుదేలాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందిగా మారిన పలు రకాల నేరాల విషయంలో మరింత పరిణతి సాధించాలని ఆయన కోరారు. దేశాన్ని ఐక్యంగా వుంచేందుకు నాడు సర్దా ర్ వల్లభ భాయి పటేల్ తొలి కేంద్ర హోం మంత్రిగా చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తుతించారు. పరేడ్ సందర్భంగా ప్రధాని మోది, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సందేశాలను గోవింద్ మోహన్ ట్రైనీ ఐపిఎస్‌లకు వినిపించారు. 151 మంది అధికారులు పాల్గొన్న ఈ దీక్షాంత్ పరేడ్‌లో 16 మంది విదేశీ అధికారులున్నారు. వీరిలో 17 మంది మహిళలు ఉన్నారు. దీక్షాంత్ పరేడ్‌కు పంజాబ్ కేడర్‌కు చెందిన గౌ రవ్ ఉప్పల్ నాయకత్వం వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గోవింద్ మోహన్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బెస్ట్ ఆల్ం ండర్‌గా నిలిచిన పరేడ్ కమాండర్ గౌరవ్ ఉప్పల్‌కు బెస్ట్ క్యాడర్ అవార్డుతో పాటు కత్తిని బహుకరించారు. ఆయనతో పాటు శిక్షణలో ప్రతిభ కనబరచిని మరికొందరు ఐపిఎస్ అధికారులకు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమి డైరక్టర్ సుజిత్ పాండేతో పాటు డిజిపి ఆన ంద్ సహా సిబిఐ, ఐబి డైరక్టర్లు, త్రివిధ దళాలకు చెందిన అధిపతులు, విశ్రాంత పోలీసు, రక్షణ బలగాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ఐపిఎస్‌ల దీక్షాంత్ పరేడ్ ఆహుతులను అలరించింది.



శనివారం సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో జరిగిన 78వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పెరేడ్‌లో ఐపిఎస్ అధికారులకు ట్రోఫీలను అందజేస్తున్న కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్

## ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు

### ఐదుగురు కార్మికులు మృతి.. మరో ఆరుగురికి గాయాలు

**భరూచ్, అక్టోబరు 17:** గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వాగ్రా తాలూకాలోని సైఖా గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జీఐడీసీ) పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సింజీల్ ఫార్మాకెమ్ ఔషధ తయారీ పరిశ్రమలో హైడ్రోజనేషన్ ప్రక్రియ జరుగుతుండగా 15 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన రియాక్టర్ పేలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ప్రమాదం అనంతరం మిథిలీన్ డైక్లోరైడ్ వాయువు లీకైనట్లు సమాచారం. రియాక్టర్ పేలుడు తీవ్రతకు పరిశ్రమలోని యంత్రాల భాగాలు, లోహపు రేకులు చెల్లాచెదురుగా పడిపోయాయి. కొన్ని శకలాలు పరిశ్రమ ప్రాంగణం దాటి బయటకు ఎగిరిపడ్డాయని సమాచారం. అనంతరం వెలువడిన వాయువు, దుమ్ము కారణంగా ఆ ప్రాంతమంతా పొగమంచులా మారింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇతరులు కళ్లలో తీవ్ర మంటతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం భరూచ్, వడోదరలోని ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను భరూచ్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గుజరాత్ కాలుష్య నియంత్రణ మండలి, పారిశ్రామిక భద్రత, ఆరోగ్య శాఖ అధికారులు ఘటనపై విచారణ ప్రారంభించారు. హైడ్రోజనేషన్ ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే పేలుడు సంభవించినట్లు భరూచ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ మనీషా మనానీ తెలిపారు.


**శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము,**
**కొమురవెల్లి గ్రామము & మండలము, సిద్దిపేట జిల్లా**
**ఇ- టెండర్ సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము ప్రకటన**

ఆర్.సి.నెం.యస్.యం.డి.కె/63/2025, తేది: 17.10.2026

ఈ దిగువ తెలిపిన వివిధ ఐటమ్‌లకు గాను తేది: 28-10-2026 రోజున మధ్యాహ్నం 2-00 గం॥లకు దేవాలయ కార్యాలయము నందు బహిరంగ వేలము కమ్ సీల్డు టెండర్ నిర్వహించబడును.

| క్ర.సం | వివరములు | టెండర్ షెడ్యూల్ ధర | ధరావత్తు సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|---|
| 01 | 02 | 03 | 04 | 05 |
| 1 | శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద కొబ్బరి కాయలు విక్రయించుకొను లైసెన్స్ హక్కు | 2,000-00 | 5,00,000-00 | 01-12-2026 నుండి 30-11-2027 |
| 2 | శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద షెటర్ నందు కూల్‌డ్రింక్స్, టీ, స్నాక్స్ మరియు పూజా సామాగ్రి అమ్ముకొను లైసెన్స్ హక్కు | 2,000-00 | 5,00,000-00 | 01-11-2026 నుండి 31-10-2027 |
| 3 | అన్నదాన సత్రము ముందు గల దేవాలయం షాపింగ్ కాంప్లెక్స్ నందు షాపులలో తాత్కాలిక లైసెన్స్ పద్దతిపై వ్యాపారము చేసుకొను హక్కు (షాపు నెం.01,02) | 2,000-00 | 40,000-00 షాపు ఒక్కంటికి | 01-12-2026 నుండి 30-11-2027 |
| 4 | అన్నదాన సత్రము ముందు గల దేవాలయం షాపింగ్ కాంప్లెక్స్ నందు షాపులలో తాత్కాలిక లైసెన్స్ పద్దతిపై వ్యాపారము చేసుకొను హక్కు (షాపు నెం.06,07) | 2,000-00 | 40,000-00 షాపు ఒక్కంటికి | 01-01-2027 నుండి 31-12-2027 |
| 5 | అన్నదాన సత్రము ముందు గల దేవాలయం షాపింగ్ కాంప్లెక్స్ నందు షాపులలో తాత్కాలిక లైసెన్స్ పద్దతిపై వ్యాపారము చేసుకొను హక్కు (షాపు నెం.03,08) | 2,000-00 | 40,000-00 షాపు ఒక్కంటికి | 01-11-2026 నుండి 31-10-2027 |

క్రమ సంఖ్య 01 మరియు 02 లకు ఇ-టెండర్, సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము నిర్వహించబడును. మరియు క్ర.సం 03 నుండి05 వరకు సీల్డు టెండర్ కమ్ బహిరంగ వేలము నిర్వహించబడును. పై టెండర్ నందు పాల్గొనుటకు ఆసక్తి కలవారు టెండర్ షెడ్యూల్ కొరకు కాలమ్ నెం.3లో తెలిపిన విధముగా రూ॥ 2,000-00 దేవస్థాన ధనాగారము నందు ప్రకటన జారీ చేసిన తేది నుండి తేది: 26-10-2026 సా॥ 5-00 గం॥లోగా జమ చేసినవారికి తేది: 27-10-2026 రోజున సా॥ 5-00 గం॥ల వరకు టెండర్ షెడ్యూల్ జారీ చేయబడును మరియు టెండర్‌లో పాల్గొనువారు టెండర్ షెడ్యూల్‌తో పాటుగా కాలమ్ నెం.4లో చూపిన డిపాజిట్ సొమ్మును ఏదేని జాతీయ బ్యాంక్ నందు కార్యనిర్వహణ అధికారి శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానము, కొమురవెల్లి వారి పేరున చెల్లుబాటు అయ్యే విధముగా డి.డి.లను తేది: 28-10-2026 రోజున మధ్యాహ్నం 01-00 గం॥ల వరకు షెడ్యూలుకు జతపరచి టెండర్ బాక్స్ నందు వేయవలెను.

**ఇ-టెండర్ వేలమునకు :-**

వివరములు https://tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు పొందగలరు.

**గమనిక:-** టెండరు షెడ్యూలు పొందు సమయములో రెండు పోస్టు డేటెడ్ చెక్కులు ఇచ్చిన వారికి మాత్రమే షెడ్యూలు జారీ చేయబడును. ముందుగా బహిరంగ వేలము నిర్వహించి హెచ్చుపాట మీద పాట ఆపి ఆ తదుపరి సీల్డు టెండర్ బాక్స్ తెరచి ఆ తదుపరి ఇ-టెండర్ తెరచి ఈ మూడింటి యందు ఏది హెచ్చుపాట ఉండునో అట్టి పాటను హెచ్చుపాటగా నిర్ణయించి టెండరు ఖరారు చేయబడును. హెచ్చుపాట సొమ్ముపై జి.యస్.టి 18% మరియు లీజు అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ చార్జీలు 2% వెంటనే చెల్లించవలెను.

DIPR.No.12147-PP/CL/Advt/1/2026-27, తేది: 17.10.2026 సం/- కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానికసంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజే రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా, పలుప్రాంతాల్లో టిడిపి, వైఎస్సార్‌సిపి వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు, హింసాత్మక ఘటనలు తీవ్రకలకలం రేపాయి. నామినేషన్ల దాఖలుకు తక్కువ గడువుండటంతోఅభ్యర్థులు, కార్యకర్తలు భారీగా తరలిరావడం, ఈక్రమంలో ఇరువర్గాల మధ్య పరస్పర ఆరోపణలు, తోపులాటలు జరగడంతో ఉద్రిక్తతలకు దారితీసింది. చిత్తూరు జిల్లా పుంగనూరులో నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తపరిస్థితులకు కేంద్రబిందువుగా మారింది. ఈఘర్షణల్లో ఇరువర్గాలు రాళ్లురువ్వుకున్నాయి. ఘర్షణ హింసాత్మకంగా మారడంతో అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి, గుంపును చెదరగొట్టడానికి పోలీసులురంగంలోకి దిగి గాలిలోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. అన్నమయ్య జిల్లా రాయచోటిలోనివైఎస్సార్‌సీపీ కార్యాలయం వెలుపల నిలిపి ఉంచిన కార్లపై దుండగులు దాడిచేసి ఏకంగా నాలుగు కార్లకు నిప్పు పెట్టారు. తిరుపతిలోనూ నామినేషన్ల సందర్భంగా కొన్నిచోట్ల టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య మాటలయుద్ధం, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. అనంతపురంజిల్లా గుత్తిలో వైసీపీ నాయకునిపై దాడులు జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో వైసిపి వర్గీయులు కౌన్సిలర్స్ స్థానాలకు నామినేషన్లు వేయకుండా టిడిపి, బిజెపి వర్గీయులు అడ్డుకున్నారు. తాడిపత్రిలో నామినేషన్లు వేయకుండా టిడిపి వర్గీని బెదిరించారనే కారణంతో వైసీపీ మాజీఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై పోలీసులకు జెసి వర్గీయులు ఫిర్యాదుచేశారు. ఈ గొడవల నేపథ్యంలో శాంతిభద్రతలపై పోలీసుల నిఘాపెంచాలి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తొలిరోజే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం రాబోయే రోజుల్లో ఎన్నికల సవాల్‌ను తేటతెల్లం చేస్తోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ఎలాంటిఅవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.!

# కూటమి ఐక్యతకు, వైసిపి బలానికి పరీక్ష!

**రాచమల్లు భోగేశ్వర్ రెడ్డి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఎన్నికలను ఎదుర్కొనే దిశగాఉండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంత బలంతో పోటీకి సన్నద్ధమవుతోంది. మరోవైపు సీపీఐ, సీపీఎం తమ స్వతంత్ర రాజకీయ ఉనికిని నిలుపుకొంటూనే ప్రజాసమస్యలపై ఇతర పార్టీలతో కలిసి పని చేసే అవకాశాలు చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా కరువు అంశంపై సీపీఐ నాయకులు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలవడం కొత్త రాజకీయ ఊహాగానాలకు దారితీసింది. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆగ మేఘాల మీద నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమైన సమయంలో మొదటి రోజే నామినేషన్ల ఘట్టంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు, హింసాత్మక సంఘటనలు నెలకొనడం ఆందోళన కలిగించే అంశం. ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించకపోతే ఉద్రిక్త పరిస్థితులు చేయి దాటే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 28న పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్ జరగనుంది. ఇందులో 13 కార్పొరేషన్లు, 77మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు కలిపి మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలున్నాయి. అక్టోబరు 30న ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. నవంబరు 3న జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 5న ఓట్ల లెక్కింపు జరగనున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు నవంబరు 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు దశల్లో నిర్వహించనున్నారు. ఆయా దశల్లో పోలింగ్ జరిగిన రోజే ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో అన్ని ప్రధాన పార్టీలకూ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రభుత్వ పనితీరుపై స్థానికస్థాయిలో ప్రజల స్పందనను తెలుసుకునేందుకు అధికార కూటమికి ఇవి ఒక అవకాశం. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత తన సంస్థాగత బలం ఎంతవరకు నిలిచిందో అంచనా వేసుకునేందుకు వైసీపీకి కీలక పరీక్ష. వామపక్షాలకు ప్రజాఉద్యమాలను స్థానిక ప్రజాప్రాతినిధ్యంగా మార్చుకునే అవకాశం. అయితే ఫలితాలను రాష్ట్ర వ్యాప్త రాజకీయ తీర్పుగా విశ్లేషించే ముందు స్థానిక అభ్యర్థులు, సమస్యలు, సామాజిక సమీకరణాల ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అధికార కూటమి ముందున్నప్రధాన



సవాలు సీట్ల పంపకం. రాష్ట్రస్థాయిలో మూడు పార్టీల మధ్య అవగాహన ఉన్నప్పటికీ, ప్రతి వార్డు, డివిజన్, మండలంలో ఆశావహులను సమన్వయం చేయడం అంత సులభం కాదు. ఒకే స్థానంపై రెండు పార్టీల నాయకులు పట్టుబట్టినప్పుడు ఎవరు వెనక్కి తగ్గాలి, ఎవరికి అవకాశం ఇవ్వాలన్నది కీలకమవుతుంది. మొదటి విడతలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా అధికార కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో మేయర్ పదవులలో టిడిపికి 11, జనసేనకు 7, బిజెపికి రెండు స్థానాలు కేటాయించారు. మున్సిపల్ నగర పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 123 స్థానాలకు గాను తెలుగుదేశం 78, జనసేన 21, బిజెపి ఏడు స్థానాల్లో పోటీ చేసేందుకు సీట్ల సర్దుబాటు జరిగింది. ఇదే సమయంలో వైసీపీ కూడా తనదైన శైలిలో ముందుకెళ్తోంది. అభ్యర్థుల ఎంపికలో అసంతృప్తి పెరిగితే స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల కూటమి విజయావకాశాలను పార్టీల ఉమ్మడిబలంతోపాటు స్థానిక సమన్వయం కూడా నిర్ణయించనుంది. టీడీపీకి ఉన్న విస్తృతమైన స్థానిక యంత్రాంగం, జనసేనకు కొన్ని ప్రాంతాల్లో ఉన్న కార్యకర్తల బలం, బీజేపీకి ఉన్న సంస్థాగత వనరులు ఎంతవరకు కలిసిపని చేస్తాయన్నది చూడాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమిపాలన సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేకంగా చర్చించుకోవాలి. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో నిలిస్తే వైసిపి పొత్తులు లేకుండా ఎన్నికల బరిలోనిలిచాయి. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో కూటమి పార్టీ పాలన కొనసాగిస్తోంది. వైసీపీకి ఈ ఎన్నికలు కార్యకర్తల్లో చైతన్యం పెంచుకోవడానికి, స్థానిక నాయకత్వాన్ని పునర్వ్యవస్థీకరించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. పార్టీకి ఓటు వేసే ప్రజలను పోలింగ్ కేంద్రాలకు తీసుకురాగల అభ్యర్థులను ఎంపిక చేయడం ప్రధాన అవసరం. ప్రజలకు అందుబాటులో ఉండటం, స్థానికసమస్యలపై పనిచేయడం, వ్యక్తిగత విశ్వసనీయత వంటి అంశాలు అభ్యర్థుల ఎంపికలో కీలకం కానున్నాయి. గత పదవులు లేదా పార్టీ గుర్తింపుతోనే విజయం సాధించవచ్చన్న అంచనా స్థానిక ఎన్నికల్లో ఎప్పుడూ ఫలించదు. కరవు పరిస్థితులపై సీపీఐ ప్రతినిధులు జగన్‌మోహన్‌రెడ్డిని కలవడం ఈ నేపథ్యంలో ప్రాధాన్యం పొందింది. రైతుల సమస్యలు, కరవు నివారణ చర్యలపై ఉమ్మడిచర్చలకు ఈ సమావేశం వేదికైంది. ప్రజాసమస్యలపై కలిసి పనిచేసే అవకాశం ఈ పరిణామంతో చర్చకు వచ్చింది. కరవు అంశం గ్రామీణ ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారేఅవకాశం ఉంది. సాగునీటి లభ్యత, ఎండిపోతున్న పంటలు, వ్యవసాయ పెట్టుబడులు, పశుగ్రాసం, తాగునీరు, ఉపాధి వంటి సమస్యలు గ్రామీణ కుటుంబాలపై నేరుగా ప్రభావం చూపుతాయి. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను అధికార కూటమి ప్రజల్లోకి తీసు కెళ్లవచ్చు. అందులో లోపాలున్నాయని భావించే ప్రతిపక్షాలు మరింత సాయం కోరవచ్చు. వామపక్షాలకు ఈ విషయంలో తమస్వతంత్ర గుర్తింపును కాపాడుకోవడం ముఖ్యం. ప్రజా ఉద్యమాల్లో నిర్మించుకున్న సంబంధాలను ఓట్లుగా మార్చుకోవడం మాత్రం అభ్యర్థి బలం, స్థానిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పట్టణ ఎన్నికల్లో తాగునీరు, పారిశుద్ధం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, చెత్త సేకరణ ప్రధాన అంశాలుగా నిలవవచ్చు. ఆస్తిపన్ను, ఖాళీస్థలాలపన్ను, స్థానిక సేవల ఛార్జీలపై ప్రజల అభిప్రాయాలు అభ్యర్థులకు ఎదురవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత భిన్నంగా ఉంటుంది. పంచాయతీ ఎన్నికలు పార్టీగుర్తులపై జరగకపోయినా ప్రధాన పార్టీల మద్దతు ఉన్న అభ్యర్థుల మధ్య పోటీ రాజకీయ ప్రాధాన్యం పొందుతుంది. గ్రామంలో అభ్యర్థి అందుబాటు, కుటుంబ సంబంధాలు, గతంలో చేసిన పనులు, స్థానిక వర్గాల మధ్య అవగాహన ప్రభావం చూపుతాయి. ఎంపీ టీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తుతో పాటు మండలస్థాయి నాయకత్వం, ప్రచార నిర్వహణ, కార్యకర్తల సమీకరణ కూడా ముఖ్యమవుతాయి. అభ్యర్థుల ఎంపికలో మహిళలు, యువత, వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించే తీరు పార్టీలపై ప్రజాభి ప్రాయాన్ని ప్రభావితం చేయవచ్చు. రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థిని నిలబెట్టడంతోపాటు ఎన్నికైన ప్రతినిధి స్వతంత్రంగా పనిచేసే వాతావరణం కల్పించడం అవసరం. రాబోయే రోజుల్లో నామినేషన్లు, ఉపసంహారణలు, అధికారిక అభ్యర్థుల ప్రకటనలతో అసలు పోటీ స్వరూపం స్పష్టమవుతుంది. కూటమి ఎక్కడ ఉమ్మడి అభ్యర్థిని నిలబెడుతుంది, వైసీపీ ఎక్కడ బలమైన పోటీ ఇస్తుంది, వామపక్షాలు ఎక్కడ స్వతంత్రంగా ప్రభావం చూపుతాయన్నది అప్పుడే తేలుతుంది. అక్కడక్కడా స్థానిక అవగాహనలు ఏర్పడినా వాటిని రాష్ట్ర వ్యాప్త పొత్తుగా విస్తరించి చెప్పలేం. ప్రజా సమస్యలపై సహకారం ఎన్నికల సర్దుబాటుగా మారుతుందా అన్నది సంబంధిత పార్టీల నిర్ణయాలపై ఆధారపడిఉంటుంది. మొత్తంగా ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి సమన్వయానికి, వైసీపీ సంస్థాగత బలానికి, వామపక్షాల స్థానిక ప్రభావానికి పరీక్షగా నిలవనున్నాయి. కరువుపై సీపీఐ–జగన్ సమావేశం రాజకీయ చర్చలకు కారణమైనప్పటికీ, ఎన్నికల పొత్తుపై స్పష్టత ఇంకా అవసరమే. ●

రాష్ట్రం

తమిళనాడు

# అటా.. ఇటా?

**ఎ.వి.వి ప్రసాద్**

రాక్షీలో నార్మాషేరర్, బ్రాడ్వేలో కాంచనమాల.. ఎటకేగుటొ సమస్య అయిందొక విద్యార్థికి అంటూ 'సంధ్యా సమస్యలు' అనే కవితలో కొన్ని దశాబ్దాలక్రితం మహాకవి శ్రీశ్రీ రాశారు. అప్పటి మద్రాసులో ఆ సినిమా థియేటర్లలో దేనికి వెళ్లాలనే విద్యార్థి సాయంత్రం సమస్యను అలా అందంగా చెప్పారు. ఇప్పుడు చెన్నైలో సిఎం విజయ్ కూడా అదే డోలాయమానంలో ఉన్నట్లుగా కనిపిస్తున్నారు. ఆయన ఆలోచన కాంగ్రెస్ 'చేయి' పట్టుకొని నడవాలా! లేక బిజెపి భుజం ఎక్కాలా? అన్నదే. గత వారం ఆయన నడక తీరును గమనిస్తే ఎటువంటి భవిష్యత్ వ్యూహంతో ఉన్నారో అర్థమవుతుంది. నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు కీలక వ్యక్తులతో విజయ్ భేటీ అయ్యారు. తొలుత కాంగ్రెస్ అగ్రనేతగా రాహుల్ గాంధీ స్వయంగా చెన్నై వచ్చి విజయ్ నివాసానికి వెళ్లి, సుదీర్ఘంగా చర్చించారు. సిఎం హోదాలో విజయ్ ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి తానువచ్చిన 'అసలు విషయం' చెప్పారు. 'మీ వెంటే ఉంటా' నంటూ విజయ్ హామీ ఇచ్చారు. అది జరిగి 24గంటలు గడవక ముందే ప్రధాని మోడీ స్వయంగా చెన్నై వచ్చి విజయ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మెట్రోలో కూడా ప్రయాణించారు. సిఎంహోదాలో ప్రధానికి ఎన్ని గౌరవ మర్యాదలు చేయాలో అన్నీచేశారు విజయ్. ఇద్దరూ 'ఏకాంతం'గా కూడా కొద్దిసేపు చర్చించుకొన్నారు. ఇది ప్రధానికి షెడ్యూల్డ్ ప్రోగ్రాం. రాహుల్ వచ్చారని ప్రధాని రాలేదు. ప్రధాని రాబోతున్నారనే ఒకరోజు ముందుగా రాహుల్ వచ్చి ఉండవచ్చు. ఇది జరిగిన మూడు రోజులకే గత బుధవారం విజయ్ విజయవాడ వెళ్లి సిఎం చంద్రబాబును కలుసుకొన్నారు. దేవీ నవరాత్రులు సందర్భంగా కనకదుర్గమ్మ దర్శనానికి విజయ్ వచ్చారనీ, విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్నారనీ బయటకు చెబుతున్నా అసలు కారణాలు వేరే ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఈ మూడు భేటీల తర్వాత విజయ్ 'అటా.. ఇటా' అనేసందేహం అందుకే అందరిలో కలుగుతోంది. రాష్ట్రంలో విజయ్ టివికె కూటమి లో కాంగ్రెస్ ఉంది. తనకున్న ఐదు సీట్ల బలంతో ప్రభుత్వానికి మద్దతు ఇస్తోంది. స్టాలిన్ నాయకత్వంలోని డిఎంకె కూటమి నుంచి బయటకు వచ్చి విజయ్ పార్టీకూటమిలో చేరిన తర్వాత కాంగ్రెస్ పరిస్థితి కొంత మెరుగు పడిందనే చెప్పాలి. ఈ మధ్య విజయ్ అభిమానులు ఆయనను భవిష్యత్ ప్రధానిగా ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శనలు చేస్తున్నా కాంగ్రెస్ నేతలు చూసీచూడనట్లు వెళ్తున్నారు కానీ అభ్యంతరం చెప్పడం లేదు. ఇటీవల రెండు సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో రెండింటినీ టివికె గెలుచు కోవడంతో ఆపార్టీమరింత బలపడిందనే విషయం స్పష్టమవుతుంది. అయినా పూర్తి మెజారిటీకి టివికె ఇంకా దూరంగానే ఉంది. అందువల్ల కాంగ్రెస్ మద్దతు టివికెకు అవసరమే. కానీ కేంద్రంనుంచి నిధులు దండిగా వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు



సిఎం విజయ్

వేగంగా అమలు జరగాలంటే మోడీ సాయం మరింత తప్పనిసరి. అందుకే 'అటా.. ఇటా' అనే డోలాయమానం. విజయ్ విషయంలో రాహుల్, మోడీకి ఎవరివ్యూహాలు వారికి ఉన్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌నే ముందుకు తెస్తారనడంలో సందేహం లేదు. కానీ విజయ్‌ని జాతీయస్థాయికి తీసుకు వెళ్లాలని టివికె నేతలు బలంగా కోరుకుంటున్నారు. ఈ అంశంపై ముందు ముందు రెండు పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. గతవారం విజయ్ మోడీ సభలో కూడా టివికె కార్యకర్తలు 'ప్రధానివిజయ్' అనే ప్లకార్డులు ప్రదర్శించారంటే దానిని చిన్న విషయంగా కొట్టివేయలేం. తన పార్టీ స్వతంత్ర తను కాపాడుకొంటూనే జాతీయ స్థాయికి ఎదగాలన్నది విజయ్ అభిమతం కూడా కావొచ్చు. సిఐసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము ఢిల్లీలో జరుపుతున్న ఆందోళనల్లో పాల్గొనాల్సిందిగా విజయ్‌ని కోరినట్లు రాహుల్ చెబుతున్నారు. అందుకు విజయ్ ఒప్పుకొన్నట్లు కూడాప్రచారమైంది. మర్నాడు మోడీవచ్చి మాట్లాడి వెళ్లిన తర్వాత విజయవాడలో చంద్రబాబుతో విజయ్ జరిపిన చర్చల్లో కొత్త సమీకరణాలకు మార్గం ఏర్పడినట్లుగా చెబుతున్నారు. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గమనించాలి. రాహుల్, మోడీతో జరిపిన సమావేశాల కంటే చంద్రబాబుతో జరిపిన చర్చల్లో విజయ్ ఎక్కువ హుషారుగా కనిపించారు. ప్రధాని మోడీతో కలిసి మెట్రోలో ప్రయాణించినప్పటికంటే విజయవాడ ఉత్సవ్ వేదిక మీద చంద్రబాబుతో కలిసి ఎక్కువ ఉత్సాహంతో కనిపించారు. ఈ తేడాను జాగ్రత్తగా గమనిస్తే విజయ్ భవిష్యత్ వ్యూహాన్ని తేలికగానే అంచనా వేయవచ్చు. రాహుల్ వచ్చి అడిగి వెళ్లిన తర్వాతకూడా ఢిల్లీ ఆందోళనల్లో టివికెమంత్రులు గాని, ముఖ్యనేతలు గాని ఎవరూ పాల్గొనలేదు. గత గురువారం ఇండియా కూటమి నేతలుతమ జాతీయ ఆందోళనల్లో భాగంగా చెన్నైలో భారీ నిరసనలు చేపట్టినప్పుడు కూడా రాజ్ మోహన్ అనే మంత్రి మినహా ఇంకెవరూ పాల్గొనలేదు. అలాగే ఢిల్లీలో కాంగ్రెస్ జరిపిన ఛలో రాష్ట్రపతి భవన్ ఆందోళనలో కూడా టివికె నుంచి ఎవరూ పాల్గొనలేదు. దీనిని బట్టి చూస్తే, రాష్ట్రంలో ఏ పార్టీల మద్దతు తీసుకొన్నా టివికె జాతీయ విధానం మాత్రం భిన్నంగా ఉంటుందనే విషయం అర్థమవుతుంది. తమిళనాడు అభివృద్ధికి విజయ్‌తో కలిసి పని చేస్తామని ప్రధాని బహిరంగంగానే అనడం కూడా గమనించవలసి ఉంది. మరో రెండు మెట్రోప్రాజెక్టులు, సమగ్ర శిక్షా అభియాన్ నిధులు విడుదల చేయాల్సిందిగా విజయ్ కోరడం, ప్రధాని వెంటనే సమ్మతిని తెలపడం తేలిగ్గా చూడవలసిన విషయాలు కావు. భవిష్యత్ సమీకరణాలకు వాటిని సంకేతాలుగా చెప్పవచ్చు. ఇప్పటికిప్పుడు టివికె ఎలాంటి ప్రకటనలు చేయకపోయినా, విజయ్ మాత్రం అటా.. ఇటా అనే ఆలోచనలో ఉన్నట్లుగానే కనిపిస్తుంది. ఎటో.. త్వరలోనే తెలియవచ్చు. ●

దేశం

కెనడా

# వేర్పాటు వాదానికి బీజం..

**గన్ని మోహన్**

కెనడాలో చమురు నిల్వలు అధికంగా ఉన్న అల్బెర్టా ప్రావిన్స్‌లో వేర్పాటువాదానికి బీజం పడింది. కెనడా నుంచి విడిపోవాలనే అంశంపై భవిష్యత్తులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియను ప్రారంభించాలా వద్దా అనే విషయంపై ఈనెల 19న కీలక ఓటింగ్ జరగనుంది. కెనడాలోనే ప్రావిన్స్‌లోనే కొనసాగాలా, లేక వేర్పాటుపై భవిష్యత్తులో నిర్ణయాత్మక ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించే ప్రక్రియను ప్రారంభించాలా అన్నదానిపై ప్రజలు తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారు. అల్బెర్టా, కెనడా కేంద్ర ప్రభుత్వాల మధ్య ఇంధన విధానాలు, ప్రావిన్సుకు స్వయంప్రతిపత్తి, ఆర్థిక ప్రయోజనాల పంపిణీ వంటి అంశాలపై కొంత కాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. కానీ అల్బెర్టా ప్రజల్లో అధిక శాతం మంది కెనడాలోనే కొనసాగాలని కోరుకుంటున్నట్లు సర్వేలు సూచిస్తున్నాయి. కెనడా ప్రధాని మార్క్ కార్నీ అల్బెర్టా ప్రజలకు ఐక్యత సందేశాన్ని ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై వాణిజ్య ఒత్తిడి పెంచుతూ, ఆ దేశాన్ని అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలంటూ పలుమార్లు వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో ఈ ఓటింగ్ జరుగుతోంది. కాల్గరీ సభలోమాట్లాడిన ప్రధాని కార్నీ ఈప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన ఓటింగ్ దురదృష్టకరమని, ఓ పక్క అమెరికా కెనడాను విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తోందని, దీనివల్ల గతంలో వెనిజులా తరహాలోనే ఈప్రాంతం మొత్తం తన అధీనంలోకి తీసుకుని అల్బెర్టాను బానిస ప్రాంతంగా మార్చేస్తుందనేది గుర్తుంచుకోవాలని చెపుతూ వస్తున్నారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా రావాలని గతంలోనే హుకుం జారీ చేసిన ట్రంప్‌నకు కార్నీ గట్టి సమాధానమే చెప్పారు. ఇప్పుడు ఆల్బెర్టాను వేదిక చేసుకుని కెనడాలో విభజన రాజకీయాలు పెచ్చుమీరాయని, తెరవెనుక అగ్రరాజ్యం కుట్రలేనంటూ కార్నీ ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నప్పటికీ గల్ఫ్ తరహాలో అపారమైన సహజవనరులున్న ఈ ప్రాంతంలో తమకు తగిన వాటా నిధులు కేటాయింపులేదన్న అసంతృప్తి ప్రజల్లో పేరుకుని ఉంది. ఐరోపా నుంచి బ్రిటన్ వేరుపడిన చందంగానే ఇప్పుడు ఆల్బెర్టా కెనడా నుంచి విడివడి స్వతంత్రప్రాదేశిక ప్రాంతంగా కొనసాగాలన్నది ప్రస్తుత నినాదం. అయితే ఈ నినాదం వెనుక అమెరికా పనిచేస్తోందన్నది సమైక్యవాదుల వాదన. కెనడా పశ్చిమ ప్రాంతాల్లోని కొన్ని ప్రావిన్స్ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదనే భావన చాలాకాలంగా ఉంది. దీనినే సాధారణంగా వెస్ట్రన్ ఏలియనేషన్‌గా పేర్కొంటారు. ఈ భావన అల్బెర్టాలో వేర్పాటు ఉద్యమానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది. కెనడాలో నిరూపితమైన చమురు నిల్వల్లో ఎక్కువ భాగం అల్బెర్టాలోనే ఉన్నాయి. ఆ ప్రావిన్స్ ఆర్థిక వ్యవస్థ చమురు, సహజవాయువు వంటి సహజ వనరులపై అధికంగా ఆధారపడింది. అల్బెర్టా నుంచి కేంద్ర ప్రభుత్వానికి వెళ్లే ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ, తిరిగి ప్రావిన్సుకు తగిన మేలు జరగడం లేదని వారి ఆక్రోశం. ప్రావిన్స్ అంతర్గత వ్యవహారాల్లో ఒట్టావా ప్రభుత్వం అధికంగా జోక్యం చేసుకుంటోందని విమర్శిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఆల్బెర్టా స్వాతంత్ర్యానికి మద్దతుగా నిర్వహించిన పిటిషన్లకు 3 లక్షలకు పైగా సంతకాలు లభించాయి. వేర్పాటు వల్ల ప్రభావితమయ్యే భూములకు సంబంధించిన ఆదివాసీ ఫస్ట్ నేషన్స్‌తో సంప్రదింపులు జరపలేదన్న కారణంతో పౌరుల ఆధ్వర్యంలో ప్రతిపాదించిన ప్రజాభిప్రాయ సేకరణను అల్బెర్టా కోర్టు అడ్డుకుంది. ఈతీర్పుపై ప్రావిన్స్ ముఖ్యమంత్రి డానియెల్ స్మిత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అల్బెర్టా కెనడాలోనే కొనసాగాలని కోరుకునే ఫరెవర్ కెనడియన్ ప్రచారానికి అత్యధిక మద్దతు లభించింది. ఈ ప్రచారానికి 4 లక్షలకు పైగా సంతకాలు వచ్చినట్లు వినికిడి. వలసలపై మరింత నియంత్రణ, శాశ్వత నివాస హోదాలేని వారికి కొన్ని ప్రజాసేవలపై పరిమితులు, ప్రావిన్స్ ఎన్నికల్లో పౌరసత్వ రుజువుతప్పనిసరి చేయడం, ప్రావిన్స్ న్యాయమూర్తులు, సెనేటర్ల ఎంపిక విధానాల్లో మార్పులు వంటి ప్రతిపాదనలు వీటిలో ఉన్నాయి. స్వయంగా వేర్పాటుకు మద్దతు ఇవ్వని ముఖ్యమంత్రి డాని యెల్‌స్మిత్ మాత్రం ఈ ఓటింగుకు అనుకూలంగా ఉన్నారు. ఒట్టావాపై అల్బెర్టా ప్రజలకు అసంతృప్తి ఉండటం సహజమేనని, కానీ కెనడాలోనే కొనసాగుతూ మరింత స్వయంప్రతిపత్తిని సాధించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. తమప్రావిన్స్ వ్యతిరేకించిన తొమ్మిది చట్టాల్లో ఏడింటిపైకేంద్ర ప్రభుత్వం మార్పులు చేసిందని, ప్రతిపాదిత పైపులైన్ విషయంలోనూ సహకారం పెరిగిందన్నారు. ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు పియర్ పోయిలీవ్రే కూడా అల్బెర్టా ప్రజలు కెనడాలోనే కొనసాగాలని కోరారు. వేర్పాటువాద నాయకులు ఈ హామీలపై పూర్తిస్థాయి విశ్వాసం వ్యక్తం చేయడం లేదు. లెట్ అల్బెర్టా డిసైడ్ అనే వేర్పాటు అనుకూలసంస్థ సహాఅధ్యక్షురాలు టాన్యా క్లైమెన్స్, కేంద్ర ప్రభుత్వ హామీలను కేవలం మాటలుగానే పేర్కొన్నారు. అల్బెర్టా ప్రజల్లో అధిక శాతం మంది కెనడాలోనే కొనసాగాలని కోరుకుంటున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో ప్రచురితమైన లెజర్ సర్వే ప్రకారం, 70 శాతం మంది అల్బెర్టాను ప్రస్తుత ప్రావిన్స్‌గానే కొనసాగించాలని కోరుకున్నారు. 20 శాతానికి కొద్దిగా ఎక్కువ మంది మాత్రమే రిఫరెండమ్‌కు మద్దతు తెలిపారు. సుమారు 7 శాతంమంది తమ అభిప్రాయాన్నివెల్లడించలేదు. సెప్టెంబరులో జానెట్ బ్రౌన్ ఒపీనియన్ రీసెర్చ్ సంస్థ సీబీసీ కోసం నిర్వహించిన సర్వేలో 72 శాతం మంది కెనడాలోనే కొనసాగాలని, 23 శాతం మంది వేర్పాటు దిశగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. కెనడాలోనే కొనసాగాలని ప్రజలు ఓటు వేస్తే వేర్పాటువాదాన్ని ఆదిలోనే కార్నీ తుంచేసినవారవుతారు. ●



మార్క్ కార్నీ

# ఇంధన సంక్షోభానికి ముగింపు లేదా?



**సుంకవల్లి సత్తిరాజు**

ఇంధన సంక్షోభం ప్రపంచాన్ని అభివృద్ధికి దూరం చేస్తున్నది. యుద్ధాలు మారణ హోమాన్ని సృష్టించడమే కాకుండా, సరఫరా గొలుసులను విచ్ఛిన్నం చేసి, ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య వ్యవహారాలను స్తంభింప చేస్తున్నాయి. ఇంధనావసరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇంధన కొరతతో నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతున్నాయి. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతున్నది. పెరిగిన టెక్నాలజీ కూడా జనం జేబులకు చిల్లుపెడుతున్నది. హార్ముజ్ జలసంధిని ఇరాన్, అమెరికా దేశాలు వివాదాస్పదం చేసి, వాణిజ్య నౌకల రాకపోకలను నిర్బంధించాయి. హార్ముజ్‌లోని సీమైన్స్‌ను ఢీకొని ఓడలు ధ్వంసమైపోతున్నాయి. రష్యావద్ద చమురు కొనుగోలు చేయవద్దని భారత్‌పై ఆంక్షలు విధించిన అమెరికా మాత్రం అదే రష్యా నుండి డీజిల్ కొనుగోలు చేయడానికి వీలుగా ఇంధన కాల్పుల విరమణ అంటూ కొత్తరాగాన్ని అందుకుంది. హౌతీల దాడుల వలన 'బాబ్ ఎల్ మండేబ్' కూడా దిగ్బంధనానికి గురైనది. ఇలాంటి అస్తవ్యస్థపరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఆర్థికంగా అతలాకుతలమైపోతున్నాయి. ప్రజాభీష్టానికి విరుద్ధంగా సాగుతున్న యుద్ధాలతో, ఉన్మాదంతో చమురు దిగుమతులపై ఆధారపడుతున్న భారత్ వంటి పలు దేశాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. యుద్ధాలను నివారించడంలో ఐక్యరాజ్య సమితి వైఫల్యం చెందింది. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది. సమస్యను జటిలం చేయకుండా పరిష్కార మార్గాలవైపు అన్వేషించడమే నిజమైన విజ్ఞత. మనిషి జీవించడానికి కూడు గూడు గుడ్డ చాలా అవసరం. పూర్వకాలంలో మానవ జీవన విధానం సౌకర్యవంతంగా ఉండేదికాదు. విజ్ఞానశాస్త్ర ఫలితాలు మానవ జీవితాన్ని అత్యంత సౌకర్యవంతంగా తీర్చిదిద్దడం జరిగింది. పాతకాలం పోయింది. ఆధునిక యుగం అవతరించింది. శాస్త్ర సాంకేతిక ప్రగతి వలన అనేక నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయి. జనాభాపెరిగింది. దీంతో వనరుల లభ్యత తరిగింది. మానవ జీవితంలో 'ఇంధనం' విశేషమైన స్థానం కలిగి ఉంది. ఇంధనాల్లోఅనేక రకాలున్నాయి. వంట చేయడానికి, వాహనాలు నడవడానికి, విద్యుదుత్పత్తికి, ఇతర అనేక అవసరాలకు వివిధ రకాలైన ఇంధనాలు ఉపయోగపడుతున్నాయి. మనం ప్రస్తుతం వినియోగిస్తున్న ఇంధనాల వలన కాలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి. వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. ఎన్నో ఇంధన వనరులు తరిగిపోతున్నాయి. ఇలాంటి సంక్షోభాన్ని అధిగమించి భవిష్యత్‌తరాలను కాలుష్యంలేని, పునురుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్ళించాలి. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో పయనించాలన్నా, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా, మనకు ఆయా దేశాల్లో పారిశ్రామిక, సాంకేతిక, రవాణా, వ్యవసాయ, సేవా రంగాలలో విప్లవాత్మక మార్పులు రావాలి. ఈరోజుల్లో ప్రతీ రంగం ఒకదానితో మరొకటి ముడిపడి ఉంది. ప్రతీ రంగాన్ని ముందుకు నడిపించడానికి ఉపయోగపడేది 'ఇంధనం'. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. రవాణా రంగం పలు మార్పులు సంతరించుకుంది. ప్రజలకు చేరువయింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, లారీలు, బస్సులు, రైల్వేలు, వైమానిక, నావికా రంగం ఇలా ఒకటేమిటి సర్వ వ్యవస్థలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇంధనం మీదనే ఆధారపడి ఉన్నాయి. ఇంధన వనరులు లేకపోతే ప్రపంచం ఏమైపోతుందో ఊహాకందని విషయం. అయితే క్రమేపీ మనం వాడుతున్న ఇంధన వనరులు తరిగిపోవడమే కాకుండా పలురకాల పర్యావరణ సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వలన కలుషిత ఉద్గారాలవల్ల గాలి కాలుష్యం, జలకాలుష్యం పెరిగి అనేక రోగాలు చుట్టుముడుతున్నాయి. భూతాపం విపరీతంగా పెరిగిపోయింది. ప్రపంచమంతా 'గ్లోబల్ వార్మింగ్' పై గగ్గోలు పెడుతున్నది. చెట్లను



నరికి, వాటిని కూడా ఇంధనంగా వాడడం వలన గాలిలో అవాంఛనీయ వాయువులు పెరిగిపోయాయి. మనం పీల్చే గాలి స్వచ్ఛతను కోల్పోయింది. ప్రాణాధార ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోయింది. జలకాలుష్యంవలన తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించడానికి తాగునీటిని శుద్ధిచేసే యంత్రాలొచ్చాయి. మన అవసరాలను ఆధారం చేసుకుని, త్రాగునీరు కొంతమందికి ప్రధాన ఆదాయ వనరుగా వ్యాపారాత్మకమైన అంగడి సరుకుగా మారిపోయింది. ఇక ముమ్ముందు నీటివలే గాలి కూడా పెద్ద వ్యాపారంగా మారుతుందనడంలో సందేహం లేదు. సమీప భవిష్యత్లో నీటిశుద్ధి యంత్రాల వలే గాలిశుద్ధి ప్లాంట్లు కూడా ఆవిర్భవించక తప్పదు. భవిష్యత్తులో ఎదురయ్యే ఇంధన వనరుల సమస్యను అధిగమించడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వాడకం తప్పనిసరి. నార్వే లాంటి దేశాలు ఇప్పటికే పునరుత్పాదక వినియోగ ఇంధనాల (రెన్యూవబుల్ ఎనర్జీ)ను ఉపయోగించి విద్యుదుత్పత్తిని చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ఆస్ట్రేలియా లాంటిదేశాలు విద్యుత్‌తో నడిచే వాహనాలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చి, శిలాజ ఇంధనాలైన పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా నడిచే వాహనాలను అరికట్టి, కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్ లాంటి ఉద్గారాల విడుదలకు కొంతవరకు అడ్డుకట్ట వేయడం జరిగింది. సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగంలో దూకుడుమీదున్న అమెరికా కూడా బయో ఇంధనాల వాడకం పై దృష్టి పెట్టడం ముదావహం. భూతాపంఅనేది మిథ్యగా భావించిన అమెరికా కూడా వాస్తవ పరిస్థితులను గమనించాలి. శిలాజ ఇంధనాలు కూడా ప్రకృతి సిద్ధంగా ఏర్పడినవే. ఇవి ఏర్పడడానికి లక్షలాది సంవత్సరాలు పట్టింది. ఇవి తరిగిపోవడానికి ఎంతో సమయం అవసరం లేదు. బొగ్గు, పెట్రోలియం లాంటిశిలాజ ఇంధనాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న ప్రపంచం ఈ రకమైన ఇంధన వనరులు పరిసమాప్తమైన తర్వాత కుప్పకూలి పోక తప్పదు. ప్రపంచం దారుణమైన అస్తవ్యస్థ పరిస్థితులను ఎదుర్కోక తప్పదు. అందుకే అన్నిదేశాలు మొద్దునిద్ర వీడుతున్నాయి. రాబోవు విపత్కర పరిణామాలపై దృష్టి పెడుతున్నాయి. అయితే ఈ కృషి సరిపోదు. ఒక్కసారి వినియోగానికే తప్ప, పునరుత్పత్తికి, పునర్వినియోగానికి పనికిరాని సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించి, సౌర శక్తి, పవన శక్తి, తరంగ శక్తి వంటి కాలుష్య రహితమైన సాంప్రదాయేతర పునరుత్పాదక ఇంధనాలపై దృష్టి సారించాలి. బయో ఇంధనాల వాడకం వలన కూడా చాలావరకు హానికారక ఉద్గారాల శాతాన్ని తగ్గించవచ్చు. చైనా, ఆస్ట్రేలియా, ఇండియా వంటి దేశాల్లో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ఖతార్, ఇరాన్, అమెరికా, రష్యా దేశాల్లో సహజ వాయునిక్షేపాలు అధికం. గల్ఫ్‌దేశాలు యుద్ధాలవలన సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. గల్ఫ్ దేశాలు ఆర్థికంగా ముందంజలోఉండడానికి ప్రధానమైన కారణం అక్కడఇబ్బడిముబ్బడిగా ఉన్న చమురు నిక్షేపాలే కారణం. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలను ఊహించి, తరిగిపోయే ఇంధన వనరులను త్యజించి కాలుష్యరహితమైన ఇంధన వనరులపై దృష్టి సారించాలి. భారతదేశంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు, చమురు నిక్షేపాలున్నాయి. అయితే వీటిని వెలికితీసి, ఉత్పత్తి చేయడం తలకుమించిన భారం, వ్యయంతో కూడుకున్న వ్యవహారం. జార్ఖండ్ ఒరిస్సా, బెంగాల్, తెలంగాణా వంటి రాష్ట్రాలలో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉండగా, గుజరాత్, అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాలలో సహజ వాయునిక్షేపాలు అపారంగా ఉన్నాయి. అయినప్పటికీ మన దేశం సౌరశక్తి, వాయుశక్తి ఆధారిత విద్యుత్‌పై దృష్టి కేంద్రీకరించడం శుభపరిణామం. సాంప్రదాయ ఇంధన వనరులకు స్వస్తి చెప్పి, సాంప్రదాయేతర ఇంధనవనరులపై దృష్టి సారించాలి. అన్నింటికంటే సౌరశక్తిని విద్యుత్‌గామార్చడం శ్రేయస్కరం. ఇది కాలుష్యరహితం, పర్యావరణ సంరక్షణకు ఉత్తమమైన ఇంధన వనరు 'సౌరశక్తి'. ఎల్‌నినో ప్రభావం వలన తెలుగు రాష్ట్రాల్లో జలవిద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడిన దృష్ట్యా సౌరశక్తిపై మరింత దృష్టి సారించవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బొగ్గుపై ఆధారపడడం తగ్గించాలి. పవన శక్తినికూడా వినియోగంలోకి తీసుకురావాలి. ప్రస్తుతం ఇంధన రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు స్వస్తిచెప్పాలి. కాలుష్య రహిత ఇంధనాల వినియోగం పెంచాలి. పెట్రోల్, డీజిల్ ఇంధనాల వినియోగాన్ని నియంత్రించాలి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని అధికంచేయాలి. ●

# విమాన ఛార్జీల నియంత్రణకు చర్యలు

## 2 వారాల్లో నిబంధనలు నోటిఫై చేస్తామని సుప్రీంకు కేంద్రం వెల్లడి




**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** దేశంలో విమాన టికెట్ల ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పండుగలు, సెలవులు, రద్దీ సమయాల్లో విమాన ఛార్జీలు భారీగా పెరగకుండా నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ నేపథ్యంలో కొత్త నిబంధనల రూపకల్పన పూర్తయిందని కేంద్రం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. భారతీయ వాయుయాన్ అధినియమ్ 2024 చట్టం కింద రూపొందించిన నిబంధనలకు పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని, రాబోయే రెండు వారాల్లో వాటిని అధికారికంగా నోటిఫై చేసే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిణామం అమల్లోకి వస్తే విమాన ప్రయాణికులపై పెరుగుతున్న ఛార్జీల భారాన్ని నియంత్రించే దిశగా మార్గం సుగమమవుతుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ముందు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరఫున వాదనలు వినిపించారు. కొత్త చట్టానికి సంబంధించిన నిబంధనలను ఇప్పటికే ఖరారు చేశామని, వాటికి పరిపాలనాపరమైన అనుమతులు కూడా లభించాయని వివరించారు. మరో రెండు వారాల్లో నిబంధనలను నోటిఫై చేసే అవకాశం ఉందని కోర్టుకు తెలిపారు. దీంతో నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆ నిబంధనల ప్రతిని తమ ముందు సమర్పించాలని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. విమాన టికెట్ల ధరలు తరచూ భారీగా పెరుగుతున్నాయని, ముఖ్యంగా పండుగలు, సెలవుల సమయంలో ప్రయాణికులు అధిక మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని చాలా కాలంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విమానయాన రంగంలో పారదర్శకతను పెంచి, ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు సమర్థమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీనారాయణన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ప్రైవేట్ విమానయాన సంస్థలు టికెట్ ధరలు, ఇతర అనుబంధ ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. విమాన ప్రయాణికులకు న్యాయం జరిగేలా స్వతంత్ర నియంత్రణ వ్యవస్థ ఉండాల్సిన అవసరాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. విమానయాన రంగంలో ప్రైవేట్ సంస్థల పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో టికెట్ ధరల నిర్ణయంలో పారదర్శకత, ప్రయాణికుల హక్కుల పరిరక్షణపై చర్చ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. విమాన సంస్థలు డిమాండ్‌ను బట్టి ధరలను మార్చే విధానం ప్రయాణికులకు కొన్నిసార్లు భారంగా మారుతోంది. ముఖ్యంగా అత్యవసర ప్రయాణాలు చేయాల్సినవారు, ముందుగా టికెట్లు బుక్ చేసుకోలేని వారు అధిక ధరలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేలా నిబంధనలు రూపొందించాలని పిటిషనర్ కోరారు.

అయితే, విమానయాన రంగానికి సంబంధించిన కొత్త చట్టం అమల్లోకి రావడం, టికెట్ ధరలపై ప్రత్యక్ష నియంత్రణ విధించడం రెండూ ఒకటే కావు. కొత్త నిబంధనల్లో ధరల నియంత్రణకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు ఉంటాయన్నది వాటిని అధికారికంగా నోటిఫై చేసిన తర్వాతే స్పష్టమవుతుంది. ప్రయాణికులకు ఊరట కలిగించే చర్యలు తీసుకుంటారా ధరల పెరుగుదలపై పర్యవేక్షణ ఎలా ఉంటుంది విమాన సంస్థల ఛార్జీల విధానంలో పారదర్శకతను పెంచేందుకు ఎలాంటి ప్రమాణాలు రూపొందిస్తారు అనే అంశాలపై ఇప్పుడు ఆసక్తినెలకొంది. గతంలో జరిగిన విచారణల్లో పండుగలు, సెలవు రోజుల్లో విమాన టికెట్ల ధరలు ఒక్కసారిగా పెరగడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణ సమయాల్లో అందుబాటులో ఉండే టికెట్లు రద్దీ రోజుల్లో చాలా ఖరీదుగా మారడం వల్ల సామాన్య ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ అంశంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో కొత్తచట్టం కింద నిబంధనలను త్వరగా రూపొందిస్తామని కేంద్రం కోర్టుకు హామీఇచ్చింది.

తాజాగా వాటికి పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని వెల్లడించడం ఈ ప్రక్రియలో కీలక పరిణామంగా మారింది.



## సమస్య పరిష్కరించుకుంటే మేమే ధర్నాచేస్తాం

### రహదారి భద్రతపై సుప్రీం బెంచ్ సీరియస్

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** దేశ రాజధానిలోని ఢిల్లీ హైకోర్టు సమీపంలో రహదారి భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో జాప్యంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద తామే స్వయంగా కూర్చొని ధర్నా చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీ హైకోర్టు సమీపంలోని మధుర రోడ్డు కూడలి వద్ద రహదారి భద్రత, సరైన ట్రాఫిక్ నిర్వహణ లేకపోవడం, పాదచారుల భద్రతా పరమైన సమస్యలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. ఒక కమిటీ ఈ సమస్యను పరిశీలిస్తున్నదని, ఉన్నతాధికారులతో తాను చర్చించానని కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీ అవసరమేమిటని కోర్టు ప్రశ్నించింది. సమస్యను ఖచ్చితంగా గుర్తించి, పరిష్కారాన్ని కనుగొనేందుకు అమికస్ క్యూరీని భాగస్వామిగా చేయాలని సూచించింది. అధికారులు కమిటీ చర్చలకే పరిమితం కాకుండా, తదుపరి విచారణకు ముందే అవసరమైన క్షేత్రస్థాయి పనులను పూర్తి చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. మరోవైపు గడువులోగా అధికారులు స్పష్టమైన పరిష్కారాన్ని అమలు చేయడంలో విఫలమైతే, ఏఎస్‌జీతో పాటు ప్రధాన కార్యదర్శి కూడా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. నవంబర్ 25లోపు తగిన చర్యలు చేపట్టకపోతే, తామే స్వయంగా హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తామని పేర్కొంది. ఒకవేళ మీరు ఈ పని పూర్తి చేయకపోతే, మేమిద్దరం ఢిల్లీ హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద కూర్చుంటాం. పని పూర్తయ్యే వరకు అక్కడి నుంచి మేం కదలబోము, ఇంటికి కూడా వెళ్లము. ఇది ఖాయం. మిమ్మల్ని కూడా ఇంటికి వెళ్లనివ్వం అని ధర్మాసనం సరదాగా వ్యాఖ్యానించింది. ఢిల్లీలో ప్రస్తుతం వివిధ అంశాలపై అనేక నిరసనలు జరుగుతున్న తరుణంలో, సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యత సంతరించుకున్నది.

## సిజెపి చీఫ్ దీప్కేకు షరతులతోకూడిన బెయిల్

### నేహాబోరాను తెల్లవారుజామున విడుదల చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. ఆయనను విడుదల చేయాలని శనివారం కోర్టు ఆదేశించింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోనని బాండ్‌పై సంతకాలు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో శుక్రవారం సీజేపీ ˇతిరంగా మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్ సెంట్రల్ పార్క్‌లోని నిరసనకారులు చేరుకోవాలని అభిజిత్ దీప్కే కోరారు. ఈ మార్చ్ నిర్వహించడానికి ముందే ఆయనను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత అరెస్ట్ చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్లు 126, 170 కింద శాంతిభద్రతలకు భంగం కేసులో ఢిల్లీ పోలీసులు దీప్కేను అరెస్టు చేసిన తర్వాత, అతడిని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు శనివారం హాజరుపరిచారు. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడంతో, కస్టడీ నుంచి విడుదలయ్యారు. ఇదిలా ఉంటే, శుక్రవారం నిరసనలకు ప్రయత్నించిన వామపక్ష విద్యార్థి సంఘం నేత నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీస్ చట్టంలోని సెక్షన్ 65 కింద నిర్బంధానికి సంబంధించిన లాంఛనాలను పూర్తి చేసిన తర్వాత, బోరాను శనివారం తెల్లవారుజామున విడుదల చేశారు.

## లోయలో పడిన బస్సు: 8 మంది మృతి, 17 మందికి గాయాలు



**కోటా, రాజస్థాన్, అక్టోబరు 17:** ప్రయాణికులతో వెళ్తున్న ఒక బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలో పడటంతో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. మరో 17మందికి గాయాలయ్యాయి. రాజస్థాన్‌లోని కోటా సమీపంలో శనివారం తెల్లవారుజామున ఢిల్లీముంబయి ఎక్స్‌ప్రెస్‌పై పై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది ప్రయాణిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## పాకిస్థాన్‌లో భూకంపం: రిక్టర్‌స్కేలుపై 5.8గా నమోదు



**క్వెట్టా, అక్టోబరు 17:** పాకిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత 5.8గా నమోదైంది. భూకంప కేంద్రం పాకిస్థాన్‌లోనే ఏర్పడింది. భూకంప తీవ్రత భారతదేశంలోని కొన్ని ప్రాంతాలపై కూడా ప్రభావం చూపించింది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదు. శనివారం తెల్లవారుజామున హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత 4.1గా నమోదైంది. రాష్ట్ర రాజధానికి సుమారు 130 కిలో మీటర్ల దూరంలో ఉన్న రాంపూర్ ప్రాంతంలో ఈ ప్రకంపనలు నమోదయ్యాయి. జాతీయ భూకంప శాస్త్రకేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ) ప్రకారం ఉదయం 4:36గంటల ప్రాంతంలో కొన్ని సెకన్లపాటు ఈ ప్రకంపనలు సంభవించాయి. భూకంప కేంద్రం భూమికి 10 కిలో మీటర్ల లోతులో ఉందని పేర్కొంది. కొండ ప్రాంత రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్‌లో తరచుగా సంభవిస్తున్న భూకంపాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.



## నితీష్ కోసం తొమ్మిది హత్యలు చేయించా.. జెడియు ఎమ్మెల్యే అనంత్‌కుమార్ సింగ్

**పాట్నా, అక్టోబరు 17:** బీహార్‌లో అధికార కూటమికి చెందిన జేడీయూ ఎమ్మెల్యే అనంత్ కుమార్ సింగ్, సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం నితీశ్ కుమార్ రాజకీయంగా నిలదొక్కుకునేందుకు తొమ్మిది మంది హత్యలకు సూత్రధారిగా వ్యవహరించినట్లు తెలిపారు. దీనిపై విమర్శలు రావడంతో ఆయన మాటమార్చారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఆ నిందను మోపారు. ఈనెల 23న జరుగనున్న శాసన మండలి ఎన్నికలలో తన రాజకీయ ప్రత్యర్థి నీరజ్ కుమార్‌ను బరిలోకి దింపడంపై జేడీయూ ఎమ్మెల్యే అనంత్ కుమార్ సింగ్ ఆ పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ప్రత్యర్థిపై విరుచుకుపడుతూ కీలక ఆరోపణలు చేశారు. నాకు, నితీశ్ కుమార్‌కు చాలా కాలంగా పరిచయం ఉంది. ఆయనకు సహాయం చేయడానికి, నేను తొమ్మిది మందిని హత్య చేయించా. ఆయన రాజకీయంగా నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడుతున్న సమయంలో నేను అండగా నిలిచానని అన్నారు. ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) దీనిపై స్పందించింది. అనంత్ సింగ్ చేసిన ఈవ్యాఖ్యలు రాజకీయ నేరాలను ఆయన అంగీకరించినట్లుగా ఉన్నాయని ఆరో పించింది. మోతిహారి, ముజఫర్‌పూర్, వైశాలి లేదా మోకామా ప్రాంతాలకు చెందిన నేరస్తుల ముఠాలతో చేతులుకలపడం ద్వారానే నితీశ్ కుమార్ ఎదిగారని ఆర్జేడీనేత శక్తి సింగ్ యాదవ్ విమర్శించారు. మరోవైపు విమర్శల నేపథ్యంలో అనంత్ సింగ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు.

## పిరికివాళ్లు, సున్నితమనస్కులకు న్యాయవిద్య పనికిరాదు!

### నేషనల్ స్కూల్ ఆఫ్ లా స్నాతకోత్సవంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్



**బెంగళూరు, అక్టోబరు 17:** న్యాయవిద్య గ్రాడ్యుయేట్లపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని, సమాజంలో అన్యాయాలను ఎదిరించే ఆశాదీపాలుగా నిలవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. న్యాయవాదం అనేది పిరికివాళ్లు, సున్నిత, బలహీన మనస్సు ఉన్న వారికి ఎంతమాత్రం కూడా తగినది కాదని సీజేఐ సూర్యకాంత్ తేల్చిచెప్పారు. సమాజంలో నిరుపేదలు, బాధితులకు సమన్యాయం అందించడానికి ఈ తరహా మనస్తత్వం సరిపోదని వివరించారు. సమాజంలో ధర్మాన్ని, న్యాయాన్ని రక్షించే క్రమంలో అనేక సవాళ్లకు ధీటుగా, ధైర్యంగా నిలబడాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఈ వృత్తిలో రాణించాలంటే భయం లేని మనస్తత్వం, ఎంతో గుండె నిబ్బరాన్ని కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో ఎవరికీ వినిపించని అణగారిన వర్గాల స్వరాలను వినే వినమ్రతను అలవర్చుకోవాలని అన్నారు. మేధోపరమైన స్వతంత్రత, నైతిక బాధ్యత అత్యంత అవసరమని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. వృత్తిపరమైన సంక్లిష్టతలను ఎదుర్కొనడానికి మేధోపరమైన సమర్థతతో పాటు ఉన్నత ఆలోచనలు, దానికి తగ్గ నైతిక బాధ్యత కూడా అవసరమని, అప్పుడే సమన్యాయం అందించగలుగుతామని, ప్రాథమిక న్యాయ సూత్రాలను అనుసరించగలుగుతామని సీజేఐ వ్యాఖ్యానించారు. బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీజేఐ ప్రసంగించారు. వారికి దిశా నిర్దేశం చేశారు. న్యాయవాద వృత్తిలో ఎదురయ్యే సవాళ్ల గురించి వివరించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసమో, త్వరగా విజయాలను సాధించాలనే తపనతోనో వృత్తిపరమైన విలువలతో ఎప్పుడూ రాజీపడకూడదని యువ లాయర్లను హెచ్చరించారు. చట్టం అనేది ఒకచోట, ఒక కాలాని పరిమితం అయ్యే వ్యవస్థ కాదని, దానిని ఆచరించే న్యాయవాదులు, న్యాయమూర్తుల ఆలోచనలు, చర్యల ద్వారా నిరంతరం పరిణామం చెందుతుంటుందని వివరించారు.

అనంతరం డీకే శివకుమార్ మాట్లాడారు. నేషనల్ లా స్కూల్ అభివృద్ధి, దాని ప్రతిష్టను కాపాడటానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. విశ్వవిద్యాలయ విస్తరణ, భవిష్యత్ అవసరాల కోసం 10 ఎకరాలు కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. న్యాయ శాఖకు సంబంధించిన నూతన భవన నిర్మాణ ప్రతిపాదనపై త్వరలోనే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.



## ప్రముఖ సినీ సంగీత దర్శకుడు దేవా కన్నుమూత

**చెన్నై, అక్టోబరు 17:** సినీపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు దేవా (75) కన్నుమూశారు. గుండెపోటుతో చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తమిళ ఇండస్ట్రీ దిగ్భ్రాంతికి గురైంది. దేవా మృతికి సినీ సెలబ్రిటీలు, ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు. 1950 నవంబర్ 20న దేవనేసన్ చొక్కలింగంగా దేవా జన్మించారు. జెబీ కృష్ణ శిక్షణలో శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ఆయన విలక్షణమైన స్వరాలు, జానపద ఆధారిత స్వరకల్పనలు, ప్రధాన చిత్రాలలో గాన సంగీతానికి ప్రాచుర్యం కల్పించడంలో విశేష కృషి చేశారు. 1986లో వచ్చిన మాట్టుకర మన్నారు సినిమాతోనే పరిశ్రమలో అరంగేట్రం చేశారు. ఆ తర్వాత పలు భాషల్లో సినిమాలకు సంగీతం అందించారు. తమిళ ఇండస్ట్రీలో గానా జానర్ పితామహుడిగా దేవా గుర్తింపు పొందారు. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ సినిమాలకు దేవా పనిచేశారు. మూడు దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో సుమారు 400 సినిమాలకు దేవా సంగీతం అందించారు. తమిళంతోపాటు తెలుగులోనూ దేవ సంగీంతం అందించారు. శ్రీమాన్ బ్రహ్మచారి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఆయన సంగీతం అందించిన తెలుగు తొలి సినిమా ఇదే. ఆ తర్వాత చిరంజీవి హీరోగా తెరకెక్కిన మాస్టర్, పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన తొలిప్రేమకు కూడా సంగీతం అందించారు. ఈ సినిమాలతోపాటు ఆటోడ్రైవర్, బాగున్నారా, నాగ తదితర సినిమాలకు దేవ పనిచేశారు. ఇక రజనీకాంత్ నటించిన బ్లాక్‌బస్టర్ బాషా, అన్నామలై, అరుణాచలం వంటి ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు దేవా సంగీతం అందించారు. ఆయన కొడుకు శ్రీకాంత్ దేవా కూడా మ్యూజిక్ డైరెక్టర్‌గానే ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. అలాగే తమిళ నటుడు జై, దేవా మేనల్లుడే. దేవా మృతి పట్ల ప్రముఖ నటి ఖుష్బు సుందర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ వార్త తెలియగానే నేను ఎంతో బాధపడ్డాను. నిజంగా ఇది నేను నమ్మలేకపోతున్నామని అన్నారు. తమిళనాడు మాజీ సీఎం ఎంకె స్టాలిన్, ప్రస్తుత సీఎం విజయ్ ఇతర రాజకీయ పార్టీల నాయకులు దేవా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయం వద్ద ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.



## భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న ఐటి ఉద్యోగి

**గురుగ్రామ్, అక్టోబరు 17:** హరియాణాలోని గుర్గావ్‌లో ఒక ఐటీ ఉద్యోగి భార్యను హత్య చేశాడు. అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన గత బుధవారం జరగగా, ఆలస్యంగా వెలుగుచూసింది. ఇద్దరి మృతదేహాలువారి అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో లభించాయి. కేరళకు చెందిన మొహమ్మద్ అస్లాం, ఫర్హానా దంపతులు ఐటీలో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో బెంగళూరులో ఉద్యోగం చేసిన వీరు మూడునెలల క్రితమే గుర్గావ్ వచ్చారు. అక్కడి ఎం3ఎం మెరినా రెసిడెన్షియల్ సొసైటీలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. గత బుధవారం భార్య ఫర్హానా బర్త్ డే కూడా. అదేరోజు అస్లాం తన కంపెనీకి మేం ఈ ప్ర పంచాన్ని వదిలివెళ్లిపోతున్నామని మెయిల్ చేశాడు. మెయిల్ గురించి తెలిసిన వారి సహోద్యోగులు వారు అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్ ఓనర్‌కు సమాచారం అందించగా లోపలికి వెళ్లి చూడగా భార్యాభర్తల మృతదేహాలు లభించాయి. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు.

## మహారాష్ట్ర రైతుల కోసం ఐఎఎస్,ఐపిఎస్‌లు ఒకరోజు వేతనం విరాళం






**ముంబయి, అక్టోబరు 17:** మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో తీవ్ర నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో కరువు బాధిత రైతులను ఆదుకునేందుకు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ముందుకొచ్చారు. 2026 అక్టోబర్ నెలలో తమ ఒక రోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించాలని నిర్ణయించారు. కరువు కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతు కుటుంబాలకు అండగా నిలవడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం. మహారాష్ట్రలోని 305 తాలూకాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా రాష్ట్ర సహాయ, పునరావాస శాఖ ఈనెల 14న అధికారికంగా ప్రకటించింది. వర్షాభావ పరిస్థితులు తీవ్రం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలపై ఆర్థిక భారం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పలు ఉపశమన చర్యలను ప్రకటించింది. భూమిశిస్తు మినహాయింపు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, వ్యవసాయ రుణాల వసూళ్ల నిలిపివేత, వ్యవసాయ పంపుసెట్ల విద్యుత్ బిల్లులపై రాయితీలు, కరువు ప్రభావిత ప్రాంతాల విద్యార్థులకు పరీక్ష ఫీజుల మినహాయింపు వంటి చర్యలు ఇందులో ఉన్నాయి. మరోవైపు, రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. కరువు బాధిత రైతులకు సహాయం అందించేందుకు మహారాష్ట్రలో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ అక్టోబర్ నెలలో ఒక రోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక లేఖ సమర్పించింది. వేతన విరాళాలను సేకరించి సహాయ నిధిలో జమ చేయడానికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి తెలియజేసింది. కరువు సహాయ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధుల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. చిప్లున్-సంగమేశ్వర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే శేఖర్ నికమ్ తన ఒక నెల ప్రాథమిక వేతనాన్ని కరువు సహాయ కార్యక్రమాలకు విరాళంగా అందించారు. ఈ మేరకు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్రా పవార్‌కు చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు పరిపాలనా, ఆర్థిక రాయితీలు ప్రకటించినప్పటికీ, కరువు బాధిత కుటుంబాలకు నేరుగా నగదు సాయం అందించాలని ఎమ్మెల్యే రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న నష్టాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ ఆర్థిక సహాయం అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కరువు బాధిత రైతులకు హెక్టారుకు రూ.50,000 చొప్పున ప్రత్యక్ష ఆర్థిక సాయం అందించాలని, కరువు కారణంగా ఉపాధి, ఆదాయం కోల్పోయిన వ్యవసాయ కూలీలకు రూ.25,000 ఆర్థిక సాయం ఇవ్వాలని, రుణాల పునర్వ్యవస్థీకరణ, భూమిశిస్తు మినహాయింపుల వంటి రాయితీలతో పాటు నేరుగా నగదు సాయం అందిస్తే బాధిత కుటుంబాలకు తక్షణ ఉపశమనం లభిస్తుందని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్‌కు దూరం..సిజెపితో తృతీయ కూటమి

### వ్యూహం మారుస్తున్న డిఎంకె స్టాలిన్

**చెన్నై, అక్టోబరు 17:** డీఎంకే, కాంగ్రెస్ మధ్య దూరంమరింత పెరుగుతోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన ఈ రెండు పార్టీలు, టీవీకే గెలిచిన తర్వాత డీఎంకేను కాదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ్ పక్షాన చేరారు. ఈ పరిణామాన్ని కాంగ్రెస్ వెన్నుపోటుగా డీఎంకే వర్ణిస్తోంది. ఇదిలా ఉంటే, ఇప్పుడు ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా రాజకీయ నిరసనలు చేస్తున్న కాంగ్రెస్‌కు డీఎంకే దూరం పాటిస్తూనే సర్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ లకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీకి మద్దతు తెలుపుతోంది. చెన్నైలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో ఎస్ఐఆర్ వ్యతిరేక పోరాటానికి మద్దతు తెలపాలని, సీజేపీకి మద్దతు ఇవ్వాలని పార్టీ అధినేత ఎంకే స్టాలిన్ తన ఎంపీలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో తమకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు స్టాలిన్ స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. గత కొన్ని రోజులుగా సీజేపీకి మద్దతుగా ఎక్స్ వేదికగా స్టాలిన్ పలు పోస్టులు పెడుతున్నారు. సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే, కో కన్వీనర్లు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ నిర్బంధాలపై ఆయన స్పందించారు. ఇదిలాఉంటే, తమిళనాడులో గెలిచిన విజయ్ టీవీకే, ఓడిపోయిన డీఎంకే రెండుకూడాఎన్నికల సంఘం నిర్వహించిన ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తుండటం గమనార్హం.

## రష్యా ముడిచమురు దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేత

**వాషింగ్టన్, అక్టోబరు 17:** రష్యా, ఇరాన్‌లపై ఇటీవల విధించిన ఆంక్షలు, సుంకాల్లో కొన్నింటిని సడలిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసారు. సెప్టెంబర్‌లో చట్టంగా మారిన లిండ్సే ఓ. గ్రాహం రష్యాఇరాన్ ఆంక్షల చట్టం 2026లోని సెక్షన్ 115 ద్వారా సంక్రమించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగిస్తూ అమెరికా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కొన్ని ఆంక్షలను నిలిపివేస్తున్నట్లు కాంగ్రెస్‌కు పంపిన నివేదికలో ట్రంప్ వెల్లడించారు. రష్యా నుండి భారీగా ముడిచమురు దిగుమతి చేసుకుంటున్న భారతదేశం, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు ప్రతిపాదించిన ప్రతీకార దిగుమతి సుంకాల భయాలను ఈ నిర్ణయం తాత్కాలికంగా తొలగించింది. న్యూయార్క్‌లో జరిగిన సమావేశంలో భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియోతో ఈ ఆంక్షల చట్టంవల్ల ఎదురయ్యే సవాళ్లను లేవనెత్తారు. అమెరికాలో నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల నేపథ్యంలో అక్కడి పౌరులపై పెరిగిన డీజిల్, ఇంధన ధరల భారాన్ని తగ్గించడానికే ట్రంప్ ఈనిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డీజిల్ ధరలు పెరిగితే రవాణా, వ్యవసాయ రంగాలుదెబ్బతిని సరఫరా వ్యవస్థలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని భావించిన ట్రంప్ ప్రభుత్వం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రత్యేక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం కింద రష్యా తక్షణమే 3,00,000టన్నుల డీజిల్‌ను అమెరికాకు సరఫరాచేయడానికిఅంగీకరించింది. నవంబర్ నాటికి మరో ఐదు లక్షల టన్నులు, ఆ తర్వాత దశలవారీగా కోటి టన్నుల వరకు డీజిల్ అమెరికాకు సరఫరా కానుంది.

# సంక్షిప్త వార్తలు

## ఐదు రోజులకే ప్రెస్ సెక్రటరీపై వేటు వేసిన ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఐదురోజులకే కెటి జకారియాను ఆ పదవి నుంచి తొలగించారు. ఆమె పనితీరుపై విమర్శలు రావడం, విద్యార్హతలపై ప్రశ్నలు తలెత్తడం ఈ పరిణా మానికి కారణంగా తెలుస్తోంది, కెటి జకారియా ఈ నెల 12న శ్వేతసౌధ మీడియా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆమరుసటి రోజే ఆమె తొలిసారి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అయితే ఆ సమావేశం 15 నిమిషాల్లోపే ముగిసింది. కేవలం ముగ్గురు విలేకరులు అడిగిన ప్రశ్నలకే ఆమె బదులిచ్చారు.

## 20మంది కానిస్టేబుళ్లను కిడ్నాప్ చేసిన సాయుధులు



**ఇస్లామాబాద్, అక్టోబరు 17:** శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు తమ ఇళ్లకు వెళ్తుండగా సినీ ఫక్కీ లో సాయుధులు అడ్డుకుని వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటన పాకిస్థాన్‌లోని క్వెట్టా-కరాచీ హైవే పై చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం కలత్ పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణను పూర్తిచేసుకుని విధుల్లో చేరడానికి ముందు 20మంది కానిస్టేబుళ్లు తమ ఇళ్లకు బయల్దేరారు. శనివారం క్వెట్టా-కరాచీ హైవేపై ఒక ప్యాసింజర్ వ్యాన్ వెళ్తుండగా మోటార్‌సైకిళ్లపై వచ్చిన కొందరు సాయుధులు వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం వాహనంతోపాటు అందులోని 20 మంది కానిస్టేబుళ్లను కూడా అదుపులోకి తీసుకొని, గుర్తుతెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. వ్యాన్ డ్రైవర్, మరో ముగ్గురు ప్రయాణికులను మాత్రం వారు విడిచిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మాస్తుంగ్ పోలీసులు ధ్రువీకరించారు.




## సౌదీకి ఎయిరిండియా సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** సౌదీ అరేబియా హౌతీ తిరుగుబాటుదారుల ఘర్షణ నేపథ్యంలో ఎయిర్ ఇండియా కీలక ప్రకటన చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జెడ్డా, రియాద్, దమ్మామ్ నగరాలకు ఈనెల24 వరకు అన్ని విమాన సర్వీసుల్ని తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించాయి. విమానాల రద్దు నేపథ్యంలో ప్రయాణికులకు టికెట్ తేదీ మార్చుకోవడం లేదా పూర్తి రీఫండ్ పొందేఅవకాశాన్ని కల్పించాయి. ఈనెల 15 లేదా అంతకన్నా ముందు కన్ఫర్మ్ అయిన బుకింగ్‌లు చేసుకుని 9 ,24 మధ్య ప్రయాణించాల్సిన ప్రయాణికులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించారు.

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హాతం



**శ్రీనగర్, అక్టోబరు 17:** జమ్మూ కాశ్మీర్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఈ ఘటను శుక్రవారం అర్ధరాత్రి తర్వాత, జమ్మూ కాశ్మీర్ కుప్వారా జిల్లాలో జరిగింది. భారత్‌పాక్ సరిహద్దు అయిన లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ) వద్ద, కెరాన్ సెక్టార్‌లోని, జగ్‌మండ్ ఏరియాలో శనివారం వేకువఝామున ముగ్గురు, నలుగురు వ్యక్తులు రహస్యంగా ఇండియావైపు రావడాన్ని భారత భద్రతా దళాలు గుర్తించి కాల్పులు జరిపాయి. ఈ ప్రాంతం మొత్తం కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్మీ తెలిపింది. తీవ్రవాదులు అక్రమ చొరబాటుకు ప్రయత్నించారని, ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మరణించారని ఆర్మీ అధికారులు వెల్లడించారు.

## ఫుడ్‌పాయిజన్‌తో ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి



**నోయిడా, అక్టోబరు 17:** గ్రేటర్ నోయిడాలో తీవ్ర విషాదం చోటుచేసుకున్నది. ఓ కుటుంబానికి చెందిన అయిదుగురు మృతిచెందారు. ఆ మృతుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. రబుపురా ఏరి యాలో అనుమానాస్పద రీతిలో ఈ ఘటన జరిగింది. బహుశా ఫుడ్ పాయిజనింగ్ వల్ల మరణిం చినట్లు ప్రాథమికంగా పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఫోరెన్సిక్ బృందం అక్కడకు వచ్చి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధితులను మహేశ్, భార్య లలిత, కుమారులు లడ్డూ, శాక్‌సత్, కుమార్తె మిస్తిగా తేల్చారు. గత రాత్రి ఆ ఫ్యామిలీ నూడుల్స్ తిన్నట్లు బాధితుల్లో ఒకరి తల్లి చెప్పారు.

## సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ప్రకృతి ఆరాధనకు, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 18వ తేదీన సద్దుల బతుకమ్మ సందర్భంగా గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పూలతో బతుకమ్మను అలంకరించి గౌరమ్మను ఆరాధించడం ప్రకృతితో మనకున్న విడదీయరాని అనుబంధానికి ప్రతీక అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల్లో భక్తిభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. గౌరమ్మ దీవెనలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు.

### బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి నిదర్శనం : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలందరికీ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ అంటేనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని, ఇది మన ఆడబిడ్డల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే ప్రకృతి పండుగ అని అన్నారు.
ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, మన ఆడబిడ్డలు, రైతన్నలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

### రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బతుకమ్మ పండుగ: మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** 'తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఆడపడుచులందరికీ తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధనలో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత బతుకమ్మ పండుగకు దక్కుతుందని తెలిపారు.

### ప్రజల ఐక్యతకు నిదర్శనం : పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, ఐక్యతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

### తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతం : మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్,అక్టోబరు17,ప్రభాతవార్త:** రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు వేడుకలు సద్దుల బతుకమ్మ సందర్భంగా, తెలంగాణ ఆడబిడ్డలకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదిరోజుల పాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలతో తెలంగాణ వ్యాప్తంగా సందడి నెలకొన్నదన్నారు. 'మల్లా రావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ ఘనమైన తెలంగాణ సాంస్కృతిక వేడుకలను ఆడబిడ్డలు ముగిస్తారని కేసీఆర్ తెలిపారు.
రాష్ట్ర సాధనలో, తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతమైనదని, వారి కృషిని త్యాగాలను గుర్తించిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఎటువంటి కష్టం కలగకుండా చూస్తూ, వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారానే బతుకమ్మ పండుగ స్ఫూర్తిని కొనసాగించిన వారమౌతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

## నీళ్లు, నిధులు, నియామకాలు కెసిఆర్ కుటుంబానికి దక్కాయి

### ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ విమర్శ

**హైదరాబాద్, అక్టోబరు17, ప్రభాతవార్త:** తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు కల్వకుంట్ల కుటుంబానికే దక్కాయనీ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అన్నారు. సిఎల్‌పిలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కెసిఆర్ ఆ నినాదాన్ని తన కుటుంబం కోసం, స్వార్థం కోసమే వాడుకున్నాడని విమర్శించారు. ఇది కల్వకుంట్ల కుటుంబం తెచ్చిన కరువు. కాసుల కోసం కక్కుర్తిపడి, కట్టాల్సినచోట ప్రాజెక్టులు కట్టలేదనీ అన్నారు. కాళేశ్వరం నీళ్లను తన ఫామ్ హౌస్ కు వచ్చేలా చేసుకున్నాడనీ ఆయన ఆవేదన చెందారు. నియామకాలు, తన కుటుంబ సభ్యులు హరీష్ రావు, కేటీఆర్, కవిత, సంతోష్ రావు బంధువులకు కట్టబెట్టాడు. ఇక నిధుల మాటకొస్తే, సర్కార్ ఖజానా ఖాళీ అయింది, విరాళాల రూపంలో బిఆర్ఎస్ ఖాతా నిండిదనీ ఆరోపించారు. అంతే కాదు అధికారాన్ని అడ్డుపెట్టుకుని, నిధులు దారి మళ్లించి, దండుకున్నారనీ విమర్శించారు. భూములు, వ్యాపారాలు, పెంచుకున్నారే తప్పా, ప్రజల గురించి ఆలోచించిన పాపాన పోలేదు. ఇలా తెలంగాణ కోసం సబ్బండ వర్గాల ప్రజలు తెగించి కొట్లాడితే బాగుపడింది మాత్రం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే అని అన్నారు. ఇప్పుడు ప్రపంచమంతా ఎల్ నినో ప్రభావం ఉంటే, తెలంగాణలోనే ఉన్నట్లు, ప్రభుత్వమే చేసినట్లు బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం వారి అవివేకం అని విమర్శించారు.. హరీష్ రావు ధర్నా రైతుల కోసం కాదు, వాళ్ల మామ ఫామ్ హౌస్ కు నీళ్ళు ఇవ్వాలని మాత్రమే అని అన్నారు, గత పదేళ్లు ఎవరు ఏం చేశారో ప్రజలంతా గమనించే, మిమ్మల్ని గడప దాటించారనీ అన్నారు. సొంత తెలివితేటలు కాకుండా, నిపుణులు సలహాలు తీసుకుని కాళేశ్వరం కట్టిఉంటే, ఈ కష్టకాలంలో కాళేశ్వరం ఉపయోగపడేది. చేసిన తప్పులన్నీ మీరు చేసి ఇవాళ ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు. మీరెంత చెప్పిన వాస్తవ పరిస్థితులు ఏంటో ప్రజలందరికీ తెలుసనీచెప్పారు.

# తాగునీటి సమస్యలు రాకుండా పూర్తి చర్యలు

### పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలి
### నవంబరు మొదటి వారంలో కలెక్టర్లతో సమీక్షలు
### 23న సింగూరు రిజర్వాయర్‌పై ప్రత్యేక సమావేశం
### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమీక్ష



శనివారం గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మంచినీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఎర్ర మంజిల్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో శనివారం మంత్రి సీతక్క ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల వారీగా నీటి నిల్వలు, ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితులు, రానున్న వేసవిలో ఎదురయ్యే అవసరాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవ రాజన్, నివిది కృపాకర్ రెడ్డి, వివిధ స్థాయిలకు చెందిన చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.
నవంబర్ 1వ తేదీలోపు సాగునీటి అవసరాలు తీరిన అనంతరం రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా అత్యవసర పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పంపులను సమీకరించి కనీసం 100 పంపులను అందుబాటులో ఉంచాలని, పనిచేయని పంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. రానున్న యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిచ్చేలా రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో కలిసి గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి వేసవి కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. రెండో వారంలో మండల స్థాయిలో తాగునీటి అవసరాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకొని హ్యాబిటేషన్‌ల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి వినియోగానికి సిద్ధం చేయాలని చెప్పారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాల పనులను పూర్తి చేయాలని, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రతి చుక్కా విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఇతర శాఖలు రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టే సమయంలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల కారణంగా పైప్‌లైన్లు దెబ్బతింటే సంబంధిత శాఖలే బాధ్యత వహించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైప్‌లైన్లు దెబ్బతిన్న సందర్భాల్లో వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్ మరమ్మతులకు అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఇందుకోసం నిబంధనల మేరకు విబి జీ రామ్‌జీ నిధులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు, తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్న అత్యవసర నిధులతో పాటు ఎస్‌డీఎఫ్ నిధులను కూడా నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించేలా కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సింగూరు రిజర్వాయర్ మినహా ఇతర రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన నీటి నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌పై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికలు, నీటి వనరుల సమర్థ వినియోగం, నిరంతర పర్యవేక్షణతో రానున్న వేసవిలోనూ ప్రజలకు మంచినీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## సందర్శకులకు మెరుగైన అనుభూతి కల్పించేలా గ్యాలరీల అభివృద్ధి

### విద్యా కార్యక్రమాల విస్తరణ, అరుదైన కళాఖండాల ప్రదర్శనకు కొత్త రూపు
### సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు మీటింగ్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా



శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ అధ్యక్షతన జరిగిన సాలార్‌జంగ్ మ్యూజియం సమావేశంలో పాల్గొన్న బోర్డు సభ్యులు

**హైదరాబాద్, అక్టోబరు17, ప్రభాతవార్త:** సాలార్‌జంగ్ మ్యూజియంను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మరింత మెరుగైన అనుభూతిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచించారు. మ్యూజియంలోని అరుదైన కళాఖండాలు, చారిత్రక సంపదను ఆధునిక ప్రదర్శన పద్ధతుల ద్వారా ప్రజలకు చేరువ చేయడంతో పాటు, విద్యార్థులు, యువతలో చరిత్ర, కళలు, సంస్కృతి పట్ల ఆసక్తిని పెంపొందించాలని పేర్కొన్నారు. శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ అధ్యక్షతన జరిగిన సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు సమావేశంలో మ్యూజియం అభివృద్ధి, సందర్శకుల సౌకర్యాల మెరుగుదల, విద్యా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. మొత్తం 13 అజెండా అంశాలను పరిశీలించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలపై బోర్డు సభ్యులు ,అధికారులతో చర్చించారు. మ్యూజియం గుర్తింపును మరింత పెంచేందుకు బాహ్య, అంతర్గత సూచిక బోర్డులు, అగ్నిప్రమాద నివారణ-భద్రతా సూచికలు, దుకాణాలు, ఇతర సౌకర్యాల వద్ద సమాచార బోర్డుల ఏర్పాటు వంటి అంశాలను ప్రాధాన్య ప్రణాళికలో చేర్చారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రీకృత ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ, మరుగుదొడ్ల అభివృద్ధి, భవనం పైకప్పుకు వాటర్‌ప్రూఫింగ్, కార్పెట్ల నిల్వ సదుపాయం, ప్రస్తుతం ఉన్న లిఫ్టుల మెరుగుదలతోపాటు అదనపు లిఫ్టు ఏర్పాటు ప్రతిపాదనలను వివరించారు. అతిథి గృహం పునరుద్ధరణ, మ్యూజియం మాస్టర్ ప్లాన్ రూపకల్పన, ప్రాజెక్టు నిర్వహణ, క్యూరేటోరియల్ విభాగాల సమన్వయంపైనా దృష్టి సారించారు. మ్యూజియం క్యూరేటర్ (ఎడ్యుకేషన్) జ్యోతి రాయ్ విద్యా కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్యార్థులు, యువతకు చరిత్ర, కళలు, వారసత్వ సంపదపై అవగాహన కల్పించే కార్యక్రమాల వివరాలను సమర్పించారు. అనంతరం క్యూరేటర్ (డిస్‌ప్లే) మ్యూజియం ఆధునికీకరణ, గ్యాలరీల పునరుద్ధరణ, ప్రదర్శన విధానాల మెరుగుదలకు సంబంధించిన ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, మ్యూజియంలు కేవలం గత వైభవాన్ని ప్రదర్శించే ప్రదేశాలు మాత్రమే కాకుండా, భావితరాలకు చరిత్ర, కళలు, నాగరికతా వికాసాన్ని పరిచయం చేసే విజ్ఞాన కేంద్రాలని పేర్కొన్నారు. సందర్శకులకు కళాఖండాల విశిష్టతను సులభంగా అర్థమయ్యేలా వివరించే విధానాలను అవలంబించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పిల్లలు, యువతను ఆకర్షించే విద్యా కార్యక్రమాలు, ఇంటరాక్టివ్ ప్రదర్శనల ద్వారా మ్యూజియంను మరింత ప్రజాదరణ పొందేలా తీర్చిదిద్దాలని అన్నారు. సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ సూరజ్ కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసి ప్రత్యేక అధికారి జయేష్ రంజన్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, అకౌంటెంట్ జనరల్ (ఏ అండ్ ఈ) వి.ఎం.వి. నవల్ కిషోర్, బోర్డు సభ్యులు ప్రొఫెసర్ వి. కిషన్ రావు, డాక్టర్ శ్రీపెరంబుదూర్ జైకిషన్, డాక్టర్ రాజి రెడ్డి సీలం, క్యురేటర్ , హెచ్‌ఓఓ డాక్టర్ ఆర్.బి. నాయక్, డిప్యూటీ క్యురేటర్ (కన్జర్వేషన్) కల్పన తదితరులు పాల్గొన్నారు.



శనివారం తెలంగాణ జనసమితి కార్యాలయంలో వ్యవస్థాక అధ్యక్షుడు కోదండరామ్ తదితరులతో కలసి మీడియాతో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపునకు టిజెఎస్ ప్రధాన భూమిక

### కోదండరామ్‌తో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశం

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం టిజెఎస్ ప్రధాన భూమిక పోషించాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అభ్యర్థించారు. తెలంగాణ జనసమితి కార్యాలయంలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం సాయంత్రం టిజెఎస్ అధినేత కోదండరామ్, ఇతర నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, టిజెఎస్ పార్టీల మధ్య ఉన్న రాజకీయ భాగస్వామ్యం, పరస్పర సహకారం, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ అస్థిత్వ మనుగడ కోసం టిజెఎస్ వ్యస్థాపక అధ్యక్షుడు కోదండరామ్ ఎంతగానో పోరాటం చేస్తున్నారని కితాబు ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిజెఎస్ భాగస్వామ్యంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి టిజెఎస్ వివిధ సందర్భాల్లో అందిస్తున్న మద్దతు, సహకారం రాజకీయంగా ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టిజెఎస్ ప్రధాన భూమిక పోషించాలని, కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు అందించాలని టిజెఎస్ నాయకులను కోరినట్లు వెల్లడించారు. ఎన్నికలతోపాటు ఇతర రాజకీయ సందర్భాల్లోనూ టిజెఎస్ కాంగ్రెస్‌కు సహకరిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినట్లు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కాంగ్రెస్, టిజెఎస్ పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారం కొనసాగాలని, రానున్న ఎన్నికల్లోనూ కలిసి పనిచేయాలని చర్చించినట్లు పేర్కొన్నారు.

## దివ్యాంగుల కోసం వినూత్న సాంకేతిక పరిష్కారాల రూపకల్పన

### క్రైటేకి ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకుడు రఘుదత్ డెగాలాకు కెటిఆర్ అభినందనలు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు చెందిన క్రైటేకి ఇన్నో వేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రఘు దత్ డెగాలాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో కలుసుకున్నారు. వందే భారత్ 2026లో క్రైటేకి ఇన్నోవేషన్స్ విశేష గుర్తింపు పొందిన సందర్భంగా రఘుదత్ డెగాలాను కేటీఆర్ అభినందించారు. దివ్యాంగుల జీవితాల్లో సౌలభ్యం, ఆత్మగౌరవం, స్వతంత్రతను పెంపొందించే వినూత్న సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. సహాయక సాంకేతిక పరిజ్ఞానంతో దివ్యాంగులు, వృద్ధులు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తున్న క్రైటేకి ఇన్నోవేషన్స్ సాధించిన విజయం అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. రఘు దత్ డెగాలా, ఆయన బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. క్రైటేకి ఇన్నోవేషన్స్ వందే భారత్ 2026లో దేశవ్యాప్తంగా వచ్చిన 26,000కు పైగా దరఖాస్తుల నుంచి ఎంపికైన టాప్10 ఆవిష్కర్తల్లో స్థానం సంపాదించింది. అహ్మదాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఫినాలేలో ప్రత్యేక విభాగం - దివ్యాంగులు కింద అవార్డుతో పాటు రూ.11 లక్షల నగదు బహుమతిని అందుకుంది.
సంస్థ రూపొందించిన కీలక ఆవిష్కరణ గుకోబిడెట్ వ్యక్తిగత పరిశుభ్రతను మరింత సులభతరం చేయడంతో పాటు, ముఖ్యంగా బహిరంగ మరుగుదొడ్లలో దివ్యాంగులు స్వతంత్రంగా వినియోగించుకునేలా రూపొందించబడింది. చేతితో నిర్వహించగలిగే వెర్షన్‌తో పాటు, పాదాలతో పెడల్ ద్వారా పనిచేసే వెర్షన్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఉత్పత్తి దివ్యాంగులు, వృద్ధులు, ఇతర ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు దోహదపడుతుంది. పారిశ్రామికవేత్తగా, దివ్యాంగుల హక్కులు-సమ్మిళిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్న వ్యక్తిగా, శిక్షణ, కౌన్సెలింగ్, నాయకత్వ అభివృద్ధి రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన రఘు దత్ డెగాలా తన వ్యక్తిగత అనుభవాల నుంచి స్ఫూర్తి పొందారు. ఫోకోమీలియా అనే అరుదైన అవయవ అభివృద్ధి పరిస్థితితో జీవిస్తున్న ఆయన, తనకు ఎదురైన సవాళ్లను ఇతరులకు ఉపయోగపడే పరిష్కారాలుగా మార్చాలనే లక్ష్యంతో క్రైటేకి ఇన్నోవేషన్స్ ద్వారా కృషి చేస్తున్నారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు అందుబాటు ధరల్లో, ఆచరణాత్మకంగా, అందరినీ కలుపుకొని వెళ్లే పరిష్కారాలను అభివృద్ధి చేయాలన్న రఘు దత్ డెగాలా సంకల్పం స్ఫూర్తిదాయకమని కేటీఆర్ అభినందించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, స్వతంత్ర జీవనం, గౌరవప్రదమైన జీవన ప్రమాణాలు అందేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్న ఆయన ప్రయత్నాలు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## శిక్షణలో ఉన్న సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం ప్రత్యేక వారసత్వ పర్యటన

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం శనివారం ప్రత్యేక వారసత్వ పర్యటన ఏర్పాటు చేసింది. ఈ పర్యటన చారిత్రక కట్టడం చార్మినార్ వద్ద ప్రారంభమై, ప్రసిద్ధ చారిత్రక భవనం చౌమహల్లా ప్యాలెస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు హైదరాబాద్ నగర చరిత్ర, విశిష్ట నిర్మాణ శైలి, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం పొందారు. హైదరాబాద్ నగర సాంస్కృతిక గుర్తింపులో ఈ చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను, వాటి చారిత్రక నేపథ్యాన్ని శిక్షణలో ఉన్న అధికారులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక సంపదపై అవగాహన కల్పించడంతో పాటు, రాష్ట్ర పర్యాటక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు శాఖ చేపడుతున్న కార్యక్రమాల్లో ఈ వార సత్వ పర్యటన ఒక భాగం అని అధికారులు తెలిపారు.

## బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి కెటిఆర్ భరోసా

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడు కర్నె వినయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. బాలుడికి అందుబాటులో ఉన్న అత్యుత్తమ వైద్యం అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని బాలుడికి, అతని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన కర్నె ఆదినారాయణ, అనిత దంపతుల కుమారుడు వినయ్ ప్రస్తుతం బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ చొరవతో బాలుడు కెటిఆర్‌ను కలిశాడు. ఈ సందర్భంగా కేటీఆర్ బాలుడు వినయ్‌తో ఆప్యాయంగా మాట్లాడి, అతని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులతోనూ మాట్లాడి, వైద్యానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. బాలుడి కుటుంబం ఆందోళన చెందవద్దని, వినయ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కెటిఆర్ ఆదేశాల మేరకు మెరుగైన వైద్యం అందించేందుకు వినయ్‌ను సింధు ఆసుపత్రిలో చేర్పించారు. బాలుడికి అవసరమైన వైద్య సహకారం అందించేందుకు కేటీఆర్ ముందుకు రావడంపై వినయ్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ కుమారుడి వైద్యానికి అండగా నిలిచిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం.. ఓటు కోసం పోరాడాల్సిన దుస్థితి




శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎఐసిసి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఛైర్మన్ మధుయాష్కీ

### మంత్రులను తప్పుదోవపట్టిస్తున్న గత ప్రభుత్వంలోని కీలక అధికారులు
### ఎఐసిసి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఛైర్మన్ మధుయాష్కీ

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడిందని ఓటుకోసం పోరాడాల్సిదుస్థితి నెలకొందని ఎఐసిసి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహాత్మాగాంధీ ,నెహ్రూ, అంబేద్కర్ లాంటి ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ స్థాపనలో భాగం అయ్యారనీ,1931 కరాచీ డిక్లరేషన్ చేసి హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఓటర్లను తొలగించి ఎన్ని దేశంలో రెండు రకాల పౌరుతరగతి ఏర్పాటు చేయడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌తో కుట్రలు చేస్తోందని ఆవేదన చెందారు. సార్వత్రిక వయోజన ఓటు తొలగిస్తూ ఓటు హక్కు ఉండే వర్గం ఓటు హక్కులేని ప్రజల వర్గం అనే రీతిలో దేశం విభజన చేయడం తగదని దీనిని బుద్దిజీవులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. సర్ పేరుతో 13 కోట్ల ఓట్లు తొలగించారని అందులో ఎక్కువ మంది దళితులు, ఆది వాసీలు, మైనారిటీల ఓట్లు ఎక్కువ ఉన్నాయన్నారు. ఎన్ని ఓట్లు తొలగించారన్నది ఆధారాలతో బయటపెట్టామన్నారు. 2014లో బిజెపి ప్రభుత్వం వచ్చాక పౌరుల హక్కులు కాలరాస్తున్నారనీ అందుకే 2017లో మరోసారి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ను ఏర్పాటు చేశారనీ ఆయన తెలిపారు. మన జీవితాలను మార్చేది ఓటు మాత్రమేననీ ఆ ఓటు కోసం మళ్ళీ పోరాడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమనీ ఆయన చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రొఫెషనల్స్ ను ఏకం చేయాల్సిన పెద్ద బాధ్యత ను రాహుల్ గాంధీ నాకు అప్పగించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఢిల్లీలో నిరసన చేస్తున్న వారిని కిరాతకంగా పోలీసులు కొడుతున్నారు. ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లాంటి వారి పైన అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనీ చెప్పారు. ప్రొఫెషనల్ కాంగ్రెస్ తరుపున మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ ప్రారంభిస్తున్నామనీవివిధ అంశాలపై చర్చించినిర్ణయం తీసుకొంటామని తెలిపారు. మనోహ్మాన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన వారికి ఒక సంవత్సరం 50మందికి ట్రైనింగ్ ఇచ్చారు రెండో దపా 800 అప్లికేషన్స్ వచ్చాయి 100మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జర్నలిస్టులు, లాయర్లు, డాక్టర్లు, టీచర్లు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు ఇలా వివిధ రంగా రంగాల్లోని నిపుణులు ఏఐపీసీ లో జాయిన్ కావాలని సూచించారు. ఎఐపిసిని జిల్లా స్థాయి వరకు విస్తరిస్తామనీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ లో ఇతర పార్టీల మద్దతు దారులకు అవకాశం ఇస్తామనీ తెలంగాణ ను మోడల్ స్టేట్ గా తీసుకుని ప్రొఫెనల్స్ కాంగ్రెస్ ను బలోపేతం చేస్తాంఅన్నారు. స్వాతంత్రం వచ్చిన మొదట్లో జనసంఘ్ నేతకు కాంగ్రెస్ ప్రభుత్వం లో అవకాశం ఇచ్చారు. వచ్చే ఏడాది హైదరాబాద్ లో రెండు రోజుల పాటు ఎఐపిఎస్‌సదస్సు నిర్వహిస్తామనీ తెలిపారు. 22ఎ పై అధికారులు తప్పుదోవ పట్టించారని ఏకంగా మంత్రి చెప్తున్నారనీ,అధికారులు తప్పుదోవ పట్టించడం ఏంటి.? అని యాష్కీ విస్మయం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి బొగ్గు కొరత పై ఉన్నత స్థాయి సమీక్ష చేయాల్సి వచ్చిందనీ .అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో కీలకం గా పనిచేసిన అధికారులు... మంత్రులను తప్పుదోవ పట్టిస్తున్నారనీ వాపోయారు. మా ప్రభుత్వం బాగా పనిచేస్తుంది ,సిఎం వర్క్ బావుంది అని చాలా మంది అంటున్నారనీ స్తోత్కర్షలు చెప్పకొన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసుకోలేకపోతున్నాం,పూర్తి గా అధికారుల మీద ఆధారపడడం వల్ల నష్టం జరుగుతుంది అని అన్నారు. ప్రభుత్వ ఇంటిలిజెన్స్ వ్యవస్థ...ఇంకా బాగా పనిచేయాల్సిన అవసరం ఉంది అని ఆయన అభిప్రాయపడ్డారు. గత యూపీఏ ప్రభుత్వ హాయంలో కాంగ్రెస్ పార్టీతో సంబంధంలేని మేధావులను నిపుణులను అనుసంధానం చేసుకొని.. వారి సూచనలతో సంక్షేమ పథకాలు, విధానాలను రూపొందించినట్లు వివరించారు. కానీ నేటి మోడీ ప్రభుత్వం ఏకచిత్రాధిపత్యంగా వ్యవహరిస్తూ.. ఆదానీ అంబానీ లాంటి ఒకరిద్దరు కార్పొరేట్ సంస్థలకి సంపదను దోచిపెడుతుందని విమర్శించారు.

### యాష్కీ మరింత ఎదుగాలి: పిసిసి చీఫ్

ఎఐసిసి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా మధుయాష్కీ తొలిసారి గాంధీ భవన్‌కు రావడంతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ ఆయనను ఘనంగా సన్మానించారు. రాజకీయంగా మరింత ఎదగాలని పిసిసి చీఫ్ అభిలషించారు.

## వుహాన్ ఓపెన్‌లో ఎలినా ఓటమి



**వుహాన్:** వుహాన్ ఓపెన్ 2026,క్వార్టర్ ఫైనల్స్‌లో పుంజుకున్న బ్రిటన్ క్రీడాకారిణి సోనాయ్ కార్టల్ చేతిలో 6-2, 2-6, 6-4 తేడాతో ఓడిపోయిన ఐదవ సీడ్ ఎలినా స్విటోలినా ఈ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఫైనల్ గేమ్‌లో స్విటోలినా సర్వ్‌ను బ్రేక్ చేసి కార్టల్ విజయాన్ని ఖాయం చేసుకుంది. ఆమె కెరీర్‌లో అత్యున్నత ర్యాంక్ అయిన 44వ స్థానాన్ని గత ఏడాది జూలైలో సాధించగా, అంతకు వారం ముందే జరిగిన చైనా ఓపెన్‌లో, చివరికి ఛాంపియన్‌గా నిలిచిన జెంగ్ క్విన్వెన్ చేతిలో ఓడిపోయి స్విటోలినా క్వార్టర్ ఫైనల్ దశలోనే నిష్క్రమించింది. ఫైనల్ గేమ్‌లో స్విటోలినా సర్వ్‌ను బ్రేక్ చేసి కార్టల్ విజయాన్ని ఖాయం చేసుకుంది. ఆమె కెరీర్‌లో అత్యున్నత ర్యాంక్ అయిన 44వ స్థానాన్ని గత ఏడాది జూలైలో సాధించగా, అంతకు వారం ముందే జరిగిన చైనా ఓపెన్‌లో, చివరికి ఛాంపియన్‌గా నిలిచిన జెంగ్ క్విన్వెన్ చేతిలో ఓడిపోయి స్విటోలినా క్వార్టర్ ఫైనల్ దశలోనే నిష్క్రమించింది. 11వ సీడ్ దయానా ష్నైడర్‌ను 7-6(6), 6-1 తేడాతో ఓడించిన 2017 ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ జెలెనా ఒస్టాపెంకోతో సెమీఫైనల్స్‌లో ఇప్పుడు కార్టల్ తలపడనుంది. ఏడవ సీడ్ క్రీడాకారిణి ఇగా స్వియాటెక్ తన క్వార్టర్ ఫైనల్‌లో అమెరికన్ క్రీడాకారిణి ఆన్ లీతో తలపడాల్సి ఉంది. లీ అంతకుముందు రెండవ రౌండ్‌లో టాప్ సీడ్ అరీనా సబలెంకాను ఓడించి సంచలనం సృష్టించింది. ఆ మ్యాచ్‌లో గెలిచిన వారు సెమీఫైనల్స్‌లో మరియా సక్కారి లేదా మాయా చ్వాలిన్స్కాలలో ఒకరిని ఎదుర్కొంటారు.

### వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

## జగ్షేర్‌కు కాంస్యం



**కైరో:** ఈజిప్టులోని కైరోలో జరుగుతున్న బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ 2026లో బాలుర సింగిల్స్ సెమీఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన రాదిత్య బయు వర్ధన చేతిలో ఓడిపోయిన భారత్ షట్లర్ జగ్షేర్ సింగ్ ఖంగురా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తొలి గేమ్‌ను కోల్పోయిన అతడు పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు తీసుకువచ్చాడు, కానీ వార్ధన యొక్క దూకుడు ఆట నిర్ణయాత్మకంగా మారడంతో, 49 నిమిషాల పాటు జరిగిన పోరులో ఖంగురా 6-15, 15-13, 3-15 తేడాతో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో చైనీస్ తైపీకి చెందిన యువాన్స్యూ జువాంగ్‌పై ఒక గేమ్ వెనుకబడినప్పటికీ పుంజుకుని విజయం సాధించడం ద్వారా, అతను గురువారం ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ పోడియంపై తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. 48 నిమిషాల్లో 6-15, 17-15, 15-12 తేడాతో గెలుపొందిన ఖంగురా, సింగిల్స్ సెమీఫైనల్స్‌కు చేరుకుని, ఈ విభాగంలో పోడియంను దక్కించుకున్న తొమ్మిదవ భారతీయ ఆటగాడిగా నిలిచాడు. 2026 సెప్టెంబర్ 22 నాటికి, ఖంగురా అండర్19 బాలుర సింగిల్స్ విభాగంలో ఎనిమిదో ర్యాంకులో ఉన్నాడు. అతను 2026 జనవరి 11న ప్రారంభమైన వారంలో అండర్17 బాలుర సింగిల్స్‌లో నెం. 1 జాతీయ ర్యాంకును కూడా సాధించాడు.

## వీసీఎల్ సూపర్ 6లో.. హర్యానా, అయోధ్య విజయం

### తమిళ టైటాన్స్, పంజాబ్ ఓటమి



**నోయిడా:** వాలీబాల్ ఛాంపియన్స్ లీగ్ (వీసీఎల్) సూపర్ 6 లో భాగంగా హర్యానా హారికేన్స్ జట్టు పంజాబ్ ఏరోస్ట్రైకర్స్‌పై 2-1 తేడాతో విజయం సాధించి తమ ప్రయాణాన్ని ప్రారంభించగా, మరో మ్యాచ్‌లో అయోధ్య గర్జన్ జట్టు చివరి నిమిషాల్లో పుంజుకుని తమిళ టైటాన్స్‌ను 3-0 తేడాతో ఓడించింది. హర్యానా బలంగా ప్రారంభించి, తొలి సెట్‌ను 21-17 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, పంజాబ్ రెండో సెట్‌లో కూడా అదే స్కోరుతో స్పందించి, మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు దారితీసింది. అయినప్పటికీ, హారికేన్స్ చివరి సెట్‌లో తిరిగి పట్టు సాధించి, తమ ప్రత్యర్థులను 21-10 తేడాతో చిత్తు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. మరో మ్యాచ్‌లో, మూడవ సెట్‌లో నాటకీయ మలుపు చోటుచేసుకున్న పోరులో అయోధ్య గర్జన్ జట్టు తమిళ టైటాన్స్‌పై 21-14, 21-20, 21-19 స్కోరుతో స్ట్రెయిట్‌సెట్ విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు సెట్లు గెలుచుకున్న తర్వాత అయోధ్య పట్టు సాధించినట్లు కనిపించింది, కానీ మూడో సెట్‌లో 18-12 ఆధిక్యం సాధించిన తమిళ టైటాన్స్ మ్యాచ్‌ను పొడిగించేలా కనిపించింది. గర్జన్ అద్భుతంగా పుంజుకుని 18-18తో స్కోరును సమం చేసి, ఆ తర్వాత స్వల్ప ఆధిక్యంలోకి వెళ్ళాడు. తమిళ టైటాన్స్ 19-19తో స్కోరును సమం చేసినప్పటికీ, అయోధ్య తర్వాతి రెండు పాయింట్లు సాధించి క్లీన్ స్వీప్‌ను పూర్తి చేసింది.

# మిక్స్‌డ్ క్రికెట్ టోర్నీ

### ఒకే జట్టులో అబ్బాయిలు, అమ్మాయిలు

## నవంబర్ 14 నుండి 29 వరకు మ్యాచ్‌లు



ఆట

**కొలంబో:** క్రికెట్‌లోనూ మిక్స్‌డ్ జెండర్ మ్యాచ్‌లు రాబోతున్నాయి. పురుష, మహిళా అథ్లెట్లు కలిసి ఒక జట్టుగా బరిలోకి దిగితే మిక్స్‌డ్ టీమ్ అంటారు. టెన్నిస్, బ్యాడ్మింటన్, ఆర్చరీ లాంటి క్రీడల్లో మిక్స్‌డ్ డబుల్స్, మిక్స్‌డ్ టీమ్ మ్యాచ్‌లు జరుగుతుంటాయి. ఇప్పుడు క్రికెట్‌లోనూ ఈ తరహా మ్యాచ్‌లు అభిమానులను అలరించబోతున్నాయి. వినూత్న ఫార్మాట్‌లో జరగనున్న ఈ మిక్స్‌డ్ క్రికెట్ మ్యాచ్‌లకు శ్రీలంక రాజధాని కొలంబో ఆతిథ్యం ఇవ్వబోతుంది. సింహలెస్ స్పోర్ట్స్ క్లబ్ టెస్ట్ ట్వంటీ ఫార్మాట్‌తో ఈ మిక్స్‌డ్ క్రికెట్ మ్యాచ్‌లను ప్రపంచానికి పరిచయం చేబుతోంది. నవంబర్ 14 నుంచి 29 వరకు ఈ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీ కోసం ప్రపంచంలోని నాలుగు ఖండాల నుంచి 13 నుంచి 21 ఏళ్ల వయసు కలిగిన సుమారు 160 మంది పురుష, మహిళా క్రికెటర్లను ఎంపిక చేశారు. ఈ 160 మందిని నాలుగు జట్లుగా విడగొట్టారు. ఒక జట్టులో 20 మంది అబ్బాయిలు, 20 మంది అమ్మాయిలు ఉంటారు. ఒకే రోజులో 80 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఒక్కో టీమ్ 40 ఓవర్ల చొప్పున రెండు సార్లు బ్యాటింగ్ చేస్తోంది. తొలి 2020 మ్యాచ్‌ను రెడ్ బాల్‌తో వైట్ జెర్సీలో పగటి పూట ఆడాల్సి ఉంటుంది. రెండో 2020 మ్యాచ్ వైట్‌బాల్ కలర్ జెర్సీలో ఫ్లడ్ లైట్స్ కింద ఆడాలి. ఈ మ్యాచ్‌కు టాస్ అత్యంత కీలకం కానుంది. టాస్ నెగ్గిన జట్టు బ్యాటింగ్ లేదా బౌలింగ్ ఎంచుకోవడంతో పాటు, తొలుత బాలికలు ఆడుతారా? బాలురు ఆడుతారా? అనేది నిర్ణయించుకోవచ్చు. బాలబాలికలకు సమాన అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ టోర్నీని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. బాల, బాలికల రెండు టీమ్స్ కలిసి ఆడితే విజయం దక్కుతుంది. వీరందరూ చేసిన పరుగులను కలిపి తుది ఫలితాన్ని తేల్చుతారు. ఈ టోర్నీ సలహాదారుల బోర్డులో ఏబీ డివిలియర్స్, మాథ్యూ హేడెన్, సర్ క్లైవ్ లాయిడ్ వంటి దిగ్గజ ఆటగాళ్లు ఉన్నారు. గ్లోబల్ సెలెక్షన్ కమిటీ అధ్యక్షుడిగా విరాట్ కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ, టోర్నీ కార్యకలపాలకు మైక్ ఫోర్డమ్ సారథ్యం వహిస్తారు. ఇది ప్యారిటీ స్పోర్ట్స్ అనే ప్రైవేట్ సంస్థ ప్రవేశపెట్టిన ఒక కొత్త తరహా మిక్స్ జెండర్ ప్రయోగాత్మక ఫార్మాట్. అయితే ఈ టోర్నీకి ఐసీసీ ఆమోదం లేదు.

## ఆసియా పారా గేమ్స్.. సెమీ ఫైనల్స్‌కు మానసి, తులసి జోడీ




**నగోయా:** నగోయాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో మానసి జోషి, తులసిమతి మురుగేశన్ మహిళల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్‌కు అర్హత సాధించి, వరుసగా రెండోసారి భారత్‌కు పతకాన్ని ఖాయం చేశారు. భారత ద్వయం, చైనాకు చెందిన యుమేయ్ లియు-టోంగ్‌టోంగ్ లీలను 21-10, 21-17 తేడాతో ఓడించి, వరుసగా తమ రెండవ విజయాన్ని నమోదు చేసుకుంది. టోక్యో పారాలింపిక్స్ ఛాంపియన్ కృష్ణ నగర్ పురుషుల సింగిల్స్‌లో వరుసగా తన రెండవ విజయాన్ని నమోదు చేసి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. అలాగే గ్రూప్ మ్యాచ్ మిగిలి ఉండగానే నాగర్ ఇండోనేషియాకు చెందిన సుభాన్‌ను 21-13, 21-15 తేడాతో ఓడించి టాప్ టూ స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో నితేష్ థాయ్‌లాండ్‌కు చెందిన నత్తపోల్ చమ్నన్‌వెట్‌ను 2-16, 2-17 తేడాతో, భగత్ చైనాకు చెందిన జియాంగ్ లిచువాన్‌ను 21-17, 21-16 తేడాతో. ఉమేష్ విక్రమ్ కుమార్ కూడా 21-10, 21-12తో ఫిలిప్పీన్స్‌కు చెందిన ఖియాన్ కైల్ అర్బానోపై విజయం సాధించాడు. నవీన్ శివకుమార్ ఇండోనేషియాకు చెందిన హిక్మత్ రామ్దానీని 21-12, 21-10 తేడాతో ఓడించగా, సూర్య కాంత్ యాదవ్ జపాన్‌కు చెందిన కోకి ఒగావాను 2-16, 21-19 తేడాతో, సుకాంత్ కదమ్ దక్షిణ కొరియాకు చెందిన షిన్ క్యుంగ్ హ్వాన్‌ను 21-17, 18-21, 2-19 తేడాతో, అభిజీత్ సఖుజా పుంజుకుని థాయ్‌లాండ్‌కు చెందిన సిరిపాంగ్ టీమత్రోమ్‌ను 19-21, 21-16, 21-10 తేడాతో, రుతిక్ రఘుపతి జపాన్‌కు చెందిన వటారు కనైని 21-12, 21-13 తేడాతో, హార్దిక్ మక్కర్ మలేషియాకు చెందిన అమైరుల్ యాజిద్ బిన్ అహ్మద్ సిబిని 21-16, 16-21, 21-18 తేడాతో ఓడించాడు.

# రూ.220 పెరిగిన 10 గ్రాముల పసిడి

### కిలో వెండి రూ.2.30 లక్షల నుంచి రూ.2.40 లక్షలు



**ముంబయి, అక్టోబరు 17:** దేశంలో బంగారం ధరలు శనివారం 24 క్యారట్ల గ్రాము ధర రూ.22 పెరిగి రూ.14,766 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.20 పెరిగి రూ.13,535 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.16 పెరిగి రూ.11,074 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో బంగారం ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.220 పెరిగి రూ.1,47,660 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.200 పెరిగి రూ.1,35,350 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.160 పెరిగి రూ.1,10,740గా నమోదైంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,47,660 దగ్గర ట్రేడ్ కాగా 22 క్యారట్ల బంగారం ధర రూ.1,35,350 పలికింది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,11,250గా నమోదైంది. ముంబై నగరంలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.220 పెరిగి రూ.1,47,660 దగ్గర ట్రేడ్ కాగా 22 క్యారట్ల బంగారం ధర రూ.200 పెరిగి రూ.1,35,350 పలికింది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.160 పెరిగి రూ.1,10,740 గా నమోదైంది. ఇక ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,47,810 దగ్గర ట్రేడ్ అవగా 22 క్యారట్ల బంగారం ధర రూ.1,35,500 పలికింది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,10,890 గా నమోదైంది. బెంగళూరు నగరంలో బంగారం ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.220 పెరిగి రూ.1,47,660 దగ్గర ట్రేడ్‌కాగా 22 క్యారట్ల బంగారం ధర రూ.200 పెరిగి రూ.1,35,350 పలికింది. 18 క్యారట్ల బంగారం ధర రూ.160 పెరిగి రూ.1,10,740గా నమోదైంది. కలకత్తా నగరంలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.220 పెరిగి రూ.1,47,660 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.200పెరిగి రూ.1,35,350 పలికితే 18 క్యారట్లబంగారం ధర రూ.160 పెరిగి రూ.1,10,740గా నమోదైంది. ఇక వెండి ధరల పరంగాచూస్తే చెన్నై, హైదరాబాద్ నగరాల్లో కిలో వెండి రూ.2.40లక్షలు కాగా ముంబయి, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరు నగరాల్లో కిలో వెండి రూ.2.30 లక్షలుగా కొనసాగింది.

## క్షీణించిన విదేశీ కరెన్సీ ఖజానా




**ముంబయి, అక్టోబరు 17:** భారత విదేశీ కరెన్సీ నిల్వలు 726 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఈనెల 9వతేదీతో ముగిసిన వారానికిగాను ఆర్బీఐ ఫారెక్స్ వివరాలను ప్రకటించింది. డాలర్ దూకుడును కట్టడికి ఆర్బీఐ ప్రత్యేక చర్యలుప్రారంభించడంతో ఈవారం కొంతమేర రూపాయిని నియంత్రించగలిగింది. అదే దూకుడు కొనసాగితే దిగుమతులకు చెల్లించేందుకు డాలర్ కరెన్సీ అత్యవసరం కావడంతో ఫారెక్స్ నిల్వలు మరింత నిండుకునే ముప్పును ఆర్బీఐ తప్పించగలిగింది. గత వారంలో 8.6 బిలియన్ డాలర్ల ఫారెక్స్ నిల్వలు క్షీణించాయి. ఐదువారాల్లోనే 59.7 బిలియన్ డాలర్లు క్షీణించాయి. గత సెప్టెంబరు నాల్గవ తేదీతో ముగిసిన వారంలో మాత్రమే ఫారెక్స్ నిల్వలు 785.71 బిలియన్ డాలర్లకు చేరాయి. కాగా వారాంతంలో రూపాయి కొంతమేర బలపడింది. 95.06 నుంచి చివరకు 94.96 రూపాయలవద్ద స్థిరపడింది. వారంలో 1.9శాతం లాభపడిందన్నది నిపుణుల అంచనా. ఈ నెల మొదటివారం లోనే డాలరుతో రూపాయి మారకం విలువలు 96.96గా కొనసాగింది. ఇక విదేశ ఈకరెన్సీ ఆస్తులపరంగా చూస్తే అవికూడా 7.14 బిలియన్ డాలర్లు క్షీణించి 597.61 బిలియన్ డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు కూడా 1.32 బిలియన్ డాలర్లు క్షీణించి 105.09 బిలియన్ డాలర్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్‌రైట్స్ కూడా 109 మిలియన్ డాలర్లు క్షీణించి 18.55 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి కూడా 10 మిలియన్ డాలర్ల క్షీణించి 4.78 బిలియన్ డాలర్లుగా ఉంది.

# చక్కెరతో ఇథనాల్ తయారీపై భారత్ నిషేధం




### దేశీయ చక్కెర సరఫరా పెంపుపై కేంద్రం ఫోకస్

**న్యూఢిల్లీ:** దేశీయంగా చక్కెర లభ్యతను పెంచడం, రిటైల్ మార్కెట్‌లో రికార్డు స్థాయికి చేరిన చక్కెర ధరలను నియంత్రించడం లక్ష్యంగా 2026-27 సరఫరా సంవత్సరంలో చక్కెరను ఉపయోగించి ఇథనాల్ తయారు చేయడాన్ని భారత్ నిషేధించింది. 2026 నవంబర్‌లో ప్రారంభమయ్యే సరఫరా సంవత్సరానికి చక్కెర ఆధారిత ఇథనాల్ కొనుగోళ్లను నిలిపివేయాలని చమురు మార్కెటింగ్ సంస్థలకు ప్రభుత్వం సూచించింది. దీంతో చెరకు రసం, చక్కెర సిరప్, బీహెవీ మొలాసిస్ నుంచి తయారయ్యే ఇథనాల్ తాజా టెండర్ ప్రక్రియలో చోటు దక్కించుకోలేదు. సాధారణంగా దేశంలో మిగులు చక్కెర ఉత్పత్తిని ఇథనాల్ తయారీకి ముడి సరుకుగా వినియోగిస్తారు. దేశీయ అవసరాలకు తగినంత చక్కెర నిల్వలు ఉండేలా చూడటంతో పాటు, ఇంధన రంగంలో స్వచ్ఛమైన ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ప్రభుత్వ రంగానికి చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంస్థలు 2026 సరఫరా సంవత్సరానికి మొత్తం 1,100 కోట్ల లీటర్ల ఇథనాల్ సరఫరా కోసం టెండర్లు ఆహ్వానించాయి. ఈ టెండర్లలో భాగంగా మొక్కజొన్న, విరిగిన బియ్యం, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి సేకరించిన మిగులు బియ్యంతో తయారు చేసిన ఇథనాల్‌ను సరఫరా చేసేందుకు తయారీదారులకు అవకాశం కల్పించారు. చెరకు ఆధారిత ఇథనాల్‌ను పరిమితం చేయడం ద్వారా ఎక్కువ మొత్తంలో చెరకును చక్కెర ఉత్పత్తికి వినియోగించుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

**మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాభావ ఆందోళనలు**

ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర వినియోగదారుగా ఉన్న భారత్ దేశీయ ఉత్పత్తిని పెంచడంతో పాటు ధరలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడాన్ని తగ్గించడం, వాహనాల కాలుష్యాన్ని నియంత్రించడం లక్ష్యంగా భారత్ ఇథనాల్ మిశ్రమ ఇంధన కార్యక్రమాన్ని విస్తరిస్తోంది. ఈ యేడాది ప్రారంభంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపే ఇ20 విధానాన్ని దేశవ్యాప్తంగా తప్పనిసరి ప్రమాణంగా అమలు చేసింది. పాత వాహనాల్లో ఇ-ఇంధన మిశ్రమం అనుకూలతపై కొందరు వాహనదారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తాజా టెండర్‌లో మొక్కజొన్న ఆధారిత ఇథనాల్‌కు చెల్లించే ప్రోత్సాహక ధరను కూడా ప్రభుత్వం తగ్గించింది. టెండర్ ప్రకారం, మొక్కజొన్నతో తయారు చేసిన ఇథనాల్‌కు లీటరుకు ఇస్తున్న ప్రోత్సాహకాన్ని రూ.5.79 నుంచి రూ.2.79కు తగ్గించారు. దీంతో కొనుగోలు ధర లీటరుకు రూ.71.86 నుంచి రూ.68.86కు చేరింది.

దేశీయంగా చక్కెర ధరలు అధికంగా ఉన్న సమయంలో సరఫరాను స్థిరంగా ఉంచడం, ఇథనాల్ తయారీకి ప్రత్యామ్నాయ ముడిసరుకులను ప్రోత్సహించడం తాజా నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. చక్కెర ఉత్పత్తికి తగినంత చెరకు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు, ఇథనాల్ మిశ్రమ ఇంధన కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం ఈ విధాన మార్పులు చేపట్టింది.

## 4.7% పెరిగిన హెచ్‌డిఎఫ్‌సి నికరలాభం




**ముంబయి, అక్టోబరు 17:** ప్రైవేటురంగంలోని రెండో పెద్ద బ్యాంకుగా కొనసాగుతున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సెప్టెంబరు త్రైమాసికంలో నికరలాభాలు రూ.19,510 కోట్లుగా ప్రకటించింది. మార్కెట్ అంచనాలు రూ.19,727 కోట్లుకాగా అంచనాలకు సమీపంలోనే ముగిసింది. స్థూల నిరర్ధక ఆస్తులు 1.11శాతంగా ఉన్నాయి. నికర నిరర్ధక ఆస్తులు కూడా 0.37శాతం అని వెల్లడించింది. నిర్వహణ లాభం రూ.29,483 కోట్లుగా ఉంది. నికరవడ్డీ ఆదాయం కూడా 34,619 కోట్లుగా ఉంది. నికరవడ్డీ మార్జిన్ 3.16శాతం అని బ్యాంకు ప్రకటించింది. నికరలాభం 18,641 కోట్లనుంచి 4.7శాతంపెరిగి రూ.19,510 కోట్లుగా ఉంది. త్రైమాసికం వారీగాచూస్తే రూ.3059 కోట్లనుంచి రూ.3574 కోట్లుగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలోచూస్తే రూ.3500 కోట్లనుంచి రూ.3574 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. నిర్వహణ లాభం కూడా వార్షిక పద్ధతిలో రూ.27,923 కోట్ల నుంచి 5.6శాతంపెరిగి 29,483 కోట్లకు పెరిగింది. నికరవడ్డీ ఆదాయం కూడా 10 శాతం పెరిగి రూ.34,619 కోట్లుగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది. స్థూల నిరర్ధక ఆస్తులు 1.17శాతంనుంచి 1.11శాతానికి తగ్గాయి. నికర నిరర్ధకఆస్తులు 0.41శాతంనుంచి 0.37శాతానికి చేరాయి. మొత్తం 9706 శాఖలు, 20,881 ఎటిఎంలు ఉన్నట్లు ప్రకటించిన బ్యాంకు అదనంగా 14,365 మంది బిజినెస్ కరస్పాండెంట్లను నియమించామని వెల్లడించింది. బ్యాంకు ఉద్యోగులు ఈత్రైమాసికం ముగిసేనాటికి 2,10,109 మంది ఉన్నారు.

## ఐసిఐసిఐ బ్యాంకు నికరలాభం రూ.14,843 కోట్లు




**ముంబయి, అక్టోబరు 17:** ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంకు నికరలాభం 20.1శాతం పెరిగి 14,843 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో నమోదుచేసిన 12,359 కోట్లకంటే 20శాతానికిపైగా పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 4.36శాతంనుంచి 4.18శాతంగా నమోదయింది. స్థూల నిరర్థక ఆస్తులు 1.38శాతం నుంచి తగ్గి 1.20 శాతానికిచేరాయి. నికర నిరర్థక ఆస్తులుసైతం 0.35శాతం నుంచి 0.30 శాతంగా నమోదయ్యాయి. నికరవడ్డీ ఆదాయం కూడా 18శాతం పెరిగింది. 21,529 కోట్ల రూపాయల నుంచి రూ.25,339 కోట్లకుచేరింది. బ్యాంకు రానిబాకీలకు కేటాయింపులుకూడా 914 కోట్లనుంచి రూ.851కోట్లకు తగ్గించింది. కేటాయింపులు త్రైమాసికంవారీగా చూస్తే గత త్రైమాసికంలో రూ.1260 కోట్లనుంచి ఈ సెప్టెంబరు త్రైమాసికానికి 851కోట్లకు తగ్గించుకోగలిగింది. నిర్వహణ లాభంకూడా 17,298 కోట్లనుంచి 18.9శాతం పెరిగి రూ.20,575కోట్లకు చేరింది. నికరలాభం సైతం రూ.14,843 కోట్లకు రాబట్టగలిగింది. చైర్‌పర్సన్‌గా ప్రదీప్ కుమార్ సిన్హా కొనసాగింపుకోసం ఆర్బీఐ ఆమోదం తెలిపినట్లు బ్యాంకు ప్రకటించింది. 2027 జులై ఒకటినుంచి 2029 ఫిబ్రవరి 16వరకూ ఆయనే కొనసాగుతారని బ్యాంకు ఎక్స్చేంజిలకు నివేదిక ఇచ్చింది. ఇప్పటికే బ్యాంకు బోర్డు వాటాదారులు ప్రదీప్‌కుమార్‌ను స్వతంత్ర డైరెక్టర్‌గా ఆమోదించారు. కొనసాగింపులో ఈ పదవీకాలం కూడా లెక్కకు వస్తుంది.

## యాక్సిస్ నికరలాభం రూ.7003 కోట్లు




**ముంబయి, అక్టోబరు 17:** ప్రైవేటురంగంలోని యాక్సిస్ బ్యాంకునికరలాభం రూ.5090 కోట్లనుంచి ఈ యేడాది సెప్టెంబరుత్రైమాసికంలో 37.6శాతం పెరిగి రూ.7003 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.28 శాతంనుంచి 1.16శాతానికి తగ్గాయి. అలాగే నికర నిరర్థక ఆస్తులుసైతం 0.39శాతంనుంచి 0.35శాతానికి దిగి నట్లు బ్యాంకు ప్రకటించింది. నికరవడ్డీ ఆదాయంకూడా 12శాతం పెరిగి13,745కోట్లనుంచి రూ.15,371 కోట్లకు చేరాయి. కేటాయింపులు కూడా 3547 కోట్లనుంచి రూ.1694 కోట్లకు తగ్గించుకోగలిగింది. త్రైమాసికం వారీగాకూడా తక్షణ కేటాయింపులు రూ.2223 కోట్ల నుంచి రూ.1694 కోట్లకు చేరాయి. మాస్టర్‌కార్డ్, వీసా నెట్ వర్కుల్లో క్రెడిట్‌కార్డు కస్టమర్లకు యాపిల్‌పే కూడా ఆఫర్‌చేస్తోంది. అలాగే తమ బ్యాంకు ఎక్స్‌ప్రెస్ బ్యాంకింగ్‌నుకూడా ప్రారంభించింది. డిజిటల్ బ్యాంకింగ్ పాయింట్ 2.0, ఎఐ సాండ్‌బాక్స్‌లు కూడా ప్రారంభించింది. హిటాచి పేమెంట్‌సర్వీసెస్‌తో భాగస్వామ్యం ఏర్పాటుచేసుకుంది. కాసా నిష్పత్తికూడా 36.5శాతంగా ఉంది. గత యేడాది ఇదేకాలంలో 39.8శాతంగా నిలిచింది. ఇక బ్యాంకు నికర వడ్డీమార్జిన్ 3.36శాతంగా ఉంది. మార్కెట్ అంచనాలు 3.4శాతం కంటే దిగువనేఉన్నాయి. బ్యాంకు ఎండిసిఇఒ అమితాబ్‌చౌదరి మాట్లాడుతూ కస్టమర్ల అంచనాలకుఅనుగుణంగా సేవలు పెంచుతున్నామని, డిజిటల్ నెట్‌వర్క్ మరింత వృద్ధిలోకి వస్తోందన్నారు. హిటాచిపేమెంట్ సర్వీసెస్‌తో భాగస్వామ్యం ఉందని వెల్లడించారు.

# పూలను దేవతగా పూజించే బతుకమ్మ పండుగ

ప్రపంచ వ్యాప్తంగా ఒక్కో ప్రదేశంలో ఒక్కో విశిష్టత సంతరించుకొని ఉంటుంది. ముఖ్యంగా సంస్కృతి, సంప్రదాయాలలో భారతదేశం పేరెన్నికగలది. విభిన్న మతాలు ఉన్నప్పటికీ మేటికవే తమ సంస్కృతిని, సంప్రదాయాలలో భారతదేశం పేరెన్నికగలది. విభిన్న మతాలు ఉన్నప్పటికీ వెటికవే తమసంస్కతిని, సంప్రదాయాల్ని కాపాడుకుంటూ వస్తున్నవి. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రంలో అన్ని రకాల తెలుగువారి పండుగలలో ఘనంగా ప్రకృతి సహవాసంతో జరుపుకునే పండుగగా బతుకమ్మ పండుగ పేరెన్నికగన్నది.

తెలంగాణ ప్రాంతంలో చెప్పుకోదగ్గ ఆటపాటల పండుగ బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా వెలుగొందే బతుకమ్మ పండుగ వేడుకలు ఆశ్వయుజ మహాలయ అమావాస్యంతో 'ఎంగిలి పూల రకరకాల పూలతో గుమ్మడి పువ్వులు, తంగేడు, బీర, గన్నేరు, గునుగు, బంతి వంటి పువ్వులతో బతుకమ్మను పేర్చి పైన పసుపు ముద్దతో గౌరమ్మను ఉంచి కుంకుమ పెట్టి పూజిస్తారు. పెళ్ళికాని అమ్మాయిలు అయితే మంచి భర్త రావాలని, పెళ్ళైన స్త్రీలు నిండు నూరేళ్ల తన భర్త ఆయురారోగ్యాలతో బాగుండాలని బతుకమ్మని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత తొమ్మిది రోజులపాటు బతుకమ్మను రకరకాల పేర్లతో పూజించడం విశేషం. మొదటిరోజు ఎంగిలిపువ్వుల బతుకమ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ. మూడువరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగోరోజు నానబియ్య బతుకమ్మ, ఏదోరోజు అట్ల బతుకమ్మ ఆరోరోజు అలిగిన బతుకమ్మ ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదోరోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మ ఇలా తొమ్మిది రోజుల పాటు రకరకాల పూలతో, ప్రసాదాలతో పూలపండుగ చేసుకోవడం. తెలంగాణలోని సంస్కృతిలో ఒక ప్రత్యేకత అనే చెప్పవచ్చును. పూజాది కార్యక్రమాలు అయ్యాక బతుకమ్మలను చెరువులు, నదులలో నిమజ్జనం చేస్తారు. ప్రకృతికి, మనిషికి మధ్య అవినాభావ సంబంధం ఉంది అనడానికి బతుకమ్మ పూలపండుగే సాక్ష్యం. బతుకమ్మల పండుగకోసం సేకరించే పూలతో చేసిన బతుకమ్మను చెరువులు, నదులలో నిమజ్జనం చేయడం వలన కొత్తనీరు శుద్ధతను సంతరించుకొంటుంది. రోగకారక క్రిములు వంటివి కూడా నశిస్తాయి. అంతేకాకుండా ఈ తొమ్మిది రోజులపండుగ సందర్భంగా తయారుచేసే ప్రసాదాలు అన్నీ కూడా శారీరక ఆరోగ్యానిచ్చే వరప్రదాయినిగానే చెప్పవచ్చును. బతుకమ్మ పండుగ పూలపండుగగా ప్రకృతితో మమేకమైన పండుగగా ప్రత్యేకత ఉన్నప్పటికీ పాటల పండుగ అని కూడా ప్రత్యేకంగా చెప్పవచ్చు. బతుకమ్మ పండుగకు స్త్రీలు అనేక రకాల పాటలు పాడుతారు. ఒక స్త్రీ పాట పాడగా మిగతా వాళ్ళంతా ఆ పాటకి

సద్దుల బతుకమ్మరోజు ఐదు రకాల సద్దులను నైవేద్యంగా పెడతారు. అందుకే ఇది 'సద్దుల బతుకమ్మ' దద్దోజనం, చింతపండుపులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరన్నం నువ్వులన్నం, పల్లీ, నువ్వులు,కొబ్బరి పుట్లాలను పొడిచేసి అన్నంతో కలుపుతారు. బియ్యపిండితోగాని సజ్జపిండివతోగాని రొట్టెలుకాలుస్తారు. వేడివేడి రొట్టెలకుపంచదార లేదా బెల్లం కలిపి దంచుతారు. ఈ పొడిని ముద్దలు చేస్తారు. వీటిని మలిజముద్దలు అంటారు. మలిజముద్దలు, పొడుల సద్ది, పెరుగుసద్ది పులిహోరతో కలిపి మొత్తం ఐదు నుంచి తొమ్మిది రకాల సద్దులను నైవేద్యంగా ఇస్తారు.



వంతపాడుతారు. ఉయ్యాల, కోలో, వలలో, కోయిలా, తమ్మెద, రామచిలుకా ఓ రాచగుమ్మడి, చెలియా మొదలైన వంత పదాలు పాడి, ఆ పాటను రక్తి కట్టిస్తారు. చప్పట్ల లేదా కోలోటంతో స్త్రీలు సామూహిక స్వరాలతో



వినసొంపుగా ఉంటుంది. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ-ఏమేమి కాయొప్పనే గౌరమ్మ గుమ్మడి పువ్వొప్పునే గౌరమ్మ-గుమ్మడి కాయొప్పనే గౌరమ్మ గుమ్మాడి చెట్టుకింద గౌరమ్మా – ఆట సిలకాలార గౌరమ్మ అంటూ.. పూల ప్రాధాన్యతను తెలిపే బతుకమ్మపాటు శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో-చేయబూనితినమ్మా ఉయ్యాలో కాపాడు ముమ్ములా ఉయ్యాలో-కైలాసరాణివి ఉయ్యాలో శ్రీలలితవు నీవు ఉయ్యాలో-సరిలనిచ్చే తల్లినీ ఉయ్యాలో చదువుల నిత్తుమా ఉయ్యాలో – శ్రీ సరస్వతివి నీవు ఉయ్యాలో అంటూ బతుకమ్మను పార్వతీదేవిగా భావిస్తూ స్త్రీలు పాడే పాటలు బతుకమ్మ పండుగ విశిష్టతను ఇనుమడించేలా పాడడం విశేషం. ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములయె సందమామ రెండేసి పువ్వేసి సందమామ రెండు జాములయె సందమామ

మూడేసి పువ్వేసి సందమామ

మూడు జాములయె సందమామా

అంటూ బతుకమ్మల చుట్టు తిరుగుతూ పాడడం వలన పండగ వైశిష్ట్యాన్ని మరింతగా ఇనుమడింపచేస్తుంది.

రామా రామా రామా ఉయ్యాలో

శ్రీరామరామ ఉయ్యాలో

శ్రీలక్ష్మిదేవియు ఉయ్యాలో

సృష్టిబతుకమ్మయె ఉయ్యాలో

భరతుని దేశమున ఉయ్యాలో

ధర్మాంగుడనురాజు ఉయ్యాలో

ఆరాజు భార్యయూ ఉయ్యాలో,

అతివ సత్యవతి ఉయ్యాలో

నూరు నోములనోచి ఉయ్యాలో

నూరుమందిని కనియె ఉయ్యాలో

అంటూ ప్రకృతిలోని పూలతో గౌరిదేవిని నిత్యం పూజించడం వలన మానవాళి బంగారు భవిష్యత్తును ఎటువంటి ఆపద రాకుండా నిండునూరేళ్ళు పచ్చని పంటలతో, ప్రకృతితో, బతుకు పండుగలా. సాగాలని గౌరీమాతను పూజిస్తూ పాటలు పాడుతారు. అంతేకాకుండా తెలంగాణలోని బతుకమ్మ పండుగ విశిష్టతను తెలిపే మరొక బతుకమ్మ పాటను పరికించి చూస్తే.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో తంగేడు గునుగులో ఉయ్యాలో తరలివచ్చేను ఉయ్యాలో గౌరమ్మ రూపానివే ఉయ్యాలో బంగారు తేజానివే ఉయ్యాలో బీర ఆకులతోటి ఉయ్యాలో పూలపందిరివోలె ఉయ్యాలో ఎత్తయిన బతుకమ్మ ఉయ్యాలో అంటూ సాగే ఈ పాట బతుకమ్మ పండుగను, ప్రాధాన్యతను ఇనుమడించేలా చేసింది. తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మను ప్రత్యేకంగా చేస్తారు. బతుకమ్మలు భారీఎత్తున పేర్చి చెరువుగట్టున కుటుంబాలతో సహా చేరుకుని గౌరిదేవికి, బతుకమ్మలకు పూజలు చేసి నైవేద్యాలను సమర్పించి ఆడిపాడి నిమజ్జనం చేస్తారు. బతుమ్మకల నిమజ్జనం అనంతరం 'పోయిరావమ్మ బతుకమ్మ, వచ్చే ఏడాది మరల రావమ్మా' అంటూ పాడుతూ ఇళ్లకు చేరతారు. ఎంతోగొప్ప చరిత్రను, ఘనత ను కలిగిన భారతదేశం తరతరాలకు ఆస్తులను వారసత్వంగా ఇవ్వకుండా సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వ సంపదగా ఇవ్వడం గొప్ప విషయం. తీరాలు మారినా సంస్కృతి, ఆచారాలు వన్నె తగ్గవన్నది సత్యం. ఆధునిక యుగంలో కూడా బతుకమ్మ పండుగను పల్లెపల్లెలోనే కాకుండా పట్టణాల్లో కూడా వీధివీధుల్లో పెద్దఎత్తున జరుపుకోవడం విశేషం. అంతేకాకుండా ప్రవాస భారతీయులు కూడా మాతృదేశాన్ని వదిలి వృత్తిరీత్యా వెళ్ళినా అక్కడ కూడా బతుకమ్మ పండుగ సంబురాలు చేసుకోవడం ఎంతో గొప్పవిషయం.

**- కె. లక్ష్మీ**

## విజయవాడ కనక దుర్గ నేటి అలంకరణ

## శ్రీ దుర్గాదేవిగా దుర్గమ్మ



అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ !
చాలా పెద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చినయమ్మ !!
తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ !
దుర్గ మాయమ్మ కృపాబ్ధి నిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్ !!

దుర్గమ్మ ఈ అవతారములోనే దుర్గముడనే రాక్షసుడ్ని సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచప్రకృతి మహాస్వరూపాల్లో దుర్గ రూపం మొదటిది. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని ఈ మాత అనుగ్రహించి దుర్గతులను దూరం చేసి మోక్షాని న్ప్రసాదిస్తుంది. కోటి సూర్య ప్రభలతో వెలుగొందే అమ్మను అర్చిస్తే అర్చిస్తే శత్రుబాధలు నశిస్తాయి. విజయం కలుగుతుంది. వేదవిధులు కీర్తించే దుర్గమ్మ నామ స్మరణతోనే సకల గ్రహ బాధలు తొలగి పోతాయి. ఆరాధకులకు శీఘ్ర అనుగ్రహకారిణి దుర్గాదేవి.

**అలంకారం :** అమ్మవారిని ఎరుపు వర్ణంతో కూడిన పట్టుచీరతో అలంకరిస్తారు.

**వస్త్రం :** ఎరుపు వస్త్రం, ఎరుపు అక్షతలు,

**పుష్పాలు :** ఎర్రని పుష్పాలు

నివేదన : అమ్మవారికి పులగాన్నం నివేదన చేయాలి.

మంత్రం : "ఓం దుం దుర్గాయైనమః" అనే మంత్రాన్ని 108 సార్లు పఠించాలి. దుర్గా, లలిత అష్టోత్తరాలు, దుర్గాసూక్తం పారాయణం చేస్తూ అమ్మవారిని పూజించాలి.

**- భట్టిప్రోలు నటరాజకుమార్**

## మెరిసే సీతమ్మ పువ్వులు

పూలు మన సంస్కృతిలో ఓ భాగం. అవి లేనిదే ఏ పూజ, పండగా పూరన్తి కాదు. అందులోనూ బతుకమ్మ అంటేనే పూల సంబరం. దీన్ని పేరేనచందుకు వాడే పూలలో సీతమ్మ జడ గంటలు ముందు వరుసలో ఉంటాయి. వీటికే కోడిజుట్టు పువ్వులు, సీతమ్మ జడ బంతులు, ముఖమల్ పువ్వులు, మహారాణీ పువ్వులు..అనే చాల పేర్లు ఉన్నాయి. ఆంగ్లంలో సెలోసియా అని పిలిచే ఈ మొక్క ప్రతి కొమ్మకూ సన్నాయి ఆకృతిలో పూలు వికసిస్తాయి. వర్షాకాలంలో మొదలైన ఈ పూల సందడి..చలికాలం దాటేవరకూ ఉంటుంది. ఇక, సూర్య కాంతి వీటిపై ప్రసరించినప్పుడు ఈ పూలు మెరిసిపోతూ



ఆకట్టుకకుంటాయి. వీటిల్లో ఎక్కువగా రాణీరంగు పుష్పాలే ఎక్కువగా కనిపించినా ఎరుపు, పసుపు, ఉదా.. వంటి మరెన్నో వర్ణాల్లోనూ దొరుకుతున్నాయి. సెలోసియా మొక్కను పాశ్చాత్య దేశాల్లో ఎండబెట్టి పూల అలంకరణల్లో వాడతారు. సంప్రదాయ ఆయుర్వే వైద్యంలో రక్తసావ సమస్య లకు, గ్యాస్ సంబంధిత ఇన్ఫెక్షన్ల నివారణకు, అతిసారం, తలనొప్పి చికిత్సల్లోనూ వాడతారు.

## వెండి, బంగారు బతుకమ్మ



తెలంగాణ ఆడబిడ్డల ఆనందంగా జరుపుకొనే పూల పండగ బతుకమ్మ. పూలన్నీ వరుసలో పేర్చి పైన గౌరమ్మను ప్రతిష్ఠించి ఆరాధిస్తారు. మారిన పరిస్థితుల వల్ల అన్ని సార్లూ, అన్ని రకాల పూలూ అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా దూరంగా నగరాల్లో, విదేశాల్లో బతుకమ్మ చేసుకునే వారికి పూలు దొరక్కపోవచ్చు. ఇలాంటివారికోసమే వెండి, బంగారు బతుకమ్మలు, తాజాగా దొరికిన పూలనే అందంగా అమర్చుకునే వీలుతో డిజైన్ చేసిన వెండి బతుకమ్మలు, తాజాగా దొరికిన పూలనే అందంగా అమర్చు కునే వీలుతో మరికొన్ని రకాలూ వచ్చేశాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే కొత్తకోడళ్లకు ఇచ్చే బతుకమ్మ వాయనంలో కాగితపు బతుకమ్మలకు బదులుగా ఈ వెండి బతుకమ్మల్ని చేరుస్తున్నారు. వీటికే పసిడి, ఎండి లోహాలతో చేసిన పువ్వులూ, రాళ్లూ, నవరతానలు. వంటి హంగులను చేర్చికళ్ల తిప్పుకొనివ్వకుండా చేస్తున్నారు.



# తెర

## గర్వపడే సినిమా 'రణబాలి': విజయ్ దేవరకొండ



'రణబాలి' గర్వపడే సినిమాగా మిగిలిపోతుంది ప్రెస్ మీట్ లో హీరో విజయ్ దేవరకొండ అన్నారు. కో ప్రొడ్యూసర్ అనురాగ్ పర్వతనేని మాట్లాడుతూ నేను ఈ సినిమాకు కో ప్రొడ్యూసర్‌గా కంటే రశ్మిక, విజయ్‌కు అభిమానిని. ఈ సినిమా చూస్తున్న ప్పుడు ఒక ఫ్యాన్‌గా గర్వపడ్డాను. విజయ్, రశ్మిక అభిమానులు అందరికీ అదే ఫీల్ కలిగి ఉంటుంది. మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ మాట్లాడుతూ మా సినిమాకు మార్నింగ్ టు మ్యాట్నీ ఇప్పుడు ఫస్ట్ షో..ప్రతి షో కు ప్రేక్షకుల ఆదరణ పెరుగుతోంది. జిల్లాల నుంచి కూడా మంచి ఫీడ్ బ్యాక్ ఉంది. ఫ్యామిలీ ఆడియెన్స్ మా సినిమాకు బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రొడ్యూసర్ రవిశంకర్ మాట్లాడుతూ మేము ఈవెంట్స్‌లో చెప్పినట్లు రశ్మిక, విజయ్ గారి ఎపిసోడ్స్ అన్నింటికీ సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. వారి సీన్స్ రియలెస్టిక్ ఫీల్‌తో ఆథెంటిక్ గా ఉన్నాయని ప్రశంసలు వస్తున్నాయి. ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని మాట్లాడుతూ యూఎస్ నుంచి మంచి టాక్ విన్నాం. అలాగే ఏపీ, తెలంగాణలోని అన్ని ఏరియాల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. నేను థియేటర్స్ కు వెళ్లి అక్కడ ఆడియెన్స్ నుంచి వస్తున్న స్పందన చూసి హ్యాపీగా ఫీలయ్యాను. డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ మాట్లాడుతూ మేము సినిమా తీసిన ఉద్దేశాన్ని అర్థం చేసుకుని ఆదరిస్తున్న రెండుతెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు థ్యాంక్స్.మార్నింగ్ సోషల్ మీడియాలో ఏవేవో వచ్చాయి గానీ తెలుగు మీడియా సినిమా చూసినప్పటి నుంచి మంచి పాజిటివ్ టాక్ వింటూ వచ్చాం. ఫస్టాఫ్ నుంచే రణబాలి బ్లాక్ బస్టర్ అనే రివ్యూ మీ దగ్గర నుంచి రావడం సంతోషంగా ఉంది.

## 'జైలర్ 2' ప్రభంజనంపై సంతోషం: సూర్యదేవర నాగవంశీ



'జైలర్ 2' ప్రభంజనంపై సంతోషం: సూర్యదేవర నాగవంశీ సూపర్ స్టార్ రజనీకాంత్, నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో రూపొందిన 'జైలర్ 2' చిత్రం 2023లో విడుదలై ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా 'జైలర్ 2' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాత సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ సొంతం చేసుకున్నారు. 'జైలర్ 2'సూర్యదేవర నాగవంశీ మాట్లా డుతూ.. "మేము నిర్మించిన సినిమా అయినా, పంపిణీ చేసిన సినిమా అయినా డిస్ట్రిబ్యూటర్లకు కమిషన్ వస్తే చాలా సంతోషంగా ఉంటుంది. ఎందుకంటే ఈ మధ్య కాలంలో డిస్ట్రిబ్యూటర్లకు కమిషన్ రావడం అనేది అరుదైపోయింది. 'జైలర్ 2'విషయంలో మొదట అందరూ భారీ రేటు పెట్టి తీసుకున్నామని భయపడ్డారు. కానీ, అక్టోబర్ 15 సాయంత్రం షోల వసూళ్లు చూసిన తర్వాత ఖచ్చితంగా కమిషన్ వస్తుందని డిస్ట్రిబ్యూటర్లు చెప్పారు. రజనీకాంత్ గారిని, నెల్సన్ గారిని, అనిరుధ్ గారిని నమ్మి రిస్క్ చేశాము. దానికి ప్రతిఫలం దక్కుతుండటం చాలా చాలా సంతోషంగా ఉంది. 'జైలర్ 2' విషయంలో మీడియా ఇచ్చిన మద్దతుని మరచిపోలేము. మైత్రి శశి మాట్లాడుతూ.. "జైలర్ 2 భారీ వసూళ్ల సాధిస్తుందని ఆశిస్తున్నాము.

## 'ఇట్లు అర్జున' హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్: నాగార్జున



ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. కొత్త టాలెంట్ అంటే నాకు చాలా ఇష్టం. అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా వై.వి.ఎస్. చౌదరితో ఒక సినిమా నిర్మించాను. దాంతో కొత్తవాళ్లతో సినిమాలు తీసే జర్నీ మొదలైంది. రాజ్ తరుణ్ 'ఉయ్యాల జంపాల' సినిమా సమయంలో అప్పటికి టీజర్లు, ట్రైలర్లు ఏమీ లేవు. సినిమా చూడమన్నారు. చూశాను. నాకు చాలా నచ్చింది. దాంతో ఆ సినిమాలో నేను భాగస్వామి అయ్యాను. ఆ సినిమా చాలా మంచి విజయం సాధించింది. 'ఇట్లు అర్జున' సినిమాకి మహేష్, అనీష్, వెంకీ వచ్చి గ్లింప్స్‌కు వాయిస్ ఓవర్ చెప్పమన్నారు. నాకు నచ్చడంతో వాయిస్ ఓవర్ చెప్పాను. నాకు అనీష్‌తో పరిచయం ఉంది. తన తొలి సినిమాకే మూగవాడి క్యారెక్టర్ చేయడం నిజంగా చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. హీరో అనీష్ మాట్లాడుతూ.. నాగార్జున మా సినిమాను ప్రజెంట్ చేయడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని ఇచ్చింది. మాకు చాలా గర్వంగా ఉంది. వెంకీ కుడుముల మాట్లాడుతూ.. ఒక మనిషి స్టార్ అవడం గొప్ప. ఆ లెగసీని కంటిన్యూ చేయడం ఇంకా గొప్ప. ఆ లెగసీని కంటిన్యూ చేస్తూ కొత్త వారిని పరిచయం చేసి వాళ్లకు లైఫ్ ఇవ్వడం అన్నిటికంటే గొప్ప విషయం. అలాంటి గొప్ప మనిషి నాగార్జున. నాగార్జున ఈ సినిమాలో భాగం కావడమే. థాంక్యూ.

## 'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల



సుగి విజయ్, జుప్సీ భద్ర (తొలి పరిచయం) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్' ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంతో పరమేశ్ రేణు కుంట్ల దర్శకుడిగా పరిచయమ వుతున్నాడు. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన 'అప్పుడే పెళ్లా' అనే లిరికల్ వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. కాగా తాజాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి Gen Z తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం.జీవితం లో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో కనిపించనుంది. ప్రతి యువత ఈ సినిమాలో క్యారెక్టర్స్‌తో కనెక్ట్ అవుతారు. కొత్త దనం కోరుకునే ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే ఫ్రెష్ కంటెంట్ మా చిత్రంలో వుంది అన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి,ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్,బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ప్రముఖ నటి ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

## విజయ్ కార్తీక్ టీమ్‌ను అభినందించిన చిరంజీవి



బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి మరోసారి కలిసి చేస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా'. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనా లను నెలకొల్పుతోంది. టైటిల్ గ్లింప్స్‌కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.ఈ చిత్రానికి విజయ్ కార్తీక్ డీవోపీ పని చేస్తున్నారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి, విజయ్ కార్తీక్, ఆయన టీమ్‌ను అభినందించారు.విజయ్ కార్తీక్ డీవోపీగా పని చేసిన జైలర్ 2 ఇటీవలే విడుదలై విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా జైలర్ 2 కోసం వారు చేసిన అద్భుతమైన వర్క్‌ను ప్రశంసించారు మెగాస్టార్.ప్రస్తుతం కాకా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలో అనస్వర రాజన్, అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

## 'హైకూ' సిన్సియర్ లవ్ స్టోరి.. : కోన వెంకట్



హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ సినిమా నా హార్ట్ కి చాలా బాగా కనెక్ట్ అయింది. ఈ సినిమా కథ వినగానే బాగా నచ్చి వెంటనే ఓకే చేశా. లవ్ లో ఉన్నా, రిలేషన్ షిప్ లో ఉన్నా, మ్యారీడ్ కపుల్ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. . ఇది నా ఫస్ట్ డెబ్యూ. మీరంతా అక్టోబర్ 23 న థియేటర్ లో ఎంజాయ్ చేయండి. అన్నారు. హీరో ఏగన్ మాట్లాడుతూ.. నేను ఇండస్ట్రీకి కొత్త. హైకూ సినిమా క్లోజ్ తో మై హార్ట్. బాగా కష్టపడి సినిమా చేశాము. ఈ సినిమాపై నేను చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాను. మ్యూజిక్ డైరెక్టర్ సిద్దు కుమార్ బెస్ట్ మ్యూజిక్ ఇచ్చారు. డైరెక్టర్ యువరాజ్ చిన్నస్వామి నాకు పదేళ్లుగా తెలుసు. ఇప్పుడే మేమిద్దరం కలిసి సినిమా చేశాము. డైరెక్టర్ రామ్ జగదీశ్ మాట్లాడుతూ.. హైకూ తమిళ సినిమా ఇప్పుడు తెలుగులోకి వస్తోంది. హైకూ కి నా పర్సనల్ స్పెషల్ ఇంట్రెస్ట్ జాబిలీ (శ్రీదేవి). ఆమెకు ఇది తమిళ్ డెబ్యూ. ఆవిడ కళ్ళతో ఏ భాష అయినా మాట్లాడగలదు. ఈ సినిమా కోసం ఆమె చాలా కష్టపడింది. కోన వెంకట్ మాట్లాడుతూ.. హైకూ అక్టోబర్ 23న వస్తోంది.

## 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్

వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ ‘ఆకాశంలో ఒక తార్థతో పాన్ ఇండియా ప్రేక్షకులను అలరించేం దుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలతో గుర్తింపు తెచ్చు కున్న దర్శకుడు పవన్ సాధినేనితో దుల్కర్ సల్మాన్ తొలిసారి కలిసి పనిచేస్తున్న సినిమా ఇది. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కల్పన తన గ్రామం బౌండరీలు కూడా దాటలేదని చుట్టూ ఉన్నవారు చెబుతుంటారు. కానీ ఆమె మాత్రం భూమి హద్దులను దాటి ఆకాశాన్ని చేరుకుంటానని ధైర్యంగా చెబుతుంది. దుల్కర్ సల్మాన్ లాంటి స్టార్ ఇంతటి స్ఫూర్తిదాయకమైన, మహిళా సాధికారతను చాటిచెప్పే కథలో భాగం



కావడమే ఈ సినిమాకు తొలి విజయం. ఈ కథలో కథానాయిక పాత్రకు ప్రాధాన్యతనిస్తూ, ఆమె కలలకు అండగా నిలిచే విధానం దుల్కర్ కథల ఎంపికను మరింత ప్రత్యేకంగా నిలబెడు తుంది. సాత్విక వీరవల్లికి మంచి డెబ్యు రోల్ లభించింది. టీజర్‌లో ఆమె ప్రజెన్స్ ఎంతగానో ఆకట్టుకుంది. పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ, అసాధారణమైన కలలు, ఆశయాలు కలిగిన పాత్రకు ఆమె చక్కగా సరిపోయారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-195/6, Kanteshwar, Nizamabad-503001, RNI No. 64862/96, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.